RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com




# వుదయం




గుంటూరు 26-07-2026 ఆదివారం | సంపుటి : 13 | సంచిక : 134 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

## జంతర్‌మంతర్‌లో రగిలిన విద్యార్థుల పోరు



**న్యూఢిల్లీ, జూలై 25 (ఎఎంఎస్) :** విద్యావ్యవస్థలో జరుగుతున్న అవకతవకలు, అవినీతికి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా 'కాక్రోచ్ జనతాపార్టీ' ఆధ్వర్యంలో విద్యార్థుల బృందం చేపడుతున్న నిరాహార దీక్షకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. శనివారం దీక్షాశిబిరాన్ని సందర్శించిన ఆయన, ఆందోళన బాటపట్టిన విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశ విద్యావ్యవస్థలో పేరుకుపోయిన అవినీతికి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒక ప్రతీకగా మారారని విమర్శించారు. ఆయనను బాధ్యతల నుంచి వెంటనే తప్పించాలని, ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను మరోసారి స్పష్టం చేశారు.

**మంత్రి మార్పు కాదు.. తొలగింపే శరణ్యం!**

కేంద్ర విద్యాశాఖ మంత్రిని ఆ పదవి నుంచి తప్పించి మరొక శాఖకు బదిలీ చేయనున్నారనే వార్తలపై రాహుల్ స్పందిస్తూ.. "ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి పూర్తిగా తొలగించడం తప్ప వేరే ఏ నిర్ణయాన్ని కూడా విద్యార్థ లోకం ఆమోదించదు" అని తెగేసి చెప్పారు.

అలాగే, ప్రధాని నరేంద్ర మోదీ అర్ధరాత్రి వేళల్లో సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న వీడియోల వ్యవహారాన్ని ఈ సందర్భంగా రాహుల్ ప్రస్తావించారు. దేశ యువతకు, విద్యార్థులకు కావాల్సింది ప్రధాని పంపే వీడియోలు కాదని.. బాధ్యులపై తీసుకునే కఠిన చర్యలేనని స్పష్టం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

## చట్టసభల్లో యువతకు
# పీఠం దక్కాలి



**హైదరాబాద్, జూలై 25 (వుదయం) :** దేశంలో శాసనసభలు, పార్లమెంటు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల కనీస వయస్సును 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై త్వరలోనే తెలంగాణ రాష్ట్ర శాసనసభలో ప్రత్యేక తీర్మానం ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ శనివారం రాత్రి హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఈ నిరసన ప్రదర్శన సాగింది. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే సాధ్యం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోని పలు అభివృద్ధి చెందిన దేశాల్లో అమల్లో ఉన్నట్లుగానే భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశాన్ని కల్పించాలని కోరారు.

**యువత భాగస్వామ్యం:** దేశ జనాభాలో దాదాపు 30 శాతానికి పైగా ఉన్న యువశక్తికి చట్టసభల్లో నేరుగా ప్రాతినిధ్యం వహించే హక్కు దక్కాలని ఆకాంక్షించారు. చారిత్రక నిర్ణయం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రధాని అయిన వెంటనే పోటీ వయసును 21 ఏళ్లకు తగ్గించే చారిత్రక నిర్ణయం అమల్లోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కొవ్వొత్తుల ప్రదర్శనలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ శ్రేణులతో పాటు పెద్ద సంఖ్యలో 'జెన్‌జీ' (GenZ) విద్యార్థులు, యువత పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు భరోసాగా కేంద్ర



**హైదరాబాద్, జూలై 25 (వుదయం) :** దేశంలో ప్రశ్నపత్రాల లీకేజీల నిరోధానికి కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక కఠిన చట్టాలను తీసుకువస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీఎస్‌ఎస్ రామచందర్‌రావు కొనియాడారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకునే లీకేజీ మూఠాలపై ఉక్కుపాదం మోపేలా చట్టాన్ని మరింత బలోపేతం చేస్తున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకేజీ అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2024లోనే సమగ్ర చట్టాన్ని తీసుకువచ్చిందని, ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఆ చట్టానికి కీలక సవరణలు చేయబోతున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా రామచందర్‌రావు పునరుద్ఘాటించారు.

## రగిలిపోతున్న అడవులు
# 2 లక్షల మంది తరలింపు!



**పారిస్ :** ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని దట్టమైన అటవీ ప్రాంతంలో తీవ్రస్థాయిలో కార్చిచ్చు రగులుకుంది. శుక్రవారం సాయంత్రం మొదలైన ఈ దవాగ్ని ఈదురు గాలుల తాకిడికి వేగంగా వ్యాపిస్తూ పరిసర ప్రాంతాలను బూడిద చేస్తోంది. మంటల ఉద్ధృతికి భారీగా పొగలు అలుముకోవడంతో వాయు నాణ్యత తీవ్రంగా క్షీణించింది. ప్రమాద తీవ్రతను గుర్తించిన ఇరు దేశాల యంత్రాంగం అప్రమత్తమై, ముందస్తు జాగ్రత్త చర్యగా ఇప్పటివరకు దాదాపు 2 లక్షల మంది స్థానిక ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించింది.

## విద్యార్థుల ఆందోళనకు దిగొచ్చిన కేంద్రం



**న్యూఢిల్లీ, జూలై 25 (ఎఎంఎస్)** దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పేపర్ లీకేజీ, నిర్వహణ అక్రమాల వ్యవహారంలో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. తీవ్ర స్థాయిలో వ్యక్తమవుతున్న విద్యార్థులు, ప్రతిపక్షాల ఆందోళనల నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పంపించినట్లు ఆయన శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు.

**యువశక్తి ఆకాంక్షల కోసమే ఈ నిర్ణయం: ధర్మేంద్ర ప్రధాన్**

తన రాజీనామా లేఖకు సంబంధించి ధర్మేంద్ర ప్రధాన్ సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. "గత పది రోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు నన్ను తీవ్రంగా కలచివేశాయి. వ్యక్తిగత భేషజాలకు పోకుండా దేశ యువత ఆకాంక్షలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నాను. ఈ దేశ అసలైన బలం యువశక్తే. వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే నా పదవికి రాజీనామా చేస్తున్నాను" అని పేర్కొన్నారు.

**విధుల నిర్వహణలో వెనుకంజ వేయలేదు**

నీట్ అక్రమాలు వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని ప్రధాన్ గుర్తుచేశారు. "బాధ్యతల నుంచి నేను ఎప్పుడూ తప్పుకోలేదు. ఘటనపై తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించడమే కాకుండా, విద్యార్థులకు న్యాయం చేసేందుకు విజయవంతంగా మళ్లీ పరీక్షలను నిర్వహించాం. అయితే దేశ సమగ్రతను దెబ్బతీసే విద్రోహ శక్తులకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదనే భావనతోనే తప్పుకుంటున్నాను. విద్యార్థులు ఇకపై నిరసనలు విడనాడి తమ చదువులపై దృష్టి సారించాలి. ఇన్నాళ్లూ దేశానికి సేవ చేసే అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు" అని ఆయన ఆ లేఖలో స్పష్టం చేశారు.

## విద్యార్థులపై కేసులు
## ఎత్తివేతకు ప్రభుత్వం అంగీకారం

**హామీ నెరవేరుస్తాం: కేంద్ర మంత్రి జేపీ నడ్డా**



**న్యూఢిల్లీ, జూలై 25 (ఎఎంఎస్)** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థులు, యువత చేపట్టిన సుదీర్ఘ ఆందోళనలు ఎట్టకేలకు ముగిశాయి. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో పాటు తాము కోరిన ఇతర అంశాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో నిరసనలు విరమిస్తున్నట్లు 'కాక్రోచ్ జనతాపార్టీ' (CJP) అధికారికంగా ప్రకటించింది.

కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేసిన అనంతరం సీజేపీ ప్రతినిధుల బృందం కేంద్ర ప్రభుత్వంతో మరొక దఫా చర్చలు జరిపింది. చర్చల అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో కలిసి సీజేపీ నేతలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**చర్చల్లో కుదిరిన కీలక అంగీకారాలు:**

కేసుల ఎత్తివేత: ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేసిన నిరసనకారులపై నమోదైన అన్ని రకాల కేసులను నాలుగు రోజుల్లోగా ఉపసంహరించుకోవడానికి కేంద్రం అంగీకరించింది.

వేధింపులు ఉండవు: భవిష్యత్తులో విద్యార్థులను లేదా నిరసనకారులను కేసుల పేరుతో ఎలాంటి వేధింపులకు గురిచేయబోమని స్పష్టమైన హామీ ఇచ్చారు.

పరిహారం & మార్పులు: నీట్ లీకేజీ ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తగిన ఆర్థిక పరిహారం అందించడానికి, దేశ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి కేంద్రం సమ్మతించింది.

**హామీ నెరవేరుస్తాం:** కేంద్ర మంత్రి జేపీ నడ్డా నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు ప్రభుత్వం పూర్తిగా అంగీకరించిందని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు.




## ఉద్యోగాల కోతకు
# ఏఐ పరికరం కాదు

**ఏఐపై ప్రజల విశ్వాసం పెంచాలి**
**మానవ సామర్థ్యానికే 'ఏఐ' ఊతం**
**కేవలం సాయపడే సాధనమే**

**ఉద్యోగాల తొలగింపునకు వాడొద్దు : సత్య నాదెళ్ల**



**న్యూయార్క్ :** ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (AI) సృష్టిస్తున్న సంచలనం ఒకవైపు, ఐటీ రంగంలో ఉద్యోగాలు ఊడిపోతాయన్న భయాలు మరోవైపు నెలకొన్న తరుణంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ సాంకేతికత వల్ల మానవ ఉద్యోగాలు కనుమరుగవుతాయనే భయాల కారణంగానే ప్రజలు ఈ సాంకేతికతపై నమ్మకాన్ని కోల్పోతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ భయాలను తొలగించి, ఏఐపై ప్రజలకు మళ్లీ విశ్వాసం కలిగేలా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

స్థానిక ప్రయోజనాలను వివరించాలి

సాంకేతికత అవసరాన్ని ప్రజలు గుర్తించాలంటే వారితో పారదర్శకత అవసరమని నాదెళ్ల స్పష్టం చేశారు. ఉదాహరణకు, ఏదైనా ఒక సంస్థ నూతనంగా డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే, దానివల్ల స్థానిక ప్రజలకు చేకూరే ప్రయోజనాలను స్పష్టంగా వివరించాలన్నారు. ప్రస్తుతం ఏఐ కేవలం ఉత్పాదకతను పెంచడానికే కాకుండా అన్ని రంగాల్లోనూ విస్తరిస్తోందని, అందువల్ల రాబోయే 'ఏఐ యుగం' గతంతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉండబోతోందని పేర్కొన్నారు.

ఉద్యోగులను తీసేయడానికి ఏఐని వాడొద్దు

కంపెనీలు ఉద్యోగులను విధుల్లోంచి తొలగించి వారి స్థానంలో ఏఐని పునరుద్ధరించడం సరైన విధానం కాదని సత్య నాదెళ్ల హితవు పలికారు.

**మానవ సామర్థ్యాల పెంపు:** మానవ మేధస్సు, సృజనాత్మకతలకు ఏఐ తోడైనప్పుడే భవిష్యత్తులో సంస్థలు పురోగమిస్తాయి.

కేవలం ఒక సాధనమే: ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకుండా, మానవ ఆలోచనలను మరింత పదును పెట్టే ఒక సహాయక సాధనంగా మాత్రమే చూడాలి.

**పరస్పర అభ్యాసం:** మానవులు, ఏఐ వ్యవస్థలు నిరంతరం ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటూ ముందుకు సాగే నూతన శకంలోకి నేటి వ్యాపార రంగాలు అడుగుపెడుతున్నాయి. నూతన ఉద్యోగావకాశాలను సృష్టించడానికి, ఉద్యోగులకు మెరుగైన వేతనాలు అందించడానికి ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని మైక్రోసాఫ్ట్ సీఈఓ పలు సంస్థలకు సూచించారు.





## ప్రభుత్వ పశువైద్యశాలలో డాక్టర్ల కొరత

- పశుపోషకులు గంటల తరబడి పడిగాపులు
- వైద్యశాలలో అందుబాటులో లేని డాక్టర్ లు

కోహిర్, జూలై 25 (వుదయం ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాలలో ఆసుపత్రిలో పశువైద్యులు (డాక్టర్లు), సిబ్బంది అందుబాటులో లేకపోవడం తో పశుపోషకులు కోహిర్. బిలాల్ పూర్ పోతిరెడ్డిపల్లి,ఖానాపూర్ ,పైడిగుమ్మల్, కొత్తూర్.ఆయా గ్రామాల నుంచి వచ్చే రైతులు, పశుపోషకులు తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారు.సీజన్ ఆకర వ్యాధుల బారిన పడిన పశువులను, జీవాలను చికిత్స కోసం తీసుకొస్తే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంద ని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయంలో సరైన వైద్యం అందక పదుల సంఖ్యలో మేకలు, గొర్రెలు, పాడి పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఇతర దూర ప్రాంతా లకు తీసుకెళ్లే లోపే జీవాలు ప్రాణాలు వదులుతుండటంతో నిరుపేద రైతులు వేలాది రూపాయల ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నారు. ప్రైవేట్ వైద్యం చే యించుకునే స్తోమత లేక, ఇక్కడ పశు వైద్యశాలల్లో పట్టించుకునే నాథుడు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు. తమ జీవనో పాధికి ఆధారమైన జీవాలు కళ్లముందే చనిపోతుంటే పశుపోషకులు తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కోహిర్ పశువైద్యశాలల్లో పూర్తిస్థాయి డాక్టర్లను, సహాయక సిబ్బందిని ని యమించాలని, అలాగే నిబంధనల ప్రకారం మృతి చెందిన జీవాలకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు, పశుపోషకులు డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలల్లో అక్రమంగా పుస్తకాల విక్రయం పై చర్యలు తీసుకోవాలి



- అదనపు కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్ యు ఐ

నారాయణపేట టౌన్, జూలై 25(వుదయం ప్రతినిధి):

నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ ఎస్ ఎఫ్ ఐ, ఎన్ ఎస్ యు ఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత ఎం ఈ ఓ, డి ఈ ఓ అధికారులకు ఫిర్యాదు చేయ డానికి ప్రయత్నించగా, తమకు సరైన స్పందన లభించలేదని వారు తెలిపారు.ఈ వ్యవహారంపై నారాయణపేట అదనపు కలెక్టర్ శీనును కలిసి ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా ర్థులు, తల్లిదండ్రులపై అనవసరమైన పుస్తకాల భారం మోపకుండా, అక్రమ పుస్తకాల విక్రయంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకో వాలని నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే వారిని అధికారులు నిర్లక్ష్యంగా చూడకుండా, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యార్థుల హక్కుల కోసం అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతా మని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, ఎన్ఎస్ యు ఐ రాష్ట్ర నాయకులు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకాదశి రోజు ఇంట్లో పూజ ఇలా చేయాలి

- వేద పండితులు మహర్షి శాస్త్రుల వామన శర్మ....

వుదయం న్యూస్, శ్యాంపేట జూలై 25:



వేద పండితులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వామన శర్మ తొలి ఏకాదశి గురించి ఆయన ఇలా వివరిస్తున్నారు. ఈ రోజు ఉదయం బ్రహ్మముహూర్తంలో నిద్రలేచి ఇంటిని పరిశుభ్రంగా ఉంచి స్నానం చేయాలి.అనంతరం పూజా మందిరాన్ని శుభ్రపరచి లక్ష్మీనారాయణుల చిత్రపటం లేదా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీనరసింహస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వంటి విష్ణు స్వరూపాల చిత్రాన్ని ప్రతిష్ఠించాలి. చిత్రపటా నికి గంధం, కుంకుమతో తిలకాలు పెట్టి పుష్పాలతో అలంకరించాలి. పచ్చకర్పూరం కలిపి తయారు చేసిన తీపి నైవేద్యాన్ని సమర్పించి దీపారాధన చేయాలి. తులసీదళాలతో అర్చన చేస్తూ "ఓం లక్ష్మీనారాయణాయ నమః" అనే మంత్రాన్ని 21, 54 లేదా 108 సార్లు జపించడం శ్రేయస్కరంగా భావిస్తారు. తులసీదళాలు అందుబాటులో లేకపోతే తెల్లగన్నేరు, సంపెంగ, తుమ్మి, జాజి వంటి పుష్పాలతో కూడా విష్ణుమూర్తిని పూజించవచ్చు అని వివరించారు.



## రాజీ మార్గం ద్వారా కేసుల పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు

నారాయణపేట టౌన్, జూలై 25(వుదయం ప్రతినిధి):

రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్క రించుకోవచ్చని నారాయణపేట జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యం లో శనివారం జరిగిన కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూ ర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. ఈ సం దర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుంద ని న్యాయమూర్తి తెలిపారు. సెప్టెంబర్ లో జరిగే 3వ జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్ధంగా ఉండాలని అధికా రులను ఆదేశించారు.ఈ జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు ఉపయోగిం చుకునేలా తగు చర్యలు తీసుకోవాల న్నారు. జూన్ 20న జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా మొత్తం 5300 కేసులు డిస్పోజల్ చేసి నారాయణపేట జిల్లా రాష్ట్రంలో 18వ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన, న్యాయమూర్తు లను , పోలీస్ అధికారులని అభినందిం చారు. తదుపరి సెప్టెంబర్ 12వ లోక్ అదాలత్ లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, ఎన్ఐ యాక్ట్, ఈపీ కేసులు, సైబర్ క్రైమ్స్, ఎన్ బి డబ్ల్యూ కేసులను డిస్పోజల్ చేయాలని, ముఖ్యంగా జైలులో ఉన్న ఖైదీల కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. తదుపరి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను యధావిధి గా కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో డి.ఎల్.ఎస్.ఎ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్, జూనియర్ సివిల్ జడ్జి సుస్మిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అవినాష్, డీఎస్పీ లింగయ్య, డిఈఈ రాములు, పోలీస్ సిబ్బంది, భరోసా, సఖి సెంటర్ సిబ్బంది, సిడబ్ల్యు సి సభ్యులు రాధా ఇతర శాఖ అధికారు లు పాల్గొన్నారు.

## పవర్ 'కోత'.. సాగు 'కోత'!

- నాణ్యమైన కరెంట్‌పై ఒట్టి కోతలే.. నిలువునా ఎండిపోతున్న పంటలు
- చీకట్లో ప్రాణాలకు తెగించి పొలాల బాట..
- లో-వోల్టేజ్ ధాటికి మోటార్లు గాల్లో.. పైసల భారం రైతులపైనే!
- కేటీదొడ్డి మైలగడ్డ వద్ద రహదారి దిగ్బంధం.. డీఈ హామీతో విరమణ

కేటీదొడ్డి, జూలై 25 (వుదయం బ్యూరో):

ప్రభుత్వం చెప్పే మాటలు కోటలు దాటు తున్నాయి.. కానీ తీరా పొలానికి పోయి చూస్తే ఒక్క చుక్క నీరు వచ్చేందుకు కరెంట్ దొరకడం లేదు! నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామంటూ పాలకులు చే స్తున్న ప్రచారాలన్నీ పచ్చి కంటితుడుపు చర్యలేనని రైతన్నలు తీవ్ర అగ్రహంతో రగిలిపోయారు. చాలీచాలని వోల్టేజ్, ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని విద్యుత్ కోతలతో పంటలు నిలువునా ఎండిపోతున్నాయని మం డిపడుతూ గద్వాల నియోజకవర్గం కేటీదొడ్డి మండల కేంద్రంలోని మైలగడ్డ స్టేజి వద్ద శనివారం రైతాంగం కదంతొ క్కింది. రహదారిపై బైఠాయించి కరెంట్ కష్టాలపై ధర్నా చేపట్టింది. ఈ నిరసన పోరాటానికి భారతీయ జనతా పార్టీ నాయకులు పూర్తి మద్దతు ప్రకటించ గా, జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి పాల్గొని విద్యుత్ శాఖ అధికారుల తీరుపై, ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిప్పులు చెరిగారు.

**కాటేస్తున్న కరెంట్ కష్టాలు!**

ధర్నా ప్రాంగణంలో డీకే స్నిగ్ధ రెడ్డి మా ట్లాడుతూ.. ఉచిత నాణ్యమైన విద్యుత్ హామీలు కేవలం కాగితాలు, పత్రికా ప్రకటనలకే పరిమితమయ్యాయని ధ్వ జమెత్తారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే వారి గొంతు కోస్తోంది!



పగటిపూట కరెంట్ ఇవ్వక, అర్ధరాత్రి వేళల్లో ఇస్తుండటంతో చీకటి రాజ్యంలో కాటేసే పాములు, తేళ్ల భయంతో అన్నదాతలు ప్రాణాలను పణంగా పెట్టి పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. వచ్చిన కొ ద్దిసేపైనా వోల్టేజ్ ఉండదు..స్తంభించిన రాకపోకలు..

**దిగొచ్చిన డీఈ!**

రైతుల తీవ్ర నిరసనతో మైలగడ్డ స్టేజి వద్ద గంటల తరబడి వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. తీవ్ర ఉద్రిక్తత వా తావరణం నెలకొనడంతో విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) రవిప్రసాద్ హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. రైతులు, నాయకుల డిమాండ్లను విన్న ఆయన.. సబ్‌స్టేషన్ల పరిధిలోని లోవోల్టే జ్ సమస్యలను త్వరితగతిన సరిచేసి, విద్యుత్ అంతరాయాలు లేకుండా చూస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అధికారి హామీతో రైతులు తమ ఆందో ళనను తాత్కాలికంగా విరమించారు.

ఈ ధర్నా కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట రాములు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్య క్షుడు దరూర్ కిష్టన్న, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి, ఉపసర్పంచ్ భీమ్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, పరిసర గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కమీషనర్ తో భేటీ అయిన మెట్టు శ్రీధర్

ఇస్నాపూర్ (వుదయం):

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించి, మున్సిపాలిటీని పరిశుభ్రమైన, హరిత, ఆధునిక మరియు ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని నవభార త్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్య క్షులు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక ప్రాంతా ల్లో ఇంటి నంబర్ల కేటాయింపులో అస్ప ష్టత, పునరావృత నంబర్లు, నంబర్లు లేకపోవడం వంటి సమస్యల వల్ల ప్రజలు ఆస్తి పన్ను చెల్లింపులు, విద్యుత్, తాగునీటి కనెక్షన్లు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు ఇతర అధికారిక సేవలను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యేక సర్వే నిర్వహించి ఇంటి నంబర్ల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

ఇస్నాపూర్ మున్సిపాలిటీని పరిశుభ్ర మైన, హరిత మరియు ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్ర త్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి వార్డులో క్రమబద్ధ మైన చెత్త సేకరణ, మొక్కల పెంపకం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగ ని యంత్రణతో పాటు ప్రజల్లో విస్తృత అవ గాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపాలిటీ పరిధిలోని అనేక కాలనీ ల్లో అంతర్గత సీసీ రోడ్లు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో నాణ్యమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరారు.



అదేవిధంగా పిల్లలు, మహిళలు, యువత మరియు వృద్ధుల ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించేలా ప్రతి వార్డు లేదా కాలనీలో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే మున్సిపాలిటీ పరిధిలో అభి వృద్ధి చెందుతున్న కొత్త కాలనీలు మరియు కొత్తగా నిర్మించిన ఇండ్లకు ఇప్పటికీ మున్సిపల్ తాగునీటి కనెక్ష న్లు అందుబాటులో లేని ప్రాంతాలను గుర్తించి, అవసరమైన పైప్‌లైన్ విస్తరణ చేపట్టి, అర్హులైన ప్రతి ఇంటికి త్వరిత గతిన తాగునీటి కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రజలకు సురక్షిత మైన తాగునీటి సరఫరా అందించడం మున్సిపాలిటీ ప్రాధాన్యతగా ఉండాలని సూచించారు.ఇస్నాపూర్ మున్సిపాలిటీ ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతి నిధులు మరియు ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని మెట్టు శ్రీధర్ ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు

## హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి.. విద్యార్థుల ఆరోగ్యానికి బిగ్ అలర్ట్!

- కలెక్టర్ ఆదేశాలతో బీసీ బాలుర వసతి గృహంలో ముమ్మర వైద్య తనిఖీలు
- పరిసరాలు శుభ్రంగా లేకపోతే కఠిన చర్యలు – అధికారుల హెచ్చరిక

ధరూర్ జూలై 25 (వుదయం బ్యూరో)

వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా యంత్రాంగం కదిలింది. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం, ముమ్మర తనిఖీలు చేపట్టారు. క్యాంపులో భాగంగా వసతి గృహంలోని ప్రతి విద్యార్థికీ పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లా డుతూ... సీజనల్ వ్యాధులు ప్రబలుతు న్న వేళ విద్యార్థులు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలుషిత నీరు, ఆహారం వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ, వ్యక్తిగత పరిశుభ్ర తతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు.

అణువణువూ తనిఖీ.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు!

వైద్య పరీక్షల అనంతరం అధికారులు హాస్టల్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థుల నివాస గదులు,



వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, తాగునీటి వసతి మరియు మురుగునీటి పారుదల వ్యవస్థలను అణువణువూ పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో గానీ, పరిశు భ్ర మైన వాతావరణం కల్పించడంలో గానీ ఎలాంటి అలసత్వాన్ని ఉపేక్షించే ది లేదని సిబ్బందిని గట్టిగా హెచ్చరిం చారు. విద్యార్థుల క్షేమానికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని, సమ స్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి పరిష్క రించేందుకే ఈ తరహా ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామని అధికారు లు తెలిపారు.

## ప్రతి విద్యార్థి ఉన్నత మార్కులు సాధించాలి, నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

తెలకపల్లి, జులై 25 (వుదయం ప్రతినిధి) :

విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శనివారం

తెలకపల్లి మండలంలో విస్తృతంగా ఆక స్మిక తనిఖీలు నిర్వహించారు.

అంగన్వాడీ, జడ్పీ స్కూల్ తనిఖీ తెలక పల్లి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలను సందర్శించిన కలెక్టర్ చిన్నా రులకు అందుతున్న పోషకాహారం, కేంద్రం పరిశుభ్రత, విద్యా సామగ్రిని పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడి ఏబీసీడీలు, బొమ్మలు గుర్తిస్తున్నారా అని పరీక్షించారు. ఆటల ద్వారా బోధన, నా ణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు.

జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి బోధన, పరీక్షల సన్నద్ధతపై ఆరా తీశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్ర త్యేక తరగతులు నిర్వహించి, ప్రతి విద్యా ర్థి ఉత్తీర్ణతతో పాటు ఉన్నత మార్కులు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యా యులకు సూచించారు. ఆగస్టు 10లోపు పుస్తకాలు, యూనిఫాంలు అన్ని విద్యా ర్థులకు అందేలా చూడాలని ఆదేశించా రు. తెలకపల్లి పీహెచ్‌సీ తనిఖీ

తెలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ వైద్యులు, సిబ్బంది హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల నిల్వలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని, అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని వైద్యులను ఆదేశించారు. కుక్క కాటు, పాము కాటు మందులు తగినంతగా ఉండాలని సూచించారు. ఆయుష్ వైద్యులు ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలి, పోషకాహారం, యోగా, వ్యా యామంపై అవగాహన కల్పించాలని తెలిపారు.

గౌరారం గ్రామం, SIR తనిఖీ

గౌరారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతు లను సందర్శించిన కలెక్టర్, చిన్నారుల అభ్యాసంపై ఉపాధ్యాయులతో చర్చిం చారు. ప్రీ ప్రైమరీ విద్య భవిష్యత్‌కు పునాది అని, ప్రతి చిన్నారి క్రమం తప్ప



కుండా హాజరయ్యేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు.

అదే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలిం చి, నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.

తెలకపల్లి మండల కేంద్రంలో కొన సాగుతున్న ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ప్రతి అర్హులైన ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని, పారదర్శకంగా వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లా కలెక్టర్ వెంట మండల స్థాయి అధికారులు, వైద్యులు, ఉపాధ్యాయు లు, సిబ్బంది ఉన్నారు.

## చేవెళ్ల కాంగ్రెస్‌లో 'పాత–కొత్త' కుంపటి!

- యాదయ్య వర్సెస్ భీమ్ భరత్.. ఆధిపత్య పోరుతో రగులుతున్న కాంగ్రెస్
- మండల అధ్యక్షుల నియామకాలతో భగ్గుమన్న విభేదాలు
- గాంధీభవన్ మెట్లెక్కిన అసంతృప్తి నేతలు

వికారాబాద్, జూలై 25 (వుదయం బ్యూరో):

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుతున్నాయా? పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన పాత కాంగ్రెస్ నేతలు, బీఆర్ఎస్ నుంచి కాం గ్రెస్‌లోకి వచ్చిన నేతల మధ్య ఆధిపత్య పోరు రోజురోజుకూ ముదురుతోందా? తాజా పరిణామాలు చూస్తే అవుననే సమాధానం వస్తోంది. ఎమ్మెల్యే కాలే యాదయ్య, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ భీమ్ భరత్ వర్గాల మధ్య సమ న్వయం కొరవడటంతో నియోజకవర్గ కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు బహి ర్గతమవుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది.

**ఒకే పార్టీలో.. రెండు వర్గాలు!**

బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మె ల్యే కాలే యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత చేవెళ్ల నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారిపోయా యి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్య ర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన భీమ్ భరత్ ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ ఇద్దరూ కాంగ్రెస్‌లోనే ఉన్నప్పటికీ.. క్షే త్రస్థాయిలో మాత్రం రెండు వర్గాలుగా పార్టీ శ్రేణులు విడిపోయాయనే ప్రచారం జరుగుతోంది.ఎవరికి వారే అన్నట్టుగా కార్యక్రమాలు నిర్వహించడం, పదవుల విషయంలో తమ వర్గం వారికి ప్రాధాన్యం కల్పించేందుకు ప్రయత్నాలు చేయడం వంటి పరిణామాలు పార్టీ అంతర్గత విభే దాలకు మరింత ఆజ్యం పోస్తున్నాయని కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

**'బీఆర్ఎస్ నేతలకే పదవులా?'**

కాలే యాదయ్య కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి నియోజకవర్గంలో పాత కాంగ్రెస్ నేతలు, బీఆర్ఎస్ నుంచి వచ్చిన నేతల మధ్య దూరం పెరుగుతోందనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన తమను విస్మరించి.. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు, ప్రాధాన్యం ఇవ్వడం వల్లే కేడర్‌లో అసంతృప్తి పెరుగుతోందని పాత కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. 'పార్టీ కష్టకాలంలో జెండా మోసిన కార్యకర్తల సంగతేంటి?' అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామాలు పార్టీ క్షేత్రస్థాయి నిర్మాణంపై ప్రతికూల



ప్రభావం చూపుతున్నాయని జిల్లా స్థాయి నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.అధికార పార్టీగా కాంగ్రెస్ బలంగా ఉండాల్సిన సమయంలోనే అంతర్గత కుమ్ములాట లు బహిర్గతం కావడం పార్టీకి నష్టం చేస్తుందని కొందరు సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు.ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఇన్‌చార్జ్ భీమ్ భరత్ వర్గాల మధ్య సమన్వయం కుదిర్చి..పాత, కొత్త నేతల మధ్య నెలకొన్న విభేదాలకు పార్టీ అధిష్ఠానం వెంటనే తెరదించాలని కేడర్ కోరుతోంది.ఇప్పటికే గాంధీభవన్ వరకు చేరిన చేవెళ్ల కాంగ్రెస్ అంతర్గత వివాదం.. రానున్న రోజుల్లో ఇంకెంత దూరం వెళ్తుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

## కె వీరారెడ్డి జన్మదిన వేడుకలు



మరికల్ జులై 25 (వుదయం ప్రతినిధి)

మరికల్ మండల కేంద్రంలోని శనివారం ఘనంగా కీర్తి శేషులు మాజీ ఎమ్మెల్యే మరియుAPCOB చైర్మన్ డిసిసి చైర్మన్ ఘనంగా జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు జరుపుకున్నారు ఇందిరమ్మ చివరస్త దగ్గర ఫోటోకు పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు ఆయన తనయుడు నాదంపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు కే ప్రశాంత్ కుమార్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాదికల్ ప్రభుత్వ ఆసుప త్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవత్వాని చేశారు ఆయన ఈ సమా వేశంలో మాట్లాడుతూ మా మా నాన్న ప్రజలకు ఎన్నో సేవలు చేశారని ఆయన కల్లాకపటం లేని వ్యక్తిని ఆయన కొని యాడారు ఈ కార్యక్రమంలో జిల్లా ఓ బి సి చైర్మన్ కృష్ణయ్య కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి మాజీ మండల అధ్యక్షులు శ్రీ వీరన్న మాజీ ఎంపిటిసి సీమ గోపాల్ నారాయణపేట జిల్లా డిసిసి కార్యదర్శి వెంకట రాములు చారి గురుకుల ఒకసారి పంచి నరసింహ మరికల్ ఉపసర్పంచి కాజా బొంత మొ గులయ్య సలీం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి



- ఎంఈఓ ఇందిర ప్రియా
- చంద్రవంచ ఎంపీపీఎస్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

తాండూర్, జూలై 24 వుదయం ప్రతినిధి:-

పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడమే ప్రధాన లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) ఇందిర ప్రియా పిలుపునిచ్చారు. చంద్రవంచ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాల ను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, హాజరు పట్టికలు, బోధనా పద్ధతులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు చేశారు.ముఖ్యమైన అంశాలు, సూచనలు

**నాణ్యమైన విద్య:**

ప్రాథమిక దశలోనే పిల్లలకు పునాది గట్టిగా ఉండేలా సులభమైన, సమర్థవం తమైన పద్ధతుల్లో బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.క్రమ శిక్షణతో కూడిన విద్యను విద్యార్థులు ని బద్ధత, క్రమశిక్షణ అలవాటు చేసుకొని, బాగా చదువుకొని తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావా లని ఆకాంక్షించారు.బాధ్యతాయుత మైన పౌరులుగా రూపుదిద్దాలి:కేవలం పుస్తకాల జ్ఞానమే కాకుండా, నైతిక విలువలను కూడా నేర్పిస్తూ పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.సమాజ అభివృద్ధి విద్యావ్యవస్థపైనే ఆధారపడి ఉంటుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయు తంగా పనిచేసి పాఠశాల పురోగతికి తో డ్పడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జై పాల్ రెడ్డి , సుభాష్ సి ఆర్ పి పాల్గొన్నారు.

## ధర్మేంద్ర రాజీనామా విద్యార్థి శక్తి విజయం

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్

నారాయణపేట టౌన్, జూలై 25(వుదయం ప్రతినిధి):



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి శక్తి విజ యమని నారాయణపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్,ఎబివిపి పూర్వ నాయకుడు బండి వేణుగోపాల్ ఒక ప్రక టనలో పేర్కొన్నారు.విద్యార్థుల ఐక్యత, పోరాట పటిమ ముందు ఎంతటి పెద్ద వ్యక్తి అయినా తలవంచాల్సిందేనని మరోసారి రుజువైందన్నారు. స్టూడెం ట్స్ పవర్ నేషన్ పవర్ అనే సూక్తి నేడు నిజమైందన్నారు.విద్యార్థుల హక్కు లను కాలరాస్తూ, అక్రమాలకు పాల్ప డిన ధర్మేంద్ర తన పదవికి రాజీనామా చేయడమే ఇందుకు రుజువు అన్నారు. వారం రోజులుగా విద్యా ర్థులు, యువత చేసిన శాంతియుత నిరసనలు, సోషల్ మీడియా ఉద్య మం, ప్రజల మద్దతు వల్లనే ఈ నిర్ణయం సాధ్యమైం దన్నారు.ఇది ఒక్క వ్యక్తి రాజీనామా కాదు ఇది ప్రజాస్వామ్యానికి, విద్యార్థి శక్తికి దక్కిన విజయం అన్నారు.విద్యా వ్యవస్థను కాపాడేందుకు, అవినీతికి తావు లేకుండా చేయడానికి విద్యార్థులు ఇకపై కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు.ప్రజల గొంతు విన్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇకనైనా విద్యార్థుల భవి ష్యత్తుకు భరోసా ఇచ్చే నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యా ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలి



- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

మరికల్, జూలై 25 (వుదయం ప్రతినిధి):

విద్యా ఫలితాల్లో వచ్చే సంవత్సరం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవా లని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. శనివారం మరికల్ మండల కేంద్రం లోని ఎమ్మార్సీ సెంటర్ లో మరికల్ మండలంలోని ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ టీచర్స్ మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూశిక్షణ ఎలా జరుగుతోంది, ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారు అనే విషయాన్ని ప్రత్యక్షంగా చూడాలనే ఆసక్తితో శిక్షణ కార్యక్రమానికి వచ్చానని తెలిపారు. వచ్చే ఏడాది మన జిల్లా విద్యా ఫలితాల్లో మరింత మెరుగైన స్థాయికి చేరుకొని, రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలని ఆమె ఆకాంక్షించారు. ఇప్పటి నుంచే మనమంతా కలిసి కృషి చేస్తే ఆ లక్ష్యా న్ని తప్పకుండా సాధించగలం అన్నారు. పిల్లలు నేర్చుకున్న విషయాలను గుర్తుం చుకోవడమే ముఖ్యమైన లక్ష్యం అని ఆమె తెలిపారు. ముఖ్యంగా ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం లో ఇంగ్లీష్, గణితం వంటి ప్రాథమిక అంశాలు ఎంతో కీలకం అన్నారు. ఈ బలమైన పునాదిపైనే వారి భవిష్యత్తు విద్య నిర్మాణం జరుగుతుందన్నారు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు కొంత అదనపు శ్రద్ధ, సమయం, శక్తి కేటాయించడం చాలా అవసరం అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎన్నో సామాజిక, ఆర్థిక సవాళ్ల మధ్య నుంచి వస్తుంటారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసి ల్దార్ రామ్ కోటి, ఎం ఇ వో కరిముల్లా, ఏ ఎం వో విద్యా సాగర్, మాస్టర్ ట్రైనీ లు తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ లో వివరాలను నమోదు చేసుకోండి..



ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియలో పాల్గొని పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఏలియన్స్ స్పేస్ స్టేషన్ అపార్ట్మెంట్ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రచార రథాలు, ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదు... ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తి అన్నారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల భవిష్యత్తు, సంక్షేమానికి ప్రతి ఓటు ఎంతో విలువైనది. అందుకే ప్రతి అర్హుడైన ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలని ఆయన స్పష్టం చేశారు.అనంతరం ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ ప్రచార రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్..బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**- అమీన్పూర్‌లో రూ.80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.**

**- ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రథమ ప్రాధాన్యత**

**అమీన్పూర్**
**జులై, 25(వుదయం)**

అమీన్పూర్ పరిధిలోని ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు . శనివారం అమీన్పూర్ డివిజన్‌లోని ఆర్ఆర్ హోమ్స్, ఎస్ఎస్ అపార్ట్‌మెంట్, దుర్గా హోమ్స్ కాలనీలలో రూ.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అమీన్పూర్‌లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పైప్‌లైన్ విస్తరణ పనులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతులను కల్పించి, అమీన్పూర్‌ను ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్క ఓటరు పాల్గొని.. తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. స్థానికంగా నమోదు చేసుకునే ప్రతి ఓటు అభివృద్ధికి పునాది లాంటిదని తెలిపారు. పటాన్చెరు అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు చంద్రకళ గోపాల్, కృష్ణ, ప్రమోద్ రెడ్డి, జగదీష్, రాజు, చంద్రశేఖర్, రుశ్వంత్ రెడ్డి, దాసు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## అమీన్పూర్ లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్..



**- అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనాలని విజ్ఞప్తి..**

**అమీన్పూర్**
**జులై 25( వుదయం )**

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ) లో అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలు సమర్పించి పటాన్చెరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను శనివారం ఉదయం ఆయన స్వయంగా పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. సాఫ్ట్ వేర్, ఫార్మా ఉద్యోగులు అధికంగా నివసించే గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్మెంట్లు, కాలనీలలోఎస్ఐఆర్ ప్రక్రియపై మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జులై 25 వ తేదీ వరకు 59 శాతం మాత్రమే నమోదు కావడం జరిగిందని.. మరో 20 శాతం వరకు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఓటు హక్కు అత్యంత కీలకమని.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగి ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పై అవగాహన కల్పించడంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, ప్రచార వాహనాలు, సోషల్ మీడియా ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు మహాదేవ రెడ్డి, కృష్ణ, ప్రమోద్ రెడ్డి, చంద్రశేఖర్, దాసు, జగదీష్, అధికారులు మనోహర్, నరసింహ, అమరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి సందర్భంగా చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనం



**- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రత్యేక పూజలు – ప్రజల సుఖశాంతుల కోసం ప్రార్థనలు**

**ముషీరాబాద్,**
**జూలై 25(వుదయం)**

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సుభిక్షం కలగాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, డివిజన్ కార్యదర్శి దామోదర్ రెడ్డి, మీడియా ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, పద్మ పోస్టర్ శీను, జి. శ్రీనివాస్, గండు వెంకటేష్, సిలివేరు వెంకటేష్, వెంకటేష్ రావుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.తొలి ఏకాదశి సందర్భంగా ఆలయానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ భక్తులకు తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబంలో శ్రీ మహావిష్ణువు అనుగ్రహంతో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## అరుంధతి నగర్ బస్తీకి సీసీ రోడ్డు నిర్మాణానికి మోక్షం



**- సోమవారం నుంచి పనులు ప్రారంభం.. బోనాల నాటికి ప్రజలకు అందుబాటులోకి – బీజేపీ నేత ఎ. వినయ్ కుమార్**

**ముషీరాబాద్,**
**జూలై 25(వుదయం)**

గత ఎనిమిది నెలలుగా సీసీ రోడ్డు కోసం ఎదురుచూస్తున్న అరుంధతి నగర్ బస్తీ ప్రజల నిరీక్షణకు తెరపడనుంది. సోమవారం నుంచి నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన బస్తీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. గతంలో గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ చేసిన నిరంతర కృషి ఫలితంగానే ఈ సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు లభించాయని పేర్కొన్నారు. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు HMWS&SB అధికారులను పలుమార్లు కలిసి సమస్యను వివరించడం, అధికారులపై నిరంతరం ఒత్తిడి తీసుకురావడంతో చివరకు పనులకు గ్రీన్ సిగ్నల్ లభించిందని తెలిపారు. అరుంధతి నగర్ బస్తీలో రహదారి సమస్యతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాకాలంలో బురద, నీటి నిల్వలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి త్వరలో ముగింపు పలకనున్నామని చెప్పారు. బోనాల పండుగ నాటికి సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులు వేగవంతంగా చేపడతామని వినయ్ కుమార్ వెల్లడించారు.పనుల ప్రారంభానికి ముందు శనివారం బస్తీ ప్రజలు, రోడ్డు కాంట్రాక్టర్‌తో కలిసి ప్రతిపాదిత రహదారిని పరిశీలించి నిర్మాణ పనులపై చర్చించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఎం. ఉమేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, శ్రీనివాస్ గౌడ్, బస్తీ నాయకులు మెరుగు శ్రీనివాస్ యాదవ్, బి. ప్రకాష్, శ్రీనివాస్, సీహెచ్ రాజు, ఎన్. ప్రకాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి



**- తెల్లాపూర్‌లో అవగాహన ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**రామచంద్రాపురం,**
**జూలై 25(వుదయం)**

అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఏలియన్స్ స్పేస్ స్టేషన్ అపార్ట్‌మెంట్ సమీపంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన ర్యాలీతో పాటు ప్రచార రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా చూసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు, ప్రచార రథాలు, ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఓటు కేవలం హక్కు మాత్రమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఆయుధమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఓటు కీలకమని, అందువల్ల అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తాండ స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**: మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్**

**దుండిగల్,**
**జులై 25,(వుదయం ప్రతినిధి ),**

స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దుండిగల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ జోనల్ కమీషనర్ పింకేష్ కుమార్ ను వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోనీ తాండ 2 లో ఆగిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, రోడ్లు పనులు పెండింగ్ లో ఉందని, తాండ నుండి ఎక్కడికి వెళ్లాలన్న ఒక్కటే రోడ్డు ఉండటంతో తాండ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తాండ 2 నుండి హెచ్ ఎం టీ సొసైటీ మీదుగా తాండ 1వరకు ఉన్న సర్వీస్ రోడ్డు వరకు రోడ్డు శాంక్షన్ చేయాలనీ కోరుతూ జోనల్ కమీషనర్ పింకేష్ కుమార్ కు వినతి పత్రముఅందించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ తాను కౌన్సిలర్ గా ఉన్న సమయంలో 1కోటి 80 లక్షలు వివిధ పనుల నిమిత్తము మున్సిపల్ తీర్మానం పొందిన పనులు

## నీట్ బాధితులకు కోటి పరిహారం ఇవ్వాలి

**– గడ్డమీది హరినాథ్ గౌడ్**

**ముషీరాబాద్,**
**జూలై 25(వుదయం )**



NEET పేపర్ లీక్ వ్యవహారం దేశ విద్యా వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసిందని, ఈ ఘటన కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని గడ్డమీది హరినాథ్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన పేపర్ లీక్ ఘటనను అత్యంత తీవ్రమైన నేరంగా పరిగణించాలని అన్నారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా న్యాయం కోసం శాంతియుతంగా ఆందోళనలు నిర్వహించిన విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ మొత్తం వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తక్షణమే స్పందించి, బాధిత విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని గడ్డమీది హరినాథ్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## ప్యాడ్ బ్యాండ్ కు అనుమతి ఇవ్వండి



**- తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం**

**ముషీరాబాద్,**
**జూలై 25 (వుదయం)**

బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం హైదరాబాద్ నగర కమిటీ సమావేశం ఈరోజు సుందరయ్య భవనంలోని సోయాబాలును అశ్వాల హనుమంతు గారి అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు హైదరాబాద్ నగరంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న బోనాల పండుగలో ప్యాడ్ బ్యాండ్ రెండు బాక్సులతో కూడిన వెహికల్ ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్ ఇంచార్జ్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్ గారు డిజిపి గారిని సెంట్రల్ జోన్ సిపి సర్జినల్ గారిని దానికి వారు సానుకూలంగా స్పందించారు నగరంలోని వివిధ సిపిల పరిధిలోని పోలీస్ స్టేషన్లో బ్యాండ్ కళాకారుల పట్ల మానవత దృక్పథం వారి ఉపాధి దెబ్బతీయకుండా వెహికల్స్ సీజ్ చేయకూడదని కోరుతున్నాను సౌండ్ పోలీస్ చెప్పినంత పెట్టడానికి మేము సహకరిస్తాం అదేపక్షంలో సమయం రాత్రి పది దాటిన తర్వాత కస్టమర్లను కూడా బాధ్యులుగా చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వేముల శ్రీనివాస్ నాగేష్ ప్రవీణ్ అనిల్ దేవేందర్ హుస్సేన్ మురళి నరసింహ బాబు తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**బాచుపల్లి,**
**జులై 27,(వుదయం ప్రతినిధి**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, నిజాంపేట్ సర్కిల్, ప్రగతి నగర్ డివిజన్-276 పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి )పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి ప్రజల సమస్యలను అడిగి నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారాగాని వాసు, కొలన్ జీవన్ రెడ్డి, మురళి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రావూరి మౌళేశ్వర్ రావు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్,**
**జులై 25,(వుదయం ప్రతినిధి ),**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తమ హక్కుగా, బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొనాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా తన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత ఎన్నికల సిబ్బందికి సమర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ ఓటు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు బంధువులను కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని, ఓటు విలువను అందరికీ తెలియజేస్తూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో సమర్పించి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వివేకానంద పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు మహేశ్వరి, రాజ్‌కుమార్, బీఎల్ఏలు వినయ్, లావణ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

**THE COURT OF THE HON'BLE 1ST JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT: AT SECUNDERABAD**

**O.S. No. 797 OF 2022**

**Between:**
**CANARA BANK (erstwhile SYNDICATE BANK), ALWAL BRANCH ....PLAINTIFF**
**AND**
**SRI. GADDAM SUBHASH GOUD ....DEFENDANT**

**SUMMONS**

**To,**
**SRI. GADDAM SUBHASH GOUD,**
S/o Narayana Goud, Age 51 Years, Prop. for M/s Sri Sai Baba Rice Depot H. No.02-2-178/1/65. M.G. Nagar, Near Select Talkies, Bollaram, Alwal, Secunderabad-500010, Ph. No. 8498986614.
**Also at:**
H. No. 29-1360/1/7/1, Deena Dayal Nagar, Neredmet, Malkajgiri, Ramakrishnapuram, Hyderabad-500056, Ph. No. 8498986614. **....Defendant**

Take Notice that the Plaintiff has filed the above O.S. for recovery of money of **Rs.1,67,563.02Ps**. along with cost and subsequent interest against you. The summons/notices sent to you have been returned un-served now this Hon'ble Court doth order you to appear before this Hon'ble Court on **08-09-2026 at 10.30 A.M.** either in person or through a pleader and show cause the prayer should not be considered failing which the O.S. will be decided as per law in your absence.

**"BY ORDER OF THE COURT"**
**P.NAGA DURGA PRASAD**
**Advocate**

**IN THE COURT OF THE XIX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT :: HYDERABAD**
**O.S.No. 1937 of 2026**

***Between:***
1. Smt. H. Rakhee Jain W/o. Late Hemanth Kumar Jain 2. Tammana Jain (Minor) D/o. Late Hemanth Kumar Jain
3. Tanya Jain (Minor) D/o. Late Hemanth Kumar Jain
4. Drishti Jain H (Minor) D/o. Late Hemanth Kumar Jain (Plaintiff No.2 to 4 are minor/represented by their mother i.e., Plaintiff No.1 as Gurdian) All are R/o.H.No.16-7-808/1/A, Vinayak Veedi, Chaderghat, Hyderabad, T.S....
**.... Plaintiff/s**
**AND**
1. The Tahsildar/Mandal Revenue Officer, Saidabad Mandal, Hyderabad District.
2. All Concerned.
**...Defendants**

To,
D-2, All Concerned,
Please take notice that above case i.e., O.S.No.1937 of 2026 is filed for Declaration of Legal Heirs of Late Hemanth Kuamr Jain in favour of Plaintiffs and matter is posted to 07-08-2026 for appearance of all concerned. Now all concerned are hereby required to be present either in person or trough advocate at 10:30 AM on 07-08-2026 before the Hon'ble court failing which the matter will be proceeded as per law.

**[BY THE ORDER OF COURT]**
***sd/-***
**SRI. PAVAN KUMAR SANCHETI**
**ADVOCATE**
**M/s. Sancheti & Associates, having Law Office at 109/A, First Floor, "Oasis Plaza" in Premises Bearing No.4-1-898, Tilak Road, Abids, Hyderabad - 500001, Telangana.**

**IN THE COURT OF THE HONOURABLE IX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S. NO 2033 OF 2026**

***Between:***
Chepuri Sneha Latha and others
**.... Plaintiff/s**
**AND**
The Thaisildhar and another
**...Defendants**

**NOTICE**

To
All Concerned
**Defendant No.2**

Please take notice that the above said plaintiffs have filed the above case for declaration of plaintiffs as legal heirs of deceased Chepuri Bhishma Chary aganist defendants, Before the above said court and the said case is coming for your appearance on 13-8-2026 Hence your hereby informed to appear before the above said court on 13-8-2026 at about 10-30 A.M in person or through your counsel failing which the matter will be decided in your absence according to law.

***[By order of the court]***
***sd/-***
**S. MADHU KUMAR,**
**Advocate**
**H.No. 16-11-476/93, Indira Nagar, Moosarambagh, Hyderabad**
**Cell No. 9247352218**




## మా నాన్నను మిస్ అవుతున్నా

"ప్రస్తుతం జైలులో ఉన్న మా నాన్న ఇమ్రాన్ ఖాన్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు తక్షణ వైద్య సాయం అందేలా అంతర్జాతీయ సమాజం చొరవ తీసుకోవాలి. నా తండ్రిని చూసేందుకు ఎవరినీ అనుమతించడం లేదు. చట్టపరంగా ఆయనకు ఎలాంటి సహాయమూ అందటం లేదు. ఇతరుల నుంచి కూడా ఎలాంటి సమాచారం రావడం లేదు. ఆయన ఆరోగ్యంపై ఆందోళనగా ఉంది. నాన్న కంటి చూపు క్రమంగా క్షీణిస్తోంది. ఆయనకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారో కూడా తెలియటం లేదు. ఈ మధ్య నా తండ్రిని చాలా ఎక్కువగా మిస్ అవుతున్నాను."

**-కాసీం ఖాన్, పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తనయుడు**

## వేమన పద్యం

చెట్టుపాలు జనులు చేదందు రిలలోన
ఎనుపగొడ్డు పాలదెంత హితవు
పదుగురాడుమాట పాటియై ధరజెల్లు
విశ్వదాభిరామ! వినురవేమ!



# సంపాదకీయం

## ఇది నిజంగా ప్రజాస్వామ్యమేనా?

ఓ దేశం నాశనం అవ్వా లంటే పెద్ద యుద్ధాలే జరగనవసరం లేదు, అణుబాంబులే పడాల్సిన పనిలేదు. ఆ దేశంలోని విద్యావ్యవస్థపై ప్రజలకు నమ్మకం సడలిపోతే చాలు. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థపై ఉద్భవించిన ఆగ్రహా నికి ప్రతీకగా నిలిచిన వ్యక్తి సోనమ్ వాంగ్ చుక్. ఆయన జూన్ 28న ఢిల్లీలో మొదలు పెట్టిన నిరాహార దీక్షకి ఎంతో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, మేధావుల నుంచి భారీ మద్దతు లభించింది. కానీ ఆయన చేపట్టిన దీక్ష పట్ల ప్రభుత్వం స్పందించిన తీరు మాత్రం అప్రజాస్వామికంగా ఉంది. ఆయన పోరాటం ముగియకముందే... జూలై 18న అక్రమంగా దీక్షా శిబిరం నుంచి తరలించింది. ఆయన ఎవర్నీ కొట్టలేదు, బంధించలేదు, హింసించనూ లేదు. ప్రభుత్వం దిగొచ్చి, చర్చలు జరిపి, సమాధానం ఇవ్వాల్సింది పోయి, ఇలా చెప్పాపెట్టకుండా ఆయన్ను బలవంతంగా లాకెళ్లి ఆస్పత్రిలో పడేసింది. తమ కోసం నిలబడి, ప్రభుత్వాన్ని ప్రశ్నించి, ప్రాణాన్ని పణంగా పెట్టిన వాంగ్‌చుక్ కోసం వేలాది మంది విద్యార్థులు తరలిరావడం మంచి పరిణామం. కానీ, వారు అనుకున్న తీరుగా సర్కార్ నుంచి ఆశించిచన స్పందన లేదు. ఇది నీతి,నిజాయితీ లేని చిత్తశుద్ధిలేని ప్రభుత్వం కదా! అందుకే పేపర్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని, నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని అంతకుముందే పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధర్యంలో యువత, విద్యార్థులు ఆదివారం చేపట్టిన శాంతియుత నిరసన పై పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. విద్యార్థి, యువతను రక్తం కారేలా హింసించింది. ఇదంతా చూస్తే మనది ప్రజాస్వామ్య ప్రభుత్వమా? లేక రాచరిక వ్యవస్థనా? అన్న ప్రశ్నలు సామాన్యపౌరుల్లో తలెత్తడం సహజం. నేను చాలా వరకు విన్న ప్రశ్నలు ఏంటంటే... 'అవును పేపర్ లీక్ ఎప్పుడూ జరిగేలా జరిగింది. క్షమాపణ కూడా ముగిసింది. అన్ని చోట్లా జరగలేదని తెలిసింది. ముందు ముందు జరగకుండా చూస్తామనే వాగ్దానం జరిగింది. మరెందుకీ దీక్ష? ఎందుకీ యాత్ర? ఎందుకు ఈ అన్యాయమనే అరుపులు? ఎందుకు ప్రభుత్వంపైన ఈ అసంతృప్తి?' వీటన్నింటికీ సమాధానాలు లేక పోలేదు. నీట్ పేపర్ లీక్ జరగడం ఇది మొదటిసారి కాదు. మొట్టమొదటగా 2015లో జరిగింది. అప్పుడు నీట్ స్థానంలో ఉన్న ఎఐపిఎంటి ప్రశ్నాపత్రాలు లీక్ అవడం వల్ల సుప్రీం కోర్టు ఆ పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని ఆదేశించింది. కొన్ని రాష్ట్రాల్లో కొంత మంది చేసిన తప్పుకి కొన్ని వేల మంది మళ్లీ పరీక్ష రాయాల్సి వచ్చింది. దాని తర్వాత కూడా 2024లో జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ దేశంలోనే పెద్ద వివాదంగా మారింది. అప్పుడు మళ్లీ విచారణ జరిగింది. దాని సందర్భంగా కొందరిని అరెస్ట్ చేసి, Act 2024 అనే ఓ కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు. ఆ చట్టం ముఖ్య ఉద్దేశ్యం పరీక్ష పత్రాల లీక్‌ని ఆపి, మరింత భద్రతగా పరీక్షలు నిర్వహించి, ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూడడం. చట్టమైతే కొత్తది మొదలైంది కానీ ఇప్పుడు 2026లో జరిగిన పేపర్ లీక్ చూస్తుంటే దాని అమలు ఎంతగా జరిగిందో స్పష్టంగా చెప్పనవసరం లేదు. ఒక పరీక్షా పత్రం లీక్ అవడం వల్ల ఎవరికి నష్టం? కేవలం విద్యార్థులకు మాత్రమే కాదు అది పూర్తి దేశానికి నష్టం. ఎందుకంటే ఇక్కడ ఓ పోటీ పరీక్షంటే కేవలం మూడు గంటల ప్రక్రియ కాదు, దాని వెనుక ప్రతీ ఒక్కరికి కొన్ని సంవత్స రాల శ్రమ ఉంటుంది. పండగలు పబ్బాలనీ లేకుండా, ఎన్నో సరదాలను కాదనుకున్న రోజులుంటాయి. తిండీ.. నిద్రను పక్కనపెట్టి, రేయింబవళ్లు పుస్తకాలను చూస్తూ గడిపిన కండ్లుంటాయి. తల్లిదండ్రులు చేసిన త్యాగాలుంటాయి. ఓ సీటు కోసం కన్న లక్షల కలలుంటాయి. ఓ పరీక్షే కదా రద్దయిపోయిందని చూసేవాళ్లనుకున్నంత తేలిక కాదు దాన్ని భరించడం. ఇదేదో సాధారణంగా మొదటిసారి జరిగిన పేపర్ లీక్ కాదు. మూడు సార్లు ఓడిన ఓ వ్యవస్థకు ఈ విద్యార్థి తరం ఇచ్చిన ఆఖరి అవకాశం. దాన్ని కూడా నిలబెట్టుకోలేకపోతే... దీన్ని ఏ రకమైన ప్రజాస్వామ్యం అనగలం? ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వాళ్లను కోల్పయినవాళ్లు కుంగిపోతున్నారు. ఇప్పటికే ఎన్నో రంగాల్లో స్కాములు జరిగాయి, ఎన్నో రకాల అవినీతులు మొదలయ్యాయి. ఇప్పుడు అందులో విద్యావ్యవస్థ కూడా చేరిపోవడం జీర్ణించుకోలేని నిజంలా మారింది. ఇప్పుడు దేశంలో చేపట్టిన శాంతియుత దీక్షలు, నిరసనలు, ఆందోళనలు వ్యవస్థలోని లోపాలకు, అన్యాయాలకు ప్రతీకలు. అయితే దేశంలోని అతి కొద్ది మంది కోరుకుంటున్నట్లు ఈసారి కూడా అన్యాయమే గెలవొచ్చు. విద్యార్థి ఓడిపోవచ్చు కానీ దాని వల్ల కేవలం విద్యార్థులకే నష్టం అనుకుంటే మాత్రం అది మూర్ఖత్వమే. దేశం మీద, ప్రభుత్వం మీద ప్రజలు నమ్మకం గనుక కోల్పోతే... అది కచ్చితంగా దేశం మొత్తానికి ఓ తీరని శాపంగా మారుతుంది. చదువుతున్న విద్యార్థులంతా... నేను "నిజాయితీగా చదివితే మాత్రం సరిపోతుందా? ఈ దేశంలో నా చదువుకి విలువుందా?" అన్న ప్రశ్న ఉదయిస్తే... ఒక దేశానికి ఇంతకంటే ప్రమాదకరమైన క్షణం మరొకటి ఉండదు.


### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# భయం అంచుల్లో కేంద్రం?

## విద్యార్థి ఉద్యమాలపై ఎన్ఎస్ఏ ప్రయోగం చర్చకు దారితీస్తున్న వేళ

***విద్యార్థి ఉద్యమాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ (ఎన్ఎస్ఏ) అమలుకు సిద్ధమవుతోందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.దేశ భద్రతకు ముప్పు కలిగించే అసాధారణ పరిస్థితుల్లో వినియోగించాల్సిన ఎన్ఎస్ఏ వంటి చట్టాన్ని విద్యార్థులు, యువతపై ప్రయోగించే ఆలోచన ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆందోళనల్లో పాల్గొన్న వారిపై ఇప్పటికే నమోదైన కేసులకు తోడు, మరింత కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ చర్యలు ప్రభుత్వంలో పెరుగుతున్న అభద్రతాభావానికి సంకేతమని విమర్శకులు పేర్కొంటున్నారు. ఈ నెల 15నుండి దీన్ని అమలు పర్చుతున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది. తొలిసారి కేంద్ర ప్రభుత్వం ప్రజల్లో పలచనఅయింది. పరాభవ శిరోభారం మోయలేక పోయింది? గోదీ మీడియాను కూడా గుర్తించి విద్యార్థులు వారిని తరిమికొట్టడం కూడా కేంద్ర పెద్దల అహం ఒకింత దెబ్బతింది. కేంద్రం పన్నెండేళ్ళుగా అణచివేత చర్యల్లో తనదైన ముద్ర వేసుకొంది.***

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తమ సమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం రాజ్యాంగబద్ధమైన హక్కు. అలాంటి ఉద్యమాలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు, కఠిన చట్టాలను ముందుకు తేవడం ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. విద్యార్థి ఉద్యమాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ (ఎన్ఎస్ఏ) అమలుకు సిద్ధమవుతోందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దేశ భద్రతకు ముప్పు కలిగించే అసాధారణ పరిస్థితుల్లో వినియోగించాల్సిన ఎన్ఎస్ఏ వంటి చట్టాన్ని విద్యార్థులు, యువతపై ప్రయోగించే ఆలోచన ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆందోళనల్లో పాల్గొన్న వారిపై ఇప్పటికే నమోదైన కేసులకు తోడు, మరింత కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ చర్యలు ప్రభుత్వంలో పెరుగుతున్న అభద్రతాభావానికి సంకేతమని విమర్శకులు పేర్కొంటున్నారు. ఇదే నిజమైతే కేంద్ర ప్రభుత్వం నూటికి నూరు శాతం అభద్రతా భావంలోకి జారిపోయినట్లే! కాక్రోచ్‌ల ఆందోళనకు భయపడినట్లే లెక్క? ఈ భయంకరమైన అస్త్రంతో కేసులు బనాయించి కాక్రోచ్ ఉద్యమాన్ని, తద్వారా మద్దతుగా కదులుతున్న ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసే దిశగా కేంద్ర అడుగులు వేస్తుందా? కనీస విచక్షణాధికారం మరచి ఈ నెల 15నుండి దీన్ని అమలు పర్చుతున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది. అంటే ఈ నెల 20న పార్లమెంటు ముట్టడి పిలుపులో భాగంగా గాయపడిన, కేసులు పెట్టబడిన విద్యార్థులమీద ఈ అస్త్రం వినియోగం చేస్తారా? లేక బెదిరింపులకు ఉపయోగిస్తారా? అనేక కేసులతోపాటు, ఆర్నెళ్ల వరకు ఎలాంటి బెయిల్ రాని ఈ నల్లచట్టం ప్రయోగానికి సిద్ధంకావడంలోని ఆంతర్యం ఏమిటి? కేంద్ర పెద్దలు ఇంత అమానుష ఆలోచన, ఈ దిశగా ప్రయాణం చేయడానికి దారితీసిన పరిస్థితి ఏమిటి?

సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ జులై 20 సంఘటనల వీడియోలు సైతం చూడడానికి నిరాకరించడం, బిజెపి అధికారంలోకి రావడానికి కారణం అయిన అన్నా హజారే సైతం విద్యా మంత్రి రాజీనామా చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుంది తప్ప తరగదని ప్రధాని మోడీకి లేఖ రాసినా కనీస స్పందన లేకపోవడం, నెలకుపైగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నా కనీసం వారిని పట్టించుకోకపోవడం, గత 25 రోజులుగా రామన్ మెగసెస్ అవార్డు గ్రహీత, ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరహార దీక్ష జరపడంతో పాటు ఆయన తాజాగా ఓ డిమాండ్ కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచారు. పార్లమెంట్ ముట్టడిలో పాల్గొన్న విద్యార్థుల పై మోపిన కేసులను రద్దుచేసి, నీట్ పేపర్ లీకులపై జంతర్ మంతర్‌లోనే చర్చ జరిపితే తన నిరాహార దీక్ష విరమించుకుంటామని ప్రకటించారు. అయినా ప్రభుత్వంలో ప్రతిస్పందన లేదు. ప్రతిపక్షాలు కూడా కేంద్ర విద్యా మంత్రితో రాజీనామా చేయించాలని పార్లమెంటు లోపలా బయట ఆందోళన చేశారు. ఇన్ని రకాల ప్రతిపాదనలు కేంద్రం ముందుకు వచ్చినా అంతిమంగా బ్రిటీష్‌వారి అధికార రక్షణకు ఉద్దేశించిన రౌలత్ చట్టం లాంటి నేషనల్ సెక్యూరిటీ యాక్టు (నాసా) ను విద్యార్థులపై ప్రయోగించడం అంటే ఇది దారుణమైన ఆలోచన, నిర్ణయంగానే చరిత్రలో నిలుస్తోంది.

నల్లచట్టం పెట్టడమే కాదు, దాన్ని జులై 15 నుండి అమలుచేయడం వెనుక ఆంతర్యం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై కక్ష సాధించేదిగా భావించాల్సి ఉంటుంది. లేదా బెదిరింపులో అంతర్భాగం అయి నా అయి ఉంటుంది. ఏదిఏమైనా నాసా ప్రయోగం అనేది విచక్షణ కోల్పోయి జరిపే అణచివేత చర్య అని చెప్పక తప్పదు. ఇక్కడ దాకా జరిగిన పరిణామాల లోతుల్లోకి వెళ్లితే! పశ్చిమబెంగాల్ ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వంలో ఈ రకమైన అతి విశ్వాసం పెరిగింది, రాజ్యాంగ సంస్థలను కనుసన్నల్లో నడుపుకోవడం, అధికారం నుండి అధికారం దిశగా ప్రయాణం చేయడం, నయానో భయానో ఎత్తుగడలో ఏ మార్పుతోనో ప్రతిపక్ష పార్టీలను బలహీనం చేయడం అనే రాజకీయ చదరంగంలో బిజెపి నెగ్గింది. అధికారం సుస్థిరం చేసుకోవడానికి వ్యవస్థలపై ఆధారపడే కంటే చట్టాలను చుట్టాలను చేసుకోవడం సుళువైన మార్గంగా ఎంచుకున్నట్లు ఉంది. ప్రతిపక్షాలు బలహీనం కావడం అంటే దేశంలో ప్రజాస్వామ్య వాతావరణం క్షీణించడమే! అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఏడాది వరకు బెయిల్ రాని చట్టం తేవాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. తాజాగా కాక్రోచ్, ప్రతిపక్షాల అణచివేతకు కఠినమైన నాసా చట్టం కేంద్రం తెచ్చింది. అంటే దేశంలో ఇంకా జైళ్ళు నోర్లు తెరవబోతున్నాయని అర్థం అవుతుంది. పరోక్షంగా అప్రకటిత ఎమర్జెన్సీకి సిద్ధం అవుతున్న జాడలే కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలు కేంద్ర ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అమలు జరుపుకొంటూ వస్తున్నవే? ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాసమస్యలపై ఆందోళన సహజమే! అయితే, ఇంత వేగంగా పరిణామాలు మారడం వెనుక ఉన్న పరిస్థితి మరేమీ లేదు. కాక్రోచ్ ఉద్యమం కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిపైనా, అహంపైనా తిరుగులేని దెబ్బ తీసింది. జులై 20 విద్యార్థుల పార్లమెంటు ముట్టడి తిరుగుబాటుగానే ప్రభుత్వం భావిస్తోంది. జంతర్ మంతర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనకు చాలా కాలం కేంద్రం అసలు స్పందించ లేదు. చాలా తేలిగ్గా తీసుకుంది. ఇక సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 20వ రోజుకు చేరడంతో దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వాదులు, ప్రజల్లో కూడా సానుభూతి, కదలిక మొదలైంది. ఆయన్ను బలవంతంగా అరెస్టు చేసి ఆస్పత్రికి తరలిస్తే సమస్య సమసిపోదని అర్థం కావడానికి ఎంతో సమయం పట్టలేదు. కాక్రోచ్ జనతా పార్టీ పార్లమెంటు ముట్టడికి ప్రయత్నం చేయడం, కేంద్రం ఊహకందని రీతిలో విద్యార్థులు ఆటంకాలు అధిగమించి తరలిరావడం, లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగం చేసినా విద్యార్థులు పార్లమెంటు ముంగిటకు అడుగు పెట్టడంతో కేంద్ర పెద్దలలో అసహనం మొదలైంది. పోలీసులు, విద్యార్థులు గాయపడ్డారు

తొలిసారి కేంద్ర ప్రభుత్వం ప్రజల్లో పలచనఅయింది. పరాభవ శిరోభారం మోయలేక పోయింది? గోదీ మీడియాను కూడా గుర్తించి విద్యార్థులు వారిని తరిమికొట్టడం కూడా కేంద్ర పెద్దల అహం ఒకింత దెబ్బతింది. కేంద్రం పన్నెండేళ్ళుగా అణచివేత చర్యల్లో తనదైన ముద్ర వేసుకొంది. భీమాకోరెగాం కేసు నుండి అర్బన్ నక్సల్స్ వరకు కఠినమైన కేసులు, చట్టాల ద్వారా మేధావులపై నిర్బంధం విధించడం, జైలుపాలు చేయడం, ఆపరేషన్ కగార్ పేరుతో నక్సల్స్ అణచివేతలో సక్సెస్ కావడం కేంద్ర పెద్దల్లో తిరుగులేని ఆత్మవిశ్వాసం ఏర్పడింది. అయితే అనూహ్యంగా ముందుకు వచ్చిన కాక్రోచ్ ఉద్యమాన్ని అంచనా వేయడంలో కేంద్ర పెద్దలు బోల్తా పడ్డారు. జెల్లపురుగే గదా అనుకుంటే కేంద్రం ప్రతిష్ఠకు జెల్లీ కొట్టింది. ఒకరకంగా జులై 20 విద్యార్థుల, యువత తిరుగుబాటు కేంద్రం విధానాలపై పోరాడే వర్గాల్లో ఆత్మవిశ్వాసం నింపింది. కేసులు, జైళ్ళు, కోర్టులకు భయపడి దూరంగా ఉన్న వివిధ వర్గాలకు కాక్రోచ్ ఉద్యమం ఒక రకంగా ఊపిరి ఊదింది. కేంద్ర మంత్రితో రాజీనామా చేయించి విద్యార్థి ఉద్యమం చల్లార్చి ఉంటే ఈ సమస్య ఇలా జటిలం అయ్యేది కాదు.

నిరంకుశ అధికారాలు దాఖలుపడ్డ కేంద్రం సైతం వెనుకడుగు వేయడానికి ఇష్టపడక పోవడమే కోతి పుండు బ్రహ్మారాక్షసి అయినట్లు సమస్య జటిలం అయింది. ఈ సమస్యను ఇలాగే వదిలేస్తే గడచిన పన్నెండేళ్ళుగా బిజెపి రాజకీయ చాణక్యం తప్ప, ప్రజా సమస్యల ద్వారా ప్రజల్ని తమ వైపు తిప్పుకున్న జాడలు లేవు. ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం పెరగడం, రూపాయి విలువ కుంచించుకుపోవడం లాంటి సమస్యలతో ప్రజల్లో అసంతృప్తి రగులుతున్నది. తాము ప్రజల్లో పలచనైతే కలిగే పరిణామాలు ఏమిటో కేంద్ర వ్యూహ కర్తలకు తెలుసు. ఊహకందనవి కూడా కాదు. కనుక కేంద్రం కఠిన చట్టాల ద్వారా అణచివేత చర్యల వైపే మొగ్గు చూపుతున్నది. నిర్దాక్షిణ్యంగా ఎంతో భవితవ్యం ఉన్న యువతపై కఠిన చట్టాల ప్రయోగం వైపు ప్రభుత్వం ఆలోచనలు చేయడం సరికాదు. కనుక సమస్య తెగేదాకా లాగి, జటిలం అయ్యే దిశగా తీసుకుపోకుండా కేంద్ర ప్రభుత్వంపెద్ద మనస్సుతో ఆలోచనలు చేయాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని ఆశిద్దాం.




ఏం రవీందర్
7901503777


## చేనేతకు ప్రగడ కోటయ్య చేయూత

భారత స్వాతంత్ర్యోద్యమములో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సముపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత. ఆలాంటి చేనేత రంగానికి, కార్మికులపై జరిగిన నిర్లక్ష్యం, నిరాదరణ గురించి అనునిత్యం తపించిన చేనేత నాయకుడు ప్రగడ కోటయ్య. చేనేత కార్మికులను సంఘటితం చేసి, అహరహం ఎన్నో పోరాట రూపాలలో ప్రత్యక్షంగా పాల్గొని, వారి ఆత్మ బంధువు గా వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయిన నేత ఆయన. ప్రగడ కోటయ్య గుంటూరు జిల్లా, నిడుబ్రోలులో చేనేత వృత్తిగా గల ప్రగడ వీరభద్రుడు, కోటమ్మ దంపతులకు 1915, జూలై 26న జన్మించాడు. 1931లో ఎస్ఎస్ఎల్సి స్కూలు ఫైనల్ ప్యాసయ్యాడు. కొంతకాలం బాపట్ల తాలూకా బోర్డులో ఉపాధ్యా యుడుగా చేసాడు. ఆక్స్ ఫర్డు విశ్వ విద్యాలయంలో భారతీయ చేనేత పరిశ్రమ పై పరిశోధన జరిపిన ఆచార్య ఎన్ జి రంగా సలహా మేరకు మద్రాసు లోని టెక్స్టైల్స్ ఇన్స్టిట్యూట్ చదివి అక్కడ సూపర్వైజర్ పని చేసాడు. 1935లో ఏర్పడిన మద్రాసు రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘంలో ప్రొడక్షన్ ఇన్చార్జిగా ఉద్యోగంలో చేరి సర్కారు జిల్లాల్లో ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు విశేషంగా కృషి చేశాడు. .మెడికల్ సెలక్షన్ కమిటీ సభ్యుని గా, ప్రదేశ్ కాంగ్రెశ్ కమిటీ జనరల్ సెక్రటరీగా ఆంధ్ర విశ్వ విద్యాలయం సెనెట్ సభ్యునిగా పదవీ బాధ్యతలు సమర్ధ వంతంగా ప్రగడ కోటయ్య నిర్వహించారు. 1937 జూన్లో నిడుబ్రోలులో గుంటూరు జిల్లాలో ఎన్.జి.రంగా, తాడిపర్తి శ్రీకంఠం, దామెర్ల రమాకాంతరావు, అప్పటి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి సి. రాజగోపాలా చారి ముఖ్య అతిథిగా గుంటూరులో చెన్న రాష్ట్ర చేనేత మహాసభ వెనక కృషి ఆయనదే. 1941లో బ్రిటిష్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేనేత రంగం స్థితిగతులను అధ్యయనం చేసేందుకు నియమిత థామస్ కమిటీని కోటయ్య గుంటూరు జిల్లాకు ఆహ్వానించి వంద పేజీల మెమొరాండాన్ని అందజేశాడు. చే కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ అభ్యర్థిగా చీరాల నియోజక వర్గం నుంచి పోటీచేసి ఎన్నికయ్యాడు. శాసన సభలో కోటయ్య వాక్పటిమను చూసిన ఆనాటి ముఖ్యమంత్రి రాజాజీ, కాంగ్రెసు పార్టీలో చేరితే మంత్రి పదవి అప్పగిస్తానని చెప్పినా, కోటయ్య నైతిక విలువలకే ప్రాముఖ్యతనిచ్చి ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించిన నిస్వార్థ నేత. 1953 తర్వాత చేనేత వర్గాల ప్రయోజనాల కోసం రేపల్లెలో సత్యాగ్రహం చేపట్టాడు. ఫలితంగా జైలు శిక్ష అనుభవించాడు. కనుంగో కమిటీ సిఫార్సులకు వ్యతిరేకంగా ఆయన ఉద్యమించాడు. చేనేత కార్మికులకు ప్రయోజనం కలిగించేందుకు సహకార సంఘాలు ఒక మార్గంగా నమ్మాడు. చేనేత రంగంతో పాటు రైతులు, జిన్నింగ్, స్పిన్నింగ్, కాంపోజిట్ మిల్లులపై ఆమూలాగ్రం అధ్యయనం చేశాడు. ఆయన హయాం లోనే ఆంధ్ర ప్రాంతంలో ఆనాడు 200 పైగా నూతన చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసారు. అసంఘటితంగా ఉన్న చేనేత రంగం అభివృద్ధికి వారు నేసి బట్టలకు సరైన గిట్టుబాటు ధర లభించడానికి కోటయ్య కృషి చేసాడు. చీరాల వద్ద 17 వేల ఎకరాలకు పైగా బంజరు భూములను పేదలకు పంపిణీ చేసే విషయంలో చీరార సముద్ర తీర ప్రాంతంలో సేద్యపు నీటి సౌకర్యం కల్పించడంలో చీరాల, నెల్లూరు, రాజమండ్రి పట్టణాలలో సహకార నూలు మిల్లులు ఏర్పాటు చేయడంలో కోటయ్య కృషిమరవ లేనిది. భారత ప్రభుత్వ చేనేత రంగ ప్రతినిధిగా స్రీలంక, బ్రిటన్, చైనా, హాంకాంగ్ తదితర దేశాలు సందర్శించాడు. కోటయ్య 1995 నవంబర్ 26న మరణించాడు.




రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్


# ట్రంప్ నోట చెత్త మాటలు

"వీరు సోషల్ డెమోక్రాట్లు (సామాజిక ప్రజాస్వామిక వాదులు) కాదు, కరుడు గట్టిన దేవుడులేని కమ్యూనిస్టులు, వారు అన్ని మతాల మీద దాడులు చేస్తారు, ప్రత్యేకించి క్రైస్తవం మీద, వారెప్పుడూ అదే చేస్తారు,అదొక పిచ్చి వంటిది, ఈ దేశంలో మీ చర్చీలన్నింటినీ మూసివేస్తారు. మీ వారిని చంపివేస్తారు, ఏదనుకుంటే అది చేస్తారు. వారు మతాన్ని అంతం చేయాలనుకుంటున్నారు. మీకు బలమైన మతం ఉంటే వారి సిద్ధాంతం పనిచేయదు గనుక వారు మతాన్ని అంతం చేయాలనుకుంటారు. 250 ఏండ్ల క్రితం మన దేశ స్థాపన జరిగిన తరువాత నా అభిప్రాయం ప్రకారం మనదేశానికి వచ్చిన ముప్పు ఇది" ఈ మాటలు మాట్లాడింది అమెరికా అధ్యక్షుడిగా ఉన్న డోనాల్డ్‌ట్రంప్ అనే ఒక కమ్యూనిస్టు వ్యతిరేకి. గతవారంలో దేశ ప్రజల నుద్దేశించి ఇరవై నిమిషాలపాటు టీవీలో చేసిన ప్రసంగంలో అనేక చెత్త మాటలు అతని నోటి నుంచి వచ్చాయి. ఎన్నికల్లో తనను ఓడించేందుకు చైనా కమ్యూనిస్టులు గతంలో జోక్యం చేసుకున్నారని ఇప్పుడు మధ్యంతర ఎన్నికల్లో అదే పనిచేస్తున్నారని ఆరోపించాడు. నవంబరు మూడవ తేదీన జరిగే పార్లమెంటు మధ్యంతర ఎన్నికల్లో జనం ఏ తీర్పు ఇస్తారో తెలియదుగానీ, అధికార రిపబ్లిన్లకు ఎదురుదెబ్బ తగిలి ఉభయ సభల్లో మెజారిటీ కోల్పోతే దానికి కారణం చైనీయులే అని చెప్పేందుకు ముందుగానే ఒక సాకు సిద్ధం చేసుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. తిరుగుబాటు రాష్ట్రమైన తైవాన్ ఎప్పటికైనా చైనాలో విలీనం కావాల్సిందే. అక్కడ ప్రత్యేక దేశమా, విలీనానికి అనుకూలమా అనే ప్రాతిపదికనే ఎన్నికలు జరుగుతాయి. ఒకే భాష, ఒకే జాతి అయిన అక్కడే అలాంటి పని చేయని చైనా ఎక్కడో సుదూరంగా ఉండి, తమ భాష అర్థంగానీ అమెరికాలో డోనాల్డ్ ట్రంప్‌నకు వ్యతిరేకంగా ఏ భాషలో ప్రచారం చేస్తుంది ? అయినా చైనా చెప్పగానే అమెరికన్లు మారేట్లయితే ఏకంగా కమ్యూనిస్టులనే ఎన్నుకోవాలని ప్రచారం చేయవచ్చు కదా! చరిత్రలో మతోన్మాదులు తమ వ్యతిరేక మత కేంద్రాల మీద దాడులు చేశారు, కూలగొట్టిన చరిత్రను మూటగట్టుకున్నారు. మన కళ్ల ముందే బాబరీ మసీదును కూల్చి అక్కడే రామాలయాన్ని నిర్మించారు. కమ్యూనిస్టులు వస్తే ప్రార్థనా మందిరాలను కూల్చివేస్తారన్నది తప్పుడు ప్రచారం. రష్యా, చైనా, తూర్పు ఐరోపా దేశాలలో ఒక్క చర్చిని కూడా కూల్చివేయలేదు. గతంలో, వర్తమానంలో చైనా అలాంటి జోక్యం చేసుకున్న దాఖలాలు లేవు. భవిష్యత్‌లో జరిగేందుకు ఆస్కారమూ లేదు. అయినప్పటికీ ట్రంప్ అలాంటి తప్పుడు



ప్రచారం ఎందుకు చేస్తున్నట్లు!అమెరికా ఎన్నికల్లో కమ్యూనిస్టులు లేదా ఇతర పురోగామివాదులు ఒక పార్టీగా అక్కడ పాతుకుపోయిన రెండు ప్రధాన పార్టీలను దెబ్బకొట్టగలిగిన స్థితిలో లేరు అన్నది ఒక వాస్తవం. రెండవది, గత కొన్ని దశాబ్దాలుగా కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టి జనాల బుర్రలను ఖరాబు చేసిన సంగతి కూడా తెలిసిందే. గతంతో పోలిస్తే కొంత మార్పు వచ్చినప్పటికీ అది చాలదు. మన దేశ స్వాతంత్ర్య ఉద్యమ దశ, దిశను మార్చేందుకు పురోగామి వాదులు అనేక మంది కాంగ్రెస్ సోషలిస్టులుగా ప్రత్యేకతను ప్రదర్శిస్తూ కాంగ్రెస్‌లో అంతర్భాగంగానే పని చేసిన చరిత్ర తెలిసిందే. అమెరికాలో కూడా అదే జరుగుతున్నట్లు చెప్పవచ్చు. అయితే అక్కడి డెమోక్రటిక్ సోషలిస్టు పార్టీలో ఉన్నవారందరూ సోషలిజానికి, కమ్యూనిజానికి అనుకూలురని చెప్పలేము. ఆ భావజాలానికి కట్టుబడి పనిచేయాలని కోరుకొనే వారు కూడా గణనీయంగా ఉన్నారు. చివరివరకు ఎంతమంది నిఖరంగా నిలుస్తారు, నిలవరు అనేది చరిత్ర చెప్పాల్సిందే. సోషలిస్టు భావాలను కలిగిన రెండు సంస్థలు, కొందరు వ్యక్తులు 1982లో డెమోక్రటిక్ సోషలిస్టు పార్టీ(డిఎస్‌పి)గా ఏర్పడి డెమోక్రటిక్ పార్టీలోనే పని చేయటం ప్రారంభిం చారు.నాడు కొన్ని వందల మంది మాత్రమే సభ్యులుగా ఉండగా నేడు లక్షా పదివేల మంది వరకు ఉన్నట్లు అంచనా. సోషలిస్టులమని చెప్పుకునేందుకే భయపడిన రోజుల నుంచి నేడు లక్షలాది మంది తామూ అదే ఇష్టులమని గర్వంగా చెప్పుకొనేం తంగా ఆ ఉద్యమం ఎదిగింది. బెర్నీ శాండర్స్ సెనెటర్‌గా ఎన్నికతో ప్రారంభమైన ఆ పురోగమనం 2028 ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లో గవర్నర్ పదవుల కోసం, మరో రెండు చోట్ల గట్టి పోటీ ఇచ్చేందుకు, అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరపున తమ భావజాలం ఉన్న వ్యక్తిని నిలిపేందుకు అడుగులు వేయటమే ట్రంప్ ఆందోళనకు అసలు కారణంగా చెప్పవచ్చు. అమెరికా కార్పొరేట్ల రాజధాని న్యూయార్క్ పీఠంపై ఇప్పటికే ట్రంప్ దష్టిలో కమ్యూనిస్టుగా ముద్రపడిన డిఎస్‌పి నేత జోహ్రాన్ మందానీ మేయర్‌గా ఉండగా, రాజకీయ అధికార కేంద్రం ఉన్న వాషింగ్టన్ డిసిలో అదే భావజాలం కలిగిన మహిళ మేయర్ కాబోతున్నా రనే వార్తలొచ్చాయి. న్యూయార్క్ నగరంలో మూడు ఎంపీ స్థానాలుండగా వాటికి డెమోక్రాట్లలో డిఎస్‌పి అభ్యర్థులే ముందువరుసలో ఉన్నారు. రాజకీయ సర్వే జరపాలని, సెప్టెంబరు 15 నాటికి నివేదిక అందజేయా లని డిఎస్‌పి తన 250శాఖలకు పత్రాలను పంపింది. ఇదంతా అధ్యక్ష ఎన్నికలకు సన్నాహమే. ఆ పార్టీ సెనెటర్ బెర్నీ శాండర్స్ వయస్సు 84 సంవత్సరాలు కావటంతో వేరే వారిని రంగంలోకి దించేందుకు కసరత్తు చేస్తున్నారు. కార్మిక నాయకురాలు, ప్రజా ప్రతినిధుల సభ సభ్యురాలిగా ఉన్న అలెగ్జాండ్రియా ఒకాసియో కార్టెజ్ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వంకోసం పోటీపడే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. మరో సారి రిపబ్లికన్ పార్టీ తరఫున తానే పోటీ చేయాలని డోనాల్డ్ ట్రంప్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నాడు. జూలై 16న టీవీ ప్రసంగం తీరు చూసిన తరువాత తన పదవికోసం ట్రంప్ ఎంతకైనా తెగిస్తాడని అనేక మంది భావిస్తున్నారు. నవంబరు మూడు మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లను బెదిరించేం దుకు మిలిటరీని దించటంతో పాటు(ఇప్పటికే చికాగో, లాస్ ఏంజల్స్, వాషింగ్టన్ డిసి, తదితర నగరాల్లో ఉన్నాయి), ఓట్ల పెట్టెలను అపహరించటంతో సహా ఏ అక్రమానికైనా పాల్పడవచ్చని చెబుతున్నారు.

రిపబ్లికన్లు ఓడిపోతే ఫలితాలను తిరస్కరించే అవకాశం కూడా ఉంది. 2020 అధ్యక్ష ఎన్నికలలో ఓడిపోతున్నట్లు గ్రహించి బ్యాలట్ బాక్సులను తారుమారు చేయాలని చూస్తే అతగాడి అధికార యంత్రాంగంలోని వారే అడ్డుపడటంతో వెనక్కు తగ్గాడు. తరువాత జోబైడెన్ ఎన్నికను గుర్తించకుండా తన అనుచరులతో అమెరికా అధ్యక్ష కేంద్రం మీద దాడి చేయించిన సంగతి తెలిసిందే.తన ప్రసంగంలో రహస్య పత్రాలంటూ కొన్నింటిని పేర్కొంటూ రష్యా, చైనా, ఇరాన్, ఉత్తర కొరియా దేశాల నుంచి, కొన్ని సంస్థలు ఎన్నికల్లో జోక్యం చేసుకొనేందుకు చూస్తున్నాయని ట్రంప్ ఆరోపించాడు.అయితే ఎలా అన్నది మాత్రం చెప్పలేదు. తెలుగునాట ముఖ్య మంత్రులుగా పనిచేసిన వారు కొన్ని పత్రికలు, టీవీ ఛానళ్ల పట్ల వ్యవహరించిన తీరును చూశాము. ప్రజాస్వామ్యానికి, భావప్రకటనా స్వేచ్ఛకు నిలయమని ఊదర గొట్టే అమెరికాలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఎవరి అజెండా వారికి వుంది.తనకు వ్యతిరేకంగా ఎబిసి, ఎన్‌బిసి మీడియా సంస్థలు కుట్రలో భాగస్వాములని, తన ప్రసంగాలను ప్రత్యక్ష ప్రసారం చేయటం లేదని ట్రంప్ ఆరోపించాడు. వాటి లైసన్సు రద్దు చేస్తామని బెదిరించాడు. మధ్యంతర ఎన్నికల్లో గెలిచేందుకు ట్రంప్ ఇరాన్ను ఒక అంశంగా ఎంచుకున్నాడు. సోవియట్‌తో జరిగిన ప్రచ్ఛన్న యుద్ధంలో అణుబూచిని చూపి ఓటర్లను ఆకట్టుకోవటం నాటి అజెండాలలో ఒకటి. టెహరాన్ విషయంలో అది తిరగబడింది. దాని బదులు అనూహ్యంగా హోర్ముజ్ జలసంధిపై అదుపు ప్రతిష్టాత్మకంగా మార్చుకొని ఇరుక్కు పోయాడు. రెండవది పాతబడిన రోత ప్రచారం, కమ్యూనిస్టు వ్యతిరేకత. సోవియట్ లేదు గనుక దాని స్థానంలో చైనా కుట్ర అంటూ రెచ్చగొట్టటం. చిత్రం ఏమిటంటే అమెరికాలో కమ్యూనిస్టు పార్టీ ఉన్నప్పటికీ అది అక్కడి పాలకపార్టీలను సవాలు చేసే స్థితిలో లేదు. అందుకే డెమోక్రటిక్ సోషలిస్టులను కమ్యూనిస్టులుగా చిత్రించి ట్రంప్ దాడి చేస్తున్నాడు. అయితే వారంతా తమ కళ్ల ముందు కనిపించేవారు గనుక వారి నుంచి ముప్పు ఎలా వస్తుందో నమ్మించలేకపోతున్నాడు. నిజానికి సాధారణ అమెరికన్లకు ముప్పుగా మారింది " దేవుడు లేని కమ్యూనిస్టులు " కాదు. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ దళం(ఐసిఇ). వారిని చూస్తే జనాలు వణికిపోతారు. ఎవరిని అరెస్టు చేస్తారో, ఎవరిని చంపుతారో తెలియదు. హిట్లర్ నాటి రహస్య హంతక దళాలను అవి గుర్తుకు తెస్తాయి. రెండవసారి ట్రంప్ అధికారానికి వచ్చిన తరువాత ఐసిఇ లేదా సరిహద్దు నిఘా దళానికి చెందిన వారు బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి పదకొండు మందిని చంపారు. వీరుగాక వలస వచ్చిన వారిని బంధించిన శిబిరాల్లో మరో 21మంది మరణించారు.

అమెరికా ఎన్నికల్లో జోక్యం చేసుకుంటున్నట్లు చేసిన ఆరోపణలను చైనా గట్టిగా తిరస్కరించింది. ప్రతిపక్ష డెమోక్రాట్ల చేతిలో ఓటమిని ఎదుర్కోలేక గత కొన్నేండ్లుగా ఇలాంటి ఆరోపణలు చేస్తున్నట్లు తిప్పికొట్టింది. ఇరవై రెండు కోట్ల మంది ఓటర్ల వివరాలను చైనా సంపాదించిందని, గతంలో అధికారానికి వచ్చినప్పటి నుంచీ అమెరికా మీడియాలో తనకు వ్యతిరేకంగా రాసేందుకు జర్నలిస్టులకు డబ్బు ఇస్తున్నదని, వాణిజ్యవేత్తలను తనకు వ్యతిరేకంగా తయారు చేస్తున్నదని ట్రంప్ తాజా ప్రసంగంలో ఆరోపించాడు. చైనా వాణిజ్యాన్ని సవాలు చేసిన తొలి అధ్యక్షుడిగా తాను ఉన్నందుకు గాను 2018లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో కూడా చైనా జోక్యం చేసుకున్నదని అదే ఏడాది భద్రతా మండలికి ట్రంప్ ఫిర్యాదు చేశాడు. అయితే ఆ సమయంలో అక్కడే ఉన్న చైనా ప్రతినిధి రుజువులు చూపాలంటూ సవాలు చేశాడు, ఎలాంటి ఆధారాలను అమెరికా చూపలేకపోయింది. మే నెలలో బీజింగ్ పర్యటనకు వెళ్లిన ట్రంప్ ఆహ్వానం మేరకు సెప్టెంబరులో చైనా నేత షీ జిన్‌పింగ్ అమెరికా పర్యటనకు వస్తారని చెబుతున్న నేపథ్యంలో ఇలాంటి ఆరోపణలు ట్రంప్ నోటి నుంచి వెలువడటం అతగాడి సంస్కారాన్ని వెల్లడిస్తున్నది.



# జాతీయం-అంతర్జాతీయం



## ఎట్టకేలకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- యువత ఆకాంక్షలను గౌరవిస్తున్నట్టు వెల్లడి
- ఇది విద్యార్థుల విజయం
- సీజేపీ, విద్యార్థి సంఘాల పోస్ట్

**న్యూఢిల్లీ, జులై 25 (ఎ.ఎం.ఎస్):** ఎట్టకేలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలియజేశారు. కాక్రోచ్ జనతా పార్టీ, పలు విద్యార్థి సంఘాలు చేపట్టిన సుదీర్ఘ ఆందోళనలు, విద్యాశాఖ జవాబుదారీతనం వహించాలనే తీవ్ర ఒత్తిడి మధ్య ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో సోషల్ మీడియాలో ఇది విద్యార్థుల విజయమని, తాము తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని పేర్కొంటూ పోస్టులు పెడుతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ మంత్రి రిజైన్ చేయాల్సిందేనని పట్టుబట్టారని, అడ్డంకులు ఎదురైనా అనుకున్నది సాధించారని ప్రశంసిస్తున్నారు. విద్యార్థులు తలుచుకుంటే ఏ ప్రభుత్వమైనా దిగిరావాల్సిందేనని మరోసారి నిరూపించారని అంటున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోడీకి పంపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా ప్రధాన్ స్పందిస్తూ.. యువత ఆకాంక్షలను తాను గౌరవిస్తున్నట్టు తెలిపారు.



''గత పది రోజులుగా జరుగుతున్న పరిణామాలు నన్ను బాధించాయి. నేను వ్యక్తిగత భేషజాలకు పోవడం లేదు. నీట్ అక్రమాలు వెలుగులోకి రాగానే.. సీబీఐ విచారణకు ఆదేశించాం. విజయవంతంగా మళ్లీ పరీక్షను నిర్వహించాం. బాధ్యతల నుంచి నేను ఎప్పుడూ తప్పుకోలేదు. యువశక్తే.. ఈ దేశ అసలైన శక్తి. వారి భవిష్యత్తు కోసమే రాజీనామా చేశాను. దేశ విద్రోహ శక్తులకు అవకాశం ఇవ్వకూడదనే రాజీనామా నిర్ణయం తీసుకున్నా. యువత తమ చదువుల కోసమే సమయం కేటాయించాలి. మంత్రిగా ఇన్నాళ్లు నాకు అవకాశం కల్పించిన మోడీకి కృతజ్ఞతలు'' అని ధర్మేంద్ర ప్రధాన్ తన లేఖలో పేర్కొన్నారు.

**కాక్రోచ్ జనతా పార్టీ, పలు విద్యార్థి సంఘాలు చేపట్టిన సుదీర్ఘ ఆందోళనలు, విద్యాశాఖ జవాబుదారీతనం వహించాలనే తీవ్ర ఒత్తిడి మధ్య ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో సోషల్ మీడియాలో ఇది విద్యార్థుల విజయమని, తాము తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని పేర్కొంటూ పోస్టులు పెడుతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ మంత్రి రిజైన్ చేయాల్సిందేనని పట్టుబట్టారని, అడ్డంకులు ఎదురైనా అనుకున్నది సాధించారని ప్రశంసిస్తున్నారు.**



### విద్యార్థులను వేధిస్తోన్న కేంద్రం

- మోడీ సర్కార్‌పై రాహుల్ గాంధీ ఆగ్రహం

**న్యూఢిల్లీ, జులై 25(ఎ.ఎం.ఎస్):** ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులను కేంద్రం వేధిస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. పేపర్ లీకేజీలు ఆపలేరు కాని, ఢిల్లీలో మెట్రోలు, రోడ్లను మూసివేస్తారని ఆరోపించారు. హక్కుల కోసం పోరాడుతోన్న విద్యార్థులపై కేంద్రం క్రూరమైన చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. వ్యవస్థలోని లోపాలను విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను విద్యార్థులు కోరుతున్నారని, ఆయన శాఖ మార్చడం కాదన్నారు. విద్యార్థులతో మోడీ వీడియోల ద్వారా ఆటలాడుతున్నారని, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలన్నారు.

## కాల్పుల విరమణకు ఇరాన్ తిరస్కరణ

- హోర్ముజ్ వ్యవహారం తేల్చాల్సిందేనంటూ డిమాండ్
- న్యూయార్క్ టైమ్స్ వెల్లడి




**వాషింగ్టన్, జులై 25:** అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ తిరస్కరించినట్టు అమెరికా పత్రిక ది న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. ఇరాక్ ప్రధాని అలీ అల్‌జైదీ ద్వారా టెహ్రాన్‌కు చేరిన ఈ ప్రతిపాదనలో హోర్ముజ్ జలసంధిపై నియంత్రణ అంశానికి పరిష్కారం లేకపోవడంతో దాన్ని అంగీకరించలేదని ఇరాన్, ఇరాక్ అధికారులను ఉటంకిస్తూ పేర్కొంది.

న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం.. కాల్పుల విరమణకు సంబంధించిన అమెరికా ప్రతిపాదనను గురువారం ఇరాక్ ప్రధాని అలీ అల్‌జైదీ ఇరాన్ నాయకత్వానికి అందించారు. అయితే ఆ ప్రతిపాదనలోని పూర్తి వివరాలు ఇప్పటివరకు అధికారికంగా వెల్లడి కాలేదు. ఇరాన్ అధికారుల ప్రకారం.. హోర్ముజ్ జల సంధిపై నియంత్రణ, అక్కడ నెలకొన్న ఉద్రిక్తతలకు శాశ్వత పరిష్కారం లేకుండా కేవలం తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడంలో తమకు ఆసక్తి లేదని టెహ్రాన్ స్పష్టం చేసినట్టు సమాచారం. అయితే ఈ కథనంపై అమెరికా అధ్యక్ష కార్యాలయం (వైట్ హౌస్) నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. దాదాపు రెండు వారాలుగా అమెరికా, ఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అమెరికా మళ్లీ నౌకాదళ దిగ్బంధనాన్ని అమలు చేసినప్పటికీ.. హోర్ముజ్ జలసంధిలో నౌకలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తున్నట్టు అమెరికా ఆరోపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ది న్యూయార్క్ టైమ్స్ కథనం చర్చనీయాంశంగా మారింది.

ఐఆర్‌ఐబీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అరాగ్చీ మాట్లాడుతూ.. ప్రధాన సమస్య అమెరికా అవివేకపూరిత, అతి ఆధిపత్య ధోరణి అని విమర్శించారు. అమెరికా తన వైఖరిని మార్చుకోనంత వరకు సమస్యకు పరిష్కారం దొరకదని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు ట్రంప్ కూడా ఇరాన్‌పై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఒప్పందం చేసుకునే పరిస్థితిలో ఇరాన్ లేదని, అక్కడి నాయకత్వం ఇంకా దురుద్దేశాలతో వ్యవహరిస్తోందని ఆరోపించారు.

## బీహార్‌లో ఉద్రిక్తత



- నిరసనకారులపై పోలీసుల లాఠీఛార్జి

**పాట్నా, జులై 25 (ఎ.ఎం.ఎస్):** బీహార్ ఛప్రాలో ఉద్రిక్తత నెలకొంది. నీట్ పేపర్ లీకేజ్ ను వ్యతిరేకిస్తూ, ఢిల్లీ యువత ఆందోళనలకు మద్దతుగా చేపట్టిన ధర్నాలో నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. భారీగా తరలించిన యువతను పోలీసులు చెదరగొట్టారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సమాచారం అందిన వెంటనే, సరన్ జిల్లా మేజిస్ట్రేట్ వైభవ్ శ్రీవాస్తవ, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వినీత్ కుమార్‌తో సహా ఉన్నతాధికారులు భారీ పోలీసు బలగాలతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిరసనకారులపై బాష్పవాయువు ప్రయోగించారు. ఆ ప్రాంతంలో ఇంకా ఉద్రిక్తత కొనసాగుతున్నప్పటికీ, శాంతిభద్రతల పరిస్థితి ప్రస్తుతం అదుపులో ఉందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, పాట్నాలోని గాంధీ మైదాన్‌లో విద్యార్థులు చేపట్టిన నిరసనలో జనశక్తి జనతా దళ్ జాతీయ అధ్యక్షుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఆ తర్వాత నిరసన సందర్భంగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

## ఏపీలో ముగిసిన సర్

- నమోదుకాని ఓట్లు 44.71 లక్షలు
- క్లెమ్స్, అభ్యంతరాలకు అవకాశం
- అక్టోబర్ 3న తుది జాబితా

**అమరావతి, జులై 25 (ఎ.ఎం.ఎస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సర్వే (SIR) ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. నిన్న రాత్రి పన్నెండు గంటలతో ఈ ప్రక్రియ ముగిసింది. ఈ సర్వే గడువు ముగిసే సమయానికి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 44.71 లక్షల ఓట్లకు సంబంధించిన సమగ్ర వివరాలు నమోదు కాకపోవడం గమనార్హం. క్షేత్రస్థాయి పరిశీలనలో సమాచారం లభించకపోవడంతో ఈ ఓట్లను ఎన్నికల సంఘం 'అన్‌కలెక్టబుల్' (సేకరించలేనివి) వర్గంలో చేర్చింది. దీని ప్రభావంతో ఈ నెల 30న ఈసీ అధికారికంగా విడుదల చేయనున్న ప్రాథమిక ఓటర్ల ముసాయిదా (డ్రాఫ్ట్)




జాబితాలో ఈ 44.71 లక్షల ఓట్లు కనిపించవు. సరైన ఆధారాలు లేకపోవడం, చిరునామాల మార్పు లేదా ఓటర్ల గైర్హాజరీ వంటి కారణాల వల్ల ఈ ఓట్లు తొలగింపునకు గురయ్యాయని అధికారులు భావిస్తున్నారు.

ముసాయిదా జాబితాలో పేర్లు లేని ఓటర్లు కలవరపడాల్సిన అవసరం లేదని, తమ ఓట్లను సరిచేసుకునేందుకు సమయం ఉందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ నెల 30 నుండి ఆగస్టు 30 వరకు నెల రోజుల పాటు ఈసీకి అభ్యంతరాలు, ఫిర్యాదులు తెలిపేందుకు అవకాశం కల్పించారు. తమ ఓటు అనుమానాస్పదంగా తొలగించబడిందని భావించేవారు లేదా మార్పులు చేయాలనుకునేవారు ఈ వ్యవధిలో తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. అందిన దరఖాస్తులపై ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, అన్ని సరిచూసుకున్న తర్వాత అక్టోబర్ 3 న ఓటర్ల తుది (ఫైనల్) జాబితాను విడుదల చేయనున్నారు.

అత్యధికంగా నెల్లూరు జిల్లాలోనే ఓట్లు తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోనే అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 2,90,579, తిరుపతి 2,87,759, కడప 2,44,879, విశాఖపట్నం 2,39,146, గుంటూరు 2,37,789 ఓట్లు తొలగించాల్సిన జాబితాలో ఉన్నాయి. తొలగించాల్సిన జాబితాలో ఉన్న 44,71,523 ఓట్లలో 13,00,152 (29.07%) ఈ 5 జిల్లాల్లోనే ఉన్నాయి. ఇవి కాకుండా మరో 18 జిల్లాల్లో లక్షకు పైగానే ఓట్లు తొలగించాల్సిన జాబితాలో ఉన్నాయని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

## ట్రంప్‌నకు ఫెడరల్ కోర్టు షాక్

- విదేశీయుల వీసాల అంశంలో ఎదురుదెబ్బ
- అటార్నీ జనరల్స్ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి
- రుసుం విషయంలో ప్రభుత్వ పరిధి దాటిందంటూ ఆగ్రహం




**న్యూయార్క్, జులై 25:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు షాకిచ్చింది. విదేశీ ఐటీ నిపుణులు, భారతీయులకు ముఖ్యమైన హెచ్ 1బీ (H1B) వీసాల అంశంలో ఎదురుదెబ్బ తగిలింది. కొత్త హెచ్ 1బీ వీసాల జారీపై విధించిన లక్ష డాలర్ల (దాదాపు రూ. 84 లక్షలు) భారీ ఫీజు వసూలు చేయకుండా.. ప్రభుత్వాన్ని నిరోధిస్తూ ఇచ్చిన తీర్పును ఎత్తివేయడానికి అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు నిరాకరించింది. జూన్ 8న ఆ లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమని బోస్టన్‌లోని 1వ యూఎస్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ తీర్పును యథాతథంగా కొనసాగించిందని రాయిటర్స్ తెలిపింది. కాకపోతే దీనిపై ప్రభుత్వం కోర్టులో సవాలు చేసేంత వరకు ఆ ఉత్తర్వు అమలులో ఉండేందుకు అవకాశం దక్కింది.

అమెరికా ప్రభుత్వం కాంగ్రెస్ (పార్లమెంట్) ఆమోదం లేకుండానే కొత్త పన్నును విధించిందంటూ 20 మంది డెమోక్రటిక్ అటార్నీ జనరల్స్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వాదనతో న్యాయమూర్తి ఏకీభవిస్తూ ఈ భారీ రుసుము విషయంలో ప్రభుత్వం పరిధి మించిందని తీర్పు ఇచ్చారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధమైనదిగా పరిగణిస్తున్నామని.. ఈ రుసుము చెల్లదంటూ కీలక తీర్పు ఇచ్చింది. బోస్టన్‌లోని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సోరోకిన్ ఈ భారీ రుసుము పెంపు చట్టవిరుద్ధమైన పన్ను అని తీర్పు ఇచ్చారు. అమెరికా ప్రభుత్వం ఏ పేరు పెట్టినా ఈ రుసుము విధించే అధికారం కేవలం కాంగ్రెస్‌కు (పార్లమెంట్‌కు) మాత్రమే ఉంటుందన్నారు. తాజాగా ప్రభుత్వం అత్యవసర అభ్యర్థనను ముగ్గురు జడ్జిల అప్పీలేట్ ప్యానెల్ తిరస్కరించింది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సెప్టెంబర్ నెలలో హెచ్ 1బీ వీసాకు సంబంధించి కీలక ప్రకటన చేశారు. హెచ్ 1బి వీసా దుర్వినియోగం అవుతోందని.. దానిని అరికట్టేందుకు లక్ష డాలర్ల భారీ రుసుము పెంచుతున్నట్లు తెలిపారు. నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణులను నియమించుకోవడానికి ఐటీ కంపెనీలు, ఇతర సంస్థలు హెచ్ 1బి వీసాలు జారీ చేస్తున్నారు. అమెరికా ప్రతి ఏటా 65,000 వీసాలను మంజూరు చేస్తోంది. వీరిలో పాటుగా అమెరికాలో మాస్టర్స్ చేసిన 20వేల మందికి హెచ్ 1బి వీస ఇవ్వాలనే నిబంధన ఉంది. కొత్తగా ప్రకటించిన విధానానికి ముందు హెచ్ 1బీ వీసా ఉద్యోగికి స్పాన్సర్‌షిప్ ఇవ్వడానికి ప్రభుత్వం రుసుముగా 2వేల డాలర్ల నుంచి 5వేల డాలర్లు చెల్లించేవారు.. ఈ ఖర్చుల్ని కంపెనీలే భరిస్తాయి. ప్రస్తుతం ప్రతిపాదించిన లక్ష డాలర్ల రుసుము కేవలం కొత్తగా దరఖాస్తు చేసుకునే విదేశీయులకు మాత్రమే వర్తిస్తుంది. స్టూడెంట్ వీసాలపై ఇప్పటికే అమెరికాలో ఉన్న విదేశీ పౌరులకు ఈ రుసుము వర్తించదు. ట్రంప్ ప్రకటించిన రుసుమును భరించలేక చాలా కంపెనీలు హెచ్ 1బీ నియామకాలను తగ్గించాయి. ఈ భారీ రుసుమును సవాల్ చేస్తూ కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి.

## బంగ్లాదేశ్ అధ్యక్షుడి రాజీనామా

- షేక్ హసీనాకు ఫోన్ కాల్ వల్లే
- మానసికంగా అసమర్థుడినంటూ ఆవేదన
- స్పీకర్‌కు భావోద్వేగంతో లేఖ

**ఢాకా, జులై 25:** షేక్ హసీనాకు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన బంగ్లాదేశ్ అధ్యక్షుడు మొహమూద్ షాబుద్దీన్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. పార్లమెంట్ స్పీకర్ హఫీజ్ ఉద్దీన్ అహ్మద్‌కు రాసిన లేఖలో తాను గుండె జబ్బు, బీపీ, డయాబెటిస్, కిడ్నీ సమస్యల సహా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని తెలిపారు. ''ఇటీవల నిర్వహించిన వైద్య పరీక్షలలో ఆటోనామిక్ న్యూరోపతి అనే వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దీని కారణంగా నేను కొన్నిసార్లు కొద్దిసేపు స్పృహ కోల్పోతాను.. ఈ వ్యాధి తీవ్రత పెరగడం వల్ల అధ్యక్షుడి వంటి కీలకమైన రాజ్యాంగ పదవులను నిర్వర్తించడానికి శారీరకంగా, మానసికంగా నేను అసమర్థుడ్ని'' అని ఆయన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

తన బ్యాంకాక్ పర్యటనను కుదించుకుని శుక్రవారం ఢాకాకు తిరిగి వచ్చిన స్పీకర్ అహ్మద్.. అధ్యక్షుడి రాజీనామాను ఆమోదించినట్లు తెలిపారు. కొత్త అధ్యక్షుడు ఎన్నికయ్యే వరకు అహ్మద్ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ప్రధానమంత్రి తారిక్ రెహమాన్ నేతృత్వంలోని బీఎన్పీ ప్రభుత్వం, అధ్యక్షుడి మధ్య విభేధాలు తీవ్రస్థాయికి చేరాయనే ఊహాగానాల మధ్య షహాబుద్దీన్ రాజీనామా చేసినట్లు మీడియా నివేదికలు చెబుతున్నాయి. 1971 బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో కీలకంగా వ్యవహరించిన మాజీ న్యాయమూర్తి అయిన షబుద్దీన్ ఏప్రిల్ 2023లో దేశ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు.



రెండేళ్ల కిందట రిజర్వేషన్లకు వ్యతిరేకంగా యువత చేపట్టిన ఉద్యమంతో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కూలిపోయిన సంగతి తెలిసిందే. షేక్ హసీనా మాదిరిగా షహాబుద్దీన్ కూడా రాజీనామా చేస్తారని, మహమ్మద్ యూనస్ అధ్యక్షుడు అవుతారనే ప్రచారం అప్పట్లో జరిగింది. ఇక, డిసెంబర్ నాటికి స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు షేక్ హసీనా ప్రకటించిన కొద్ది రోజులకే షహాబుద్దీన్ రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల హసీనాతో ఆయన ఫోన్‌లో సంభాషించినట్టు నివేదికలు రాగా.. ఇది అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అగ్ర నాయకత్వాన్ని ఆగ్రహానికి గురిచేసినట్టు తెలుస్తోంది.

ఈ క్రమంలోనే ఆయనతో బలవంతంగా రాజీనామా చేయించినట్టు సమాచారం. అయితే,'ది డైలీ స్టార్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో షహాబుద్దీన్ ఆ నివేదికలను 'నిరాధారమైనవి' అని కొట్టిపారేశారు. త్రివిధ దళాల కమాండర్‌ఇన్‌చీఫ్‌గా ఉన్నప్పటికీ కార్యనిర్వాహక అధికారం మొత్తం ప్రధాని చేతిలో ఉంటుంది. దీంతో అధ్యక్ష పదవి అలంకారప్రాయమైంది.

## ఆయనొస్తే అదుపులోకి తీసుకోండి

- నెతన్యాహూపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆగ్రహం
- అతడిపై యుద్ధ నేరాలున్నాయంటూ ఆరోపణ

**న్యూయార్క్, జులై 25:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును అరెస్టు చేసి అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ముందు హాజరుపరచాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సీనియర్ అధికారి ఎరికా గువేరా రోసాస్ డిమాండ్ చేశారు. నెతన్యాహు అమెరికా పర్యటనకు వస్తే ఆయనను అదుపులోకి తీసుకోవాలని ఇటీవల న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ చేసిన వ్యాఖ్యలకు ఆమె మద్దతు తెలిపారు.

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌లో పరిశోధన, న్యాయవాదం,

విధానాలు, ప్రచారాల విభాగం సీనియర్ డైరెక్టర్‌గా ఉన్న ఎరికా గువేరా రోసాస్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందిస్తూ.. అమెరికా అధికారులు మానవ హక్కులను, చట్ట పాలనను గౌరవించాలని కోరారు. నెతన్యాహుపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు జారీ చేసిన



అరెస్టు వారెంట్‌ను అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత దేశాలపై ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. 2024లో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అరెస్టు వారెంట్ జారీ చేసిన విషయం విదితమే. గాజాలో జరిగిన యుద్ధానికి సంబంధించి యుద్ధ నేరాలు చేసినట్టు ఆరోపణలు నమోదు చేసింది. అయితే ఈ ఆరోపణలను ఇజ్రాయిల్ ప్రభుత్వం ఖండిస్తూ వచ్చింది. అలాగే ఐసీసీ అధికార పరిధిని కూడా ఇజ్రాయిల్ అంగీకరించడం లేదు. నెతన్యాహుపై ఐసీసీ వారెంట్ అమలు చేయాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ మళ్లీ డిమాండ్ చేయడంతో గాజా యుద్ధానికి సంబంధించిన అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కులు, యుద్ధ నేరాల అంశాలు మరోసారి చర్చకు వస్తున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు.

## నల్లజాతీయులకు ప్రాణ సంకటం



- ఊపిరితిత్తుల వ్యాధులతో సతమతం
- ఎలన్ మస్క్ కృత్రిమ మేధ కంపెనీ వల్లే
- ప్రమాదకర ఉద్గారాలే కారణమంటున్న నిపుణులు

**మిసిసిప్పీ, జులై 25:** వ్యాపారవేత్త ఎలన్ మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ కంపెనీ ఎక్స్ ఏఐ తన కొలోసస్ 2 డేటా సెంటర్ ప్రాజెక్ట్ కోసం 59 సహజ వాయువు టర్బైన్లను ఏర్పాటు చేసింది. అయితే వీటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి క్లీన్ ఎయిర్ అనుమతులు పొందలేదు. మస్క్ కంపెనీ ఏర్పాటు చేసిన టర్బైన్ల నుంచి పరిమితికి మించి ఉద్గారాలు వెలువడుతున్నాయి. ఇవి ప్రధానంగా నల్ల జాతి ప్రజలు నివసించే ప్రాంతాలకు సమీపంలోనే విడుదల అవుతుండడం గమనార్హం. దీంతో ఈ ప్రాంతంలోని ప్రజలు ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులతో బాధ పడుతున్నారు. సాధారణంగా ఏఐ డేటా సెంటర్లు అధిక విద్యుత్‌ను డిమాండ్ చేస్తుంటాయి. దీనిని తట్టుకునేందుకు సంబంధిత కంపెనీలు ఆఫ్ గ్రిడ్ పవర్ ప్లాంటులను నిర్మిస్తున్నాయి. ఇవి ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తున్నాయి.

ఎలాంటి అనుమతులు పొందకుండా 27 టర్బైన్లను నడుపుతున్నామని, వీటికి అనుమతులు అవసరం లేదని మస్క్ కంపెనీ జనవరిలో వాదించింది. కానీ ఈ కంపెనీ ఏర్పాటు చేసిన టర్బైన్ల సంఖ్య 59. వీటిలో రెండు మినహా మిగిలినవన్నీ డేటా సెంటర్ ఉన్న టెన్నెస్సీ రాష్ట్ర సరిహద్దుకు సమీపంలోని మిసిసిపీలోనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా అనేక ఆఫ్ - గ్రిడ్ విద్యుత్ ప్లాంట్లలో ఎక్స్‌ఏఐ టర్బైన్లే ఉన్నాయి. వీటి ఏర్పాటుకు పర్యావరణ అధ్యయనాలు, ప్రజాభిప్రాయ సేకరణలు జరపాల్సి ఉండగా వాటన్నింటినీ పక్కన పెట్టారు. కొన్ని వారాలు లేదా నెలల వ్యవధిలోనే అధికారుల నుంచి అనుమతులు లభిస్తుంటాయి.

టర్బైన్లు పరిమితికి మించి ఉద్గారాలను విడుదల చేస్తున్నాయని, కాబట్టి వాటి కార్యకలాపాలను నిలిపివేయాలని కోరుతూ పలు సంస్థలు ఏప్రిల్‌లో ఎక్స్‌ఏఐపై దావా వేశాయి. నల్ల జాతీయులు నివసించే ప్రాంతాలలో జనావాసాలు, పాఠశాలలు, చర్చిలు కాలుష్యానికి గురవుతున్నాయని తెలిపాయి. అయితే టర్బైన్లను నిషేధిస్తే జాతీయ భద్రతా ప్రయోజనాలకు ముప్పు కలుగుతుందని అమెరికా న్యాయ శాఖ వితండవాదం చేస్తోంది. ఎక్స్‌ఏఐ కంపెనీ వ్యవస్థలు అమెరికా సైనిక కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించాల్సి ఉంది. టర్బైన్లు విడుదల చేస్తున్న ఉద్గారాల కారణంగా వచ్చే వాయు కాలుష్యం దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతోంది. జాతుల మధ్య అసమానతలు సృష్టిస్తోంది. చివరికి ప్రజల ఆయుర్దాయం కూడా తగ్గిపోతోంది.

30 టర్బైన్లు తమ సామర్థ్యంలో 80 శాతం మేర పనిచేస్తే ఏడాదికి సుమారు రెండున్నర వేల షార్ట్ టన్నుల (షార్ట్ టన్ను అంటే సుమారు 907.18 కిలోల బరువుకు సమానమైన యూనిట్) నైట్రోజన్ ఆక్సైడ్‌ను, నాలుగు వేల షార్ట్ టన్నుల కార్బన్ మోనాక్సైడ్‌ను, 22 షార్ట్ టన్నుల ఫార్మాల్డిహైడ్‌ను విడుదల చేస్తాయి. నైట్రోజన్ ఆక్సైడ్‌తో శ్వాసకోస వాపు వస్తుంది. కార్బన్ మోనాక్సైడ్ శరీరానికి ఆక్సిజన్‌ను అందకుండా చేస్తుంది. ఫార్మాల్డిహైడ్ అనేది క్యాన్సర్ కారకం.

రాష్ట్రంలో అతి పెద్ద డేటా సెంటర్ నిర్మాణానికి న్యూయార్క్ రాష్ట్రం బ్రేక్ వేసింది. సంవత్సరం పాటు మారటోరియం విధించింది. ఏఐ కేంద్రాలకు భారీగా అవసరమైన సౌకర్యాలు, పెరుగుతున్న విద్యుత్ ఖర్చులు, నీటి కొరత, స్థానిక సమాజాలపై భారం వంటి సమస్యలను దృష్టిలో పెట్టుకొని న్యూయార్క్ ఈ నిర్ణయం తీసుకుంది. డేటా సెంటర్లపై మారటోరియం విధించిన తొలి అమెరికా రాష్ట్రం న్యూయార్కే. ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అమెరికాలో దేశవ్యాప్త చర్చ జరుగుతున్న తరుణంలో న్యూయార్క్ రాష్ట్రం ఈ నిర్ణయం తీసుకుంది. టెక్నాలజీ కంపెనీలు డేటా సెంటర్ల నిర్మాణానికి ఉరుకులు పరుగులు పెడుతుంటే అనేక రాష్ట్రాలలో ప్రజా ప్రతినిధులు, రెగ్యులేటర్లు మాత్రం వాటిని ఎలా నియంత్రించాలన్న విషయంపై చర్చోపచర్చలు జరుపుతున్నారు.

విద్యుత్ గ్రిడ్లు, యుటిలిటీ బిల్లులు, స్థానిక సమాజాలపై వాటి పభావాన్ని విశ్లేషిస్తున్నారు.



## నల్ల సముద్రంలో వాణిజ్య నౌకపై దాడి
## భారతీయుడు మృతి

**మాస్కో, జులై 25:** నల్ల సముద్రంలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో ఒక భారత పౌరుడు మరణించినట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ధృవీకరించింది. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన భారత ప్రభుత్వం, వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించింది. వివరాల్లోకి వెళితే, జులై 18న 'ఎంవీ ఒమోర్ఫ్' అనే వాణిజ్య నౌక నల్ల సముద్రంలో ప్రయాణిస్తుండగా ఈ దాడి చోటుచేసుకుంది. రష్యా ప్రాదేశిక జలాల్లో జరిగిన ఈ ఘటన సమయంలో, నౌకలో ముగ్గురు భారతీయులతో సహా మొత్తం 10 మంది సిబ్బంది ఉన్నారు. ఈ దాడిలో ఒక భారతీయుడు ప్రాణాలు కోల్పోగా, మిగిలిన ఇద్దరు సురక్షితంగా ఉన్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. రష్యాలోని భారత రాయబార కార్యాలయం అక్కడి అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, మృతుడి కుటుంబానికి అవసరమైన అన్ని సహాయక చర్యలను అందిస్తోందని ఎమ్.ఈ.ఏ.ఒక ప్రకటనలో తెలిపింది.

## జంతర్‌మంతర్ ర్యాలీ- 15 ఎఫ్.ఐ.ఆర్‌లు నమోదు

- ఎఫ్.ఆర్.ఎస్. ద్వారా 2 వేల మందికిపైగా గుర్తింపు
- పోలీసుల తీరుపై సీజేపీ ఆందోళన

**న్యూఢిల్లీ, జులై 25(ఎ.ఎం.ఎస్):** నీట్ పేపర్ లీకేజ్ ను వ్యతిరేకిస్తూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని జూలై 20న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టిన పార్లమెంట్ మార్చ్ లో పాల్గొన్న యువతపై ఢిల్లీ పోలీసులు 15 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, 130 మంది పోలీసులు, సుమారు 65 మంది విద్యార్థులు గాయపడ్డారని పేర్కొన్నారు. అసాంఘిక శక్తులను గుర్తించడానికి ఢిల్లీ పోలీసులు 'ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్' కెమెరాలను కూడా ఉపయోగిస్తున్నారు. "అటువంటి వ్యక్తులను పోలీసులు ఇప్పటివరకు 2,000 మందికి పైగా గుర్తించారు," అని పోలీసు వర్గాలు తెలిపాయి.

అయితే ఢిల్లీ పోలీసుల తీరు పట్ల సీజేపీ ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం



వ్యక్తం చేశారు. తమపై పోలీసులు అనైతికంగా వ్యవహరించిన వీడియోలు, ఫోటోలు అందజేస్తామని, వారిని గుర్తించి, కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుత నిరసన కారులపై లాఠీచార్జీ చేసి తలలు పగలగొట్టి, వీధుల్లో ఈడ్చుకెళ్లి, తమ వాలంటీర్ల పక్కటెముకలు విరగ్గొట్టిన, యువతులపై చేయి చేసుకున్న పోలీసు సిబ్బంది జాబితాను తాము కూడా ఢిల్లీ పోలీసులకు ఇస్తాము. తాము వారిని FRS ద్వారా కాకుండా ప్రజల ద్వారా గుర్తిస్తాము. ఆ వివరాలను బహిర్గతం చేస్తాము. దీనిపై ఢిల్లీ పోలీసులు ఏమంటారో చూద్దామని ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు.

కాగా, జూలై 20న, జంతర్ మంతర్ నుండి పార్లమెంట్ వైపు సాగిన "సంసద్ చలో" ర్యాలీలో వేలాది మంది యువత పాల్గొన్నారు. శాంతియుతంగా సాగుతున్న యువత ర్యాలీపై పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీ ఛార్జ్ చేయడంతో వందల సంఖ్యలో యువత గాయపడ్డారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## శాంతి భద్రతలతో పాటు సామాజిక బాధ్యత

**- వనమహోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ ఐపీఎస్**



**సూర్యాపేట, జూలై 25 : వుదయం ప్రతినిధి**

పర్యావరణ పరిరక్షణ మరియు సామాజిక బాధ్యతలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు సిబ్బంది ఏకకాలంలో 1500 మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటి ప్రారంభించారు.కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ చెట్లు, అడవులు పెంచడం వల్ల పర్యావరణ రక్షణ, సమృద్ధిగా వర్షాలు కురవడానికి ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. "ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి. నాటిన ప్రతి ఒక్క మొక్కను మహా వృక్షంలా ఎదిగేలా బాధ్యతగా సంరక్షించాలి" అని పిలుపునిచ్చారు.పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయం అని అన్నారు.ఎల్-నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతుందని, నీటి ఎద్దడిని తట్టుకునే పంటలవైపు రైతులు ఆలోచన చేయాలి అని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ క్యాంటీన్, పరేడ్ గ్రౌండ్, జిమ్ వంటి వసతులతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఈ మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడం జరిగిందని వివరించారు. "పోలీస్ సామాజిక బాధ్యతతో పని చేస్తున్నాం. చెట్లు, అడవులు పెంచడం వాతావరణ పరిస్థితులను అనుకూలం చేస్తాయి. ప్రజల రక్షణ, భద్రత మా ప్రథమ లక్ష్యం" అని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా పోలీస్ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, రవి, నరసింహా చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డిఆర్సీ ఇన్స్పెక్టర్ మహేశ్ అలి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, సిబ్బంది రాజశేఖర్, వెంకటయ్య, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు మరియు పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, రుచికరమై ఆహారం అందించాలి: కలెక్టర్



**యాదాద్రి భువనగిరి జిల్లా తతేది: 25.07.2026**

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, రుచికరమై ఆహారం, క్రీడా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం అని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శనివారం బీబీనగర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ మరియు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం కళాశాల కిచెన్ లోని కూరగాయలు, సరుకులు, వంట సామాగ్రి, గదులను పరిశీలించారు పరిశుభ్రత, శానిటేషన్ ప్రమాణాలు సక్రమంగా పాటిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నిల్వలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలెక్టర్ ఆత్మీయంగా మాట్లాడారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు క్రీడా పరికరాలు (స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్) అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన విద్యా పుస్తకాలు , శిక్షణ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు విద్యలో ప్రతిభ కనబరచడంతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొని సమగ్ర వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, జిల్లా కి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ శ్యామ్ సుందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచాలి..కలెక్టర్



**ఖమ్మం, వుదయం బ్యూరో జూలై - 25**

జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన "నా పట్టు – నా అభిమానం 2.0" జిల్లా స్థాయి భాగస్వాముల సంప్రదింపుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర పట్టు బోర్డు బెంగళూరు మరియు తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ పట్టుపరిశ్రమ రైతులతో ఎన్ని ఎకరాలు చేస్తున్నది, ఎంత కాలం చేస్తున్నది, ఖర్చు, నీటి వినియోగం, రాబడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 150 ఎకరాల్లో పట్టుపరిశ్రమ ఉందని, ఈ విస్తీర్ణాన్ని 1000 ఎకరాలకు పెంచే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అధికారులు సమర్ధవంతంగా పనిచేసి, రైతులకు పట్టుపరిశ్రమ పై అవగాహన కల్పించి, జిల్లాకు కన్వర్జ్ హోదా సాధించాలన్నారు. కేంద్ర పట్టు బోర్డు అభివృద్ధి చేసిన ఆధునిక సాంకేతికతలను ప్రతి రైతు తప్పనిసరిగా ఆచరణలోకి తీసుకువచ్చి ఆత్మనిర్భరత సాధించాలని సూచించారు. తెలంగాణలో పట్టుపరిశ్రమ అభివృద్ధిలో ఖమ్మం జిల్లా అగ్రగామిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. పట్టుపరిశ్రమ కు నీటి వినియోగం చాలా తక్కువని, రిస్క్ కూడా తక్కువని, రాబడి ఎక్కువగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. అనుభవజ్ఞులైన రైతులు ఇతర రైతులకు అవగాహన కల్పించి, చైతన్యం తేవాలన్నారు. సబ్సిడీ పెంపు విషయమై ప్రభుత్వానికి ఫీడ్ బ్యాక్ సమర్పిస్తామని, ప్రస్తుతానికి సబ్సిడీ తో పాటు లబ్ధిదారులు కొంత భాగస్వామ్యం చేసుకోవాలని అన్నారు. ఒక్కో రైతుకు విడివిడిగా కాకుండా ఎక్కువ మంది రైతులు కలిసి చేసే మార్కెటింగ్ లాభం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర పట్టు బోర్డు, బెంగళూరు సీనియర్ సైంటిస్ట్ డా. జి. సుబ్రహ్మణ్యం కార్యక్రమ ఉద్దేశాలను వివరించారు. పట్టు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా అందించి, ఉత్పాదకత, నాణ్యతను మెరుగుపరచడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త సంచాలకులు అనసూయ జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి శాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.సమావేశంలో జిల్లా లో పట్టు పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో నిర్వహించిన బేస్‌లైన్ సర్వే వివరాలను సమీక్షించి, రైతులకు సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, నాణ్యమైన పట్టు ఉత్పత్తి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కేంద్ర పట్టు బోర్డు, ములుగు కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపమ్ రెడ్డి, డాక్టర్ గుండి రాఘవేందర్, హార్టికల్చర్ అధికారిణి అనిత శ్రీ, అధికారులు, రైతు ప్రతినిధులు, ఇతర భాగస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో 101 కిలోల డ్రై గంజాయి స్వాధీనం

**నలుగురు నిందితుల అరెస్ట్ – కారు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 25 (వుదయం ప్రతినిధి)**

భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 101 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేశారు.శనివారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటలకు భద్రాచలం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ) ఆధ్వర్యంలో వీరభద్రం ఫంక్షన్ హాల్ సమీపంలోని కూనవరం రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లోని మోతుగూడెం ప్రాంతం నుంచి కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న 101 కిలోల డ్రై గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనలో కర్ణాటక రిజిస్ట్రేషన్ నంబర్ కే కె ఏ-03-ఎన్ ఆర్-5892 గల మారుతి ఎర్టిగా కారుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అరెస్టైన నిందితులు:సలీం పాషా (53), బొమ్మనహళ్లి, బెంగళూరు దక్షిణ, కర్ణాటక.ఈ. రాజేంద్ర ప్రసాద్ (34), నల్లమడ, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్.ఎం.డి. అర్బాజ్ హుస్సేన్ (22), బొమ్మనహళ్లి, బెంగళూరు దక్షిణ, కర్ణాటక.ఎస్. గుల్జార్ (35), జయనగర, నెలమంగల, బెంగళూరు గ్రామీణ జిల్లా, కర్ణాటక. ప్రాథమిక విచారణలో నిందితులు మోతుగూడెం నుంచి గంజాయిని భద్రాచలం–ఖమ్మం మార్గం గుండా రోడ్డు మార్గంలో బెంగళూరుకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ దాడిలో సీఐ రహీమున్నీసా, ఎస్ఐ సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ కరీమ్, పోలీసు సిబ్బంది భద్రం, సీతారాం, రాకేష్, రవి పాల్గొన్నారు.

## సర్ ఓటు నమోదు కార్యక్రమం పురోగతిపై తహసీల్దార్‌తో సమీక్ష నిర్వహించిన మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్



**అశ్వారావుపేట, జులై 25 (వుదయం ప్రతినిధి ):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వరావుపేట:ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా శనివారం అశ్వరావుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అశ్వరావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిపై తహసీల్దార్ డి. కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ డి. కిషోర్ మాట్లాడుతూ, అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలో సర్ ఓటరు నమోదు కార్యక్రమం దాదాపు 86 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జూపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదును పూర్తి చేసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, అశ్వరావుపేట మండల బి, ఎల్, ఓ,ఇంచార్జ్ చీకటి శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు మిండా హరిబాబు, నక్క సత్యనారాయణ, అశ్వరావుపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నండ్రు రమేష్, ప్రభుత్వ అధికారులు తదితరులు.

## ఆరుతడి పంటలతోనే రైతులకు అధిక లాభాలు: కలెక్టర్



**హనుమకొండ/ఐనవోలు, జూలై 25 (వుదయం ప్రతినిధి):**

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పూర్తయ్యే ఆరుతడి పంటలు సాగు చేసి అధిక రాబడి పొందాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. శనివారం రోజున ఐనవోలు మండలంలోని సింగారం, పున్నేలు గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్, అక్కడ రైతులు సాగు చేస్తున్న పెసర, ఆయిల్‌పామ్, మామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సింగారంలో తక్కువ నీటితో పెసర సాగు చేస్తున్న రైతు పురుషోత్తం రెడ్డిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పెసర, మినుములు, కందులు 60-70 రోజుల్లోనే దిగుబడినిస్తూ మంచి లాభాలనిస్తున్నాయని తెలిపారు. అనంతరం పున్నేలులో వేల్పుల రమేష్‌కి చెందిన ఆయిల్‌పామ్ తోటను, రవికిరణ్ రెడ్డికి చెందిన మామిడి తోటను సందర్శించి పంట దిగుబడి, మార్కెటింగ్ వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరి, పత్తి కంటే పెసర, మినుములు, కందులు, ఆయిల్‌పామ్ లాంటి పంటలు స్థిరమైన ఆదాయాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా వీటి విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ ఆదిరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, తహసీల్దార్ విక్రమ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థుల పోరాటంతో దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం

**-తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిక్షపతి నాయక్**



**తొర్రూరు, జూలై 25 (వుదయం ప్రతినిధి)**

నీట్,సిబిఎస్ఈ పరీక్షల నిర్వహణలో ఆవుకతవకలు పేపర్ లీకేజీకి బాధ్యత వహించి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల పోరాటంతో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చిందని తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోత్ బిక్షపతి నాయక్ అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో నీట్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ ద్వారా 25 లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని, గత 12 సంవత్సరాలలో జాతీయస్థాయిలో 152 పరీక్ష పేపర్ల లీకేజీ వల్ల అన్ని రకాల పోటి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు నష్టపోయారని వాపోయారు. నీట్ పరీక్ష లీకేజీ వల్ల పరీక్ష రద్దు కావడంతో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు కేసు విచారణ సందర్భంగా జన్ జీ యువతరాన్ని వ్యంగ్యంగా కాక్రోచ్ తో పోల్చడం వల్ల యువత కాక్రోచ్ జనతా పార్టీని స్థాపించి దేశవ్యాప్తంగా వ్యవస్థీకృతంగా అన్ని పోటి పరీక్షలు అక్రమాలు జరగడాన్ని వ్యతిరేకిస్తూ గత 25 రోజులుగా ఢిల్లీలో పోరాటం చేస్తున్నారని, పోరాటం వల్లే అవినీతి లేకుండా సాఫీగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశంలో రాజకీయ పార్టీలు, నాయకులు రాజకీయాన్ని అవినీతి వారసత్వంగా కొనసాగిస్తూ దేశంలోని యువత సమస్యలు పట్టించుకోలేదని విమర్శించారు. ఏ పార్టీ నాయకుడైన మ్యాచ్ ఫిక్సింగ్ ద్వారా ప్రజల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయాన్ని భ్రష్టు పట్టిస్తూ స్వార్థం కోసం పార్టీలు మారడం తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం యువత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాలోత్ సోమేశ్వర్ నాయక్, జాటోత్ రాజారాం నాయక్, శ్రీను, హరిబాబు, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం : డాక్టర్ రోహిత్ సాదు



**పరకాల జూలై 25 (వుదయం ప్రతినిధి):**

నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు లభించిన విజయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (మెడికల్ అండ్ హెల్త్ వింగ్) డాక్టర్ రోహిత్ సాదు పేర్కొన్నారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలు తీవ్ర ఆందోళనకు గురిచేశాయని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు వ్యక్తం చేసిన నిరసనలు, ప్రజాభిప్రాయం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయితే రాజీనామాతోనే వ్యవహారం ముగిసిపోయినట్లు భావించరాదని, నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యులైన వారందరిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, భద్రతను మరింత బలోపేతం చేసే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని డాక్టర్ రోహిత్ సాదు కోరారు.

## గ్రేటర్ వరంగల్‌లో కమిషనర్ వెంకన్న ఆకస్మిక తనిఖీలు

★ పారిశుద్ధ్యం, సుందరీకరణపై ప్రత్యేక దృష్టి



**వరంగల్ టౌన్, జూలై 25 (వుదయం ప్రతినిధి):**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జిడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి. వెంకన్న శనివారం రోజున 26వ డివిజన్‌లోని చార్‌బోలి ప్రాంతంలో ఆకస్మికంగా పర్యటించారు. మోడల్ డివిజన్‌గా అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్తూ, చెత్త సేకరణ సమయపాలన, తడి-పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నర్సంపేట, ఖమ్మం గ్రాండ్ ఎంట్రెన్స్ ప్రవేశ మార్గాలను పరిశీలించారు. సివిల్ పనులు పూర్తి కావడంతో వెంటనే ఫినిషింగ్, అలంకార మొక్కలతో హార్టికల్చర్ సుందరీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎంజీఎం ఆసుపత్రి వద్ద స్వీపింగ్ మిషన్లతో చేపడుతున్న రోడ్ల శుభ్రత పనులను పర్యవేక్షించారు. ఆగస్టు 3లోగా 'ఎస్ఐఆర్' ఫారాలు సమర్పించాలి: ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ఓటరు నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన కమిషనర్, ఆగస్టు 3వ తేదీలోపు పౌరులు తమ ఎస్ఐఆర్ ఫారాలను సమర్పించి ఓటరు జాబితా సవరణకు సహకరించాలని కోరారు.ఈ తనిఖీల్లో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, సీహెచ్ఎన్‌హెచ్ డాక్టర్ రాజేష్, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## నీట్ లీకేజీ పై సమగ్ర విచారణ చేపట్టాలినిరసన చేపట్టిన తెలంగాణ ఉద్యమకారులు



**హసన్ పర్తి జూలై25 (వుదయం ప్రతినిధి):**

నీట్ లీకేజీ పై తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించిసుప్రీం కోర్టు పర్యవేక్షణలో సీబీఐతో సమగ్ర విచారణ చేపట్టాలని హసన్ పర్తి తెలంగాణ జేఏసీ చైర్మన్ అనుమాండ్ల విద్యాసాగర్ డిమాండ్ చేశారు. శనివారం హన్మకొండహసన్ పర్తి అంబేద్కర్ విగ్రహం వద్ద జేఏసీఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులు కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న విదానాలను నిరసిస్తూఆందోళన చెపట్టారు. ఈ సందర్బంగా విద్యాసాగర్ మాట్లాడుతూ జంతర్ మంతర్ లో కాక్రోచ్ జనతా పార్టీ విద్యార్థి, యువజనులు చేపట్టిన నిరసన ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. గత రెండు నెలలుగా నీట్ పేపర్ లీకేజీ కారణంగా పరీక్ష రాసిన లక్షల మంది విద్యార్థులు అన్యాయానికి గురి అయ్యారని వాపోయారు దానిని తట్టుకోలేక 22 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలపై.. పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆపమని హెచ్చరించారు. విద్యా వ్యతిరేక విదానాలనువెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు గరిగే మురళి, పోతరాజు చిన్న స్వామి, మేకల ప్రభాకర్, మేకల శోభన్ బాబు, ఉద్యమ గాయకుడు గోనెల శివకుమార్, గుడాటి ముఖేష్, కుక్కల చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**విద్యార్థుల పోరాటానికి ఘన విజయం**

**డిమాండ్స్ అన్నింటినీ అమలు జరపాలి**

**పర్వతగిరి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు**



**పర్వతగిరి, జులై 25 ( వుదయం ప్రతినిధి ):**

నీట్ ప్రవేశ పత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లీకేజీ చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని, ఆత్మహత్యల పాలైన కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని మొదలైన డిమాండ్స్ తో సి జె పి నిర్వహిస్తున్న పోరాటంతో ఎట్టకేలకు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయడం విద్యార్థుల పోరాటానికి ఘన విజయమని పర్వతగిరి మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీతో దేశ వ్యాప్తంగా 23 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడిన మనోవేదన వెలకట్టలేనిదన్నారు. 23 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ గత నెల రోజులుగా శాంతియుతంగా జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న యువత నిరసన పోరాటాలకు పూర్తిగా మద్దతుగా ఉంటామని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కే. తారక రామారావు ( కేటీర్ ) స్పష్టం చేసారన్నారు. ఢిల్లీలో ఆందోళన బాట పట్టిన విద్యార్థులకు సాంఘి భవంగా బిఆర్ఎస్ విద్యార్థి విభాగం ( బిఆర్ఎస్ వి ) ఆధ్వర్యంలో నిన్న జరిగిన హైదరాబాద్ లోని ఇందిర పార్క్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నకు కేటీర్ హాజరై మద్దతుగా నిలిచి బీజేపీ ప్రభుత్వం పై విమర్శలు గుప్పించారని ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు ఆరోపించారు.బిఆర్ఎస్ వామపక్ష పార్టీలు, అన్ని ప్రజా సంఘాలు సంపూర్ణంగా మద్దతు ఇచ్చాయని అన్నారు. సోనమ్ వాంగ్ చుంగ్ 26 రోజులపాటు నిరవధిక నిరాహార దీక్ష చేయడం, ప్రభుత్వం నిర్బంధంగా అరెస్ట్ చేయడం, చలో పార్లమెంటు ముట్టడి సందర్భంగా పాల్గొన్న వేలాది మంది యువతి యువకులను క్రూరంగా లాఠీలతో రక్తాలు కారే విధంగా కొట్టడం, ఒక విద్యార్థిని మరణించడం, అనేకమంది ఆసుపత్రి పాలు కావడం, ఉద్యమాన్ని అణచేందుకు చేసిన నిర్బంధ కాండ ఇంతా అంతా కాదన్నారు. న్యాయ బద్ధమైన డిమాండ్స్ సాధనకై ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేస్తున్న వారిపై అధికార పార్టీ వారు చేసిన దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, పోలీసుల ,గూండాల లాఠీలను తూటాలను ధైర్యంగా ఎదుర్కొంటూ మొక్కవోని ధైర్యంతో పోరాడి విజయం సాధించిన విద్యార్థి లోకానికి ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా నిర్బంధ విధానాలను, విద్యార్థి వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని , లేనిచో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## జస్టిస్ బి. విజయ్ సేన్ రెడ్డిని కలిసిన జిల్లా కలెక్టర్, సీపీ



**హనుమకొండ, జూలై 25 (వుదయం ప్రతినిధి) :**

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. విజయ్ సేన్ రెడ్డిని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం రోజున హనుమకొండలోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి విచ్చేసిన జస్టిస్ విజయ్ సేన్ రెడ్డికి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ న్యాయమూర్తికి పూల మొక్కను అందజేసి స్వాగతం పలకగా, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ సీతారామచంద్రస్వామికి వెండితీర్థ పాత్ర బహుకరణ

**ధనలక్ష్మి తండ్రి సత్యనారాయణ జ్ఞాపకార్థం**

**ఆలయ చైర్మన్ గొల్లపూడి సుబ్బారావు.**



**ఖానాపురం, జూలై 25 (వుదయం ప్రతినిధి):**

మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి చలసాని ధనలక్ష్మి తండ్రి సత్యనారాయణ జ్ఞాపకార్థం 50 వేల రూపాయల విలువ గల వెండి తీర్థ పాత్రను ఆలయానికి బహుకరించినట్లు ఆలయ చైర్మన్ గొల్లపూడి సుబ్బారావు తెలిపారు. తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆలయ అర్చక స్వామి పర్వతపు శివప్రసాద్ శాస్త్రి వెండి తీర్థ పాత్రను బహుకరించిన భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనం తరం ఆలయ చైర్మన్ కు వెండి తీర్థ పాత్రను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి...

**ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం...కలెక్టర్**



**మెట్ పల్లి/జగిత్యాల, జులై 25 (వుదయం విలేకరి)**

ఎస్ఐఆర్ (స్పెషల్ఇంటెన్సివ్ రివిజన్) నమోదు ప్రక్రియను వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు శనివారం మెట్ పెల్లి ఆర్డీవో కార్యాలయంలో మెట్ పెల్లి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ బి సత్యప్రసాద్ పాల్గొని పురోగతిని సమీక్షించారు అధికారులు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేసి నమోదు శాతాన్ని మరింత పెంచాలని ప్రతి అర్హులైన ఓటరును నమోదు చేయడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు ఈ సమావేశంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ తహసీల్దార్ నీత సంబంధిత శాఖల అధికారులు బిఎల్ఓ లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తులకు కలెక్టర్ స్వాగతం



**కామారెడ్డి, జూలై 25 (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీ నారాయణ, జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ మాధవీ లతలకు జిల్లా కలెక్టర్ పూల మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు.

## దళిత బీజేపీ కౌన్సిలర్ షాపు కూల్చివేతపై జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్..

**వేములవాడ ఘటనపై కలెక్టర్, ఎస్పీ, దేవాదాయ కమిషనర్‌కు నోటీసులు**

**15 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశాలు..**


**బాధితుడి ఫిర్యాదుపై కమిషన్ చర్యలు..**



**వేములవాడ/రాజన్న సిరిసిల్ల జిల్లా, జులై 25 (వుదయం ప్రతినిధి) :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో దళిత బీజేపీ కౌన్సిలర్కొండ్లెపు ముత్యం షాపు కూల్చివేత ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ స్పందించింది. ఘటనను తీవ్రంగా పరిగణించిన కమిషన్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. షాపు కూల్చివేతకు సంబంధించిన పూర్తి వివరాలు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, బాధితుడి ఫిర్యాదుపై విచారణ పురోగతి తదితర అంశాలతో కూడిన సమగ్ర నివేదికను 15 రోజుల్లోగా సమర్పించాలని సంబంధిత అధికారులను కమిషన్ ఆదేశించింది. గత నెలలో వేములవాడ 17వ వార్డు బీజేపీ కౌన్సిలర్, దళిత నాయకుడు కొండ్లెపు ముత్యం నిర్వహిస్తున్న షాపును ఆలయ అధికారులు, సిబ్బంది తొలగించిన విషయం తెలిసిందే. తాను దళితుడిననే కారణంతోనే కక్షపూరితంగా తన షాపును లక్ష్యంగా చేసుకుని కూల్చివేశారని ముత్యం ఆరోపించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. దీంతో గత నెల 20న జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదును పరిశీలించిన కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, ఘటనపై పూర్తి వివరణతో కూడిన నివేదికను 15 రోజుల్లోగా అందజేయాలని ఆదేశించారు. శనివారం 17వ వార్డు కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం, బిజెపి కౌన్సిలర్ తో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

## అనారోగ్యంతో బాధపడుతున్నవారిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**పెద్దపెల్లి జులై 25 , (వుదయం కరస్పాండెంట్,)**

అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురిని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, ఆయన సతీమణి శైలజ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స అనంతరం ఐసీయూలో చికిత్స పొందుతున్న మంథని మాజీ ఉపసర్పంచ్, హైకోర్టు న్యాయవాది ఇనుముల సతీష్ తల్లి గౌరమ్మను పరామర్శించారు. కుటుంబసభ్యులను కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితి, వైద్యులు అందిస్తున్న చికిత్స గురించి తెలుసుకొని, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.అనంతరం హైదరాబాద్ బోడుప్పల్‌లోని శ్రీనివాస కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న మల్హార్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన కొండ చంద్రయ్యను పుట్ట మధూకర్, శైలజ దంపతులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి :

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణ రావు

**అధికారుల సూచనలు పాటించకుండా వరి సాగు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం**

**పెద్దపల్లి జిల్లాలో వేగంగా అభివృద్ధి పనులు... త్వరలో ఓదెలలో నూతన కోర్టు భవనం నిర్మాణం**

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా దశలవారీగా భూ పునఃసర్వే**

**పెద్దపల్లి జిల్లాలో ఇప్పటికే 23 గ్రామాల్లో భూ పునఃసర్వే ప్రారంభం... రైతులు పూర్తి సహకారం అందించాలి**



**పెద్దపల్లి, జూలై-25 (వుదయం ప్రతినిధి)**

సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నష్టాలను నివారించుకోవాలని ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు విజయ రమణరావు రైతులకు పిలుపునిచ్చారు.శనివారం ఓదెల మండల కేంద్రంలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని జిల్లా కలెక్టర్ ★కోయ శ్రీహర్షతో కలిసి ★ప్రభుత్వ విప్ ప్రభుత్వ విప్ శాసనసభ్యులువిజయ రమణ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ శాసనసభ్యులు విజయరమణరావు మాట్లాడుతూ, జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యాశాఖ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఇటీవలే గవర్నర్,ముఖ్యమంత్రి తో అవార్డు పొందినందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను అభినందించారు. కొద్ది నెలల క్రితం శ్రీరాంపూర్‌లో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించామని, నేడు ఓదెల తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.గత రెండున్నర సంవత్సరాలుగా పెద్దపల్లి జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఓదెలలో కోర్టు మంజూరైందని, త్వరలోనే నూతన కోర్టు భవన నిర్మాణాన్ని కూడా చేపడతామని చెప్పారు.జిల్లాలో డబుల్ రోడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, పోత్కపల్లి నుంచి కాల్వ శ్రీరాంపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయిందని తెలిపారు. గత ఏడాది శ్రీరాంపూర్, ఓదెల మండలాల టెయిల్ ఎండ్ ప్రాంతాలకు కూడా సాగునీరు అందించగలిగామని చెప్పారు.గత సీజన్‌లో అధిక వర్షాలు కురిసిన సమయంలో రానున్న సూపర్ ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి చెరువులను నింపాలని అధికారులకు సూచించామని, ఆ సమయంలో తీసుకున్న చర్యల వల్లే ప్రస్తుతం ఈ మండలాల్లో కొంత మేర నీరు అందుబాటులో ఉందన్నారు.ఇటీవల కురిసిన వర్షాలను చూసి నీటి సమస్య ఉండదనే అపోహలో రైతులు ఉండవద్దని సూచించారు. ఒక ఎకరం వరి సాగుకు వినియోగించే నీటితో నాలుగు ఎకరాల్లో కందులు, మొక్కజొన్న, చిరుధాన్యాలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి పంటలను సాగు చేయవచ్చని వివరించారు.కందులకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందని, నాలుగు నెలల్లోనే పంట చేతికి వచ్చి క్వింటాల్‌కు సుమారు రూ.10 వేల వరకు ధర లభిస్తోందన్నారు. ఆగస్టు నెలలో నువ్వుల సాగు కూడా చేపట్టవచ్చని, వాటికి క్వింటాల్‌కు సుమారు రూ.9 వేల వరకు మార్కెట్ ధర లభిస్తోందని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన పంటలనే సాగు చేయాలని, వారి సూచనలు పాటించకుండా అధిక నీటి అవసరమయ్యే పంటలు సాగు చేస్తే రానున్న రోజుల్లో నీటి కొరత కారణంగా పంటలను కాపాడుకోవడం రైతులకు చాలా కష్టమవుతుందని హెచ్చరించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పెద్దపల్లి జిల్లాకు వంద ఎకరాలకు కూడా సాగునీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. కొందరు చేసే తప్పుడు ప్రచారాలను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. ప్రతి రోజూ మంచి వర్షాలు కురవాలని దేవుడిని ప్రార్థిస్తున్నామని, ప్రతి రైతు పరిస్థితులను అర్థం చేసుకుని జాగ్రత్తగా పంటల ఎంపిక చేసుకోవాలని కోరారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్లో మంచి ధరలు లభించే అవకాశముందని తెలిపారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, ప్రతి ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా అందిస్తున్నామని, ఇటీవల తొమ్మిది రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. వరి కొనుగోళ్లలో క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా ప్రభుత్వం అందిస్తోందని గుర్తు చేశారు. పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని అన్నారు. గత రెండేళ్లలో ఓదెల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.5.5 కోట్ల నిధులు వెచ్చించామని తెలిపారు.

## ఊరూరా విస్తృత స్థాయిలో జలసిరి కార్యక్రమాలను చేపట్టాలి

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**



**కామారెడ్డి, జూలై 25 (వుదయం ప్రతినిధి):**

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సూచించారు. అన్ని జిల్లాల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)లు, డీ.ఆర్.డీ.ఓలు, జెడ్పీ సీ.ఈ.ఓలు, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో, ఎం.పీ.డీ.ఓలతో మంత్రి సీతక్క శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెర్ప్ సీ.ఈ.ఓ దివ్యదేవరాజన్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ప్రతీకూల పరిస్థితుల్లో వీబీజీ రామ్-జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు విరివిగా చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించాలని అన్నారు. గ్రామ సభలను నిర్వహిస్తూ ఈ పనుల ఆవశ్యకత గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి అన్ని గ్రామాలలో ఈ పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం వీబీజీ రామ్-జీ పథకం కింద ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో విరివిగా జలసిరి కార్యక్రమం అమలయ్యేలా చూడాలన్నారు. ఈ పనుల పరిశీలన కోసం మండల స్థాయిలో గ్రామీణ నీటి సరఫరా ఏ.ఈ, పంచాయతీరాజ్ ఏ.ఈ, ఎం.పీ.డీ.ఓ, ఎం.పీ.ఓ, ఏ.పీ.ఓలతో కమిటీని ఏర్పాటు చేసి, వారి అధ్వర్యంలో పనులను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రతీచోట పండగ వాతావరణంలో జలసిరి కార్యక్రమాలు అమలు జరగాలని, ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. కూలీలకు చేతినిండా పని కల్పిస్తూ, పనిదినాల లక్ష్యాన్ని సాధించడంతో పాటు నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని హితవు పలికారు. వీబీజీ రామ్-జీ పథకం కింద 318 రకాల పనులను చేపట్టవచ్చని, అయితే ప్రస్తుత తరుణంలో భూగర్భ జలాల పెంపునకు దోహదపడే జలసిరి కార్యక్రమాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదే విధంగా వన మహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటించాలని దిశా నిర్దేశం చేశారు. గ్రామ సభలలో చర్చించుకుని చేపట్టే ప్రతి పని ప్రజలకు ఉపయోగకరంగా నిలువాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ ఎన్ వై గిరి, జెడ్పీ సీ.ఈ.ఓ చందర్, డీ.ఆర్.డీ. దామోదర్ రెడ్డి, డీ.పీ.ఓ మురళి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహనతోనే హక్కుల పరిరక్షణ

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. ప్రభాకర రావు**



**ఆదిలాబాద్ (వుదయం ప్రతినిధి) జూలై 25:**

ప్రజల్లో చట్టాలపై అవగాహన పెరిగినప్పుడే రాజ్యాంగం కల్పించిన హక్కులను సమర్థంగా వినియోగించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా చట్టపరమైన సేవల సంస్థ (డీఎల్ఎస్ఏ) ఛైర్మన్ కె. ప్రభాకర రావు అన్నారు. బాలల రక్షణ, హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు.జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన 'నాల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్' అవగాహన సదస్సు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బాలల రక్షణ అధికారుల ఓరియెంటేషన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా చట్టపరమైన సేవల సంస్థను సంప్రదించాలని సూచించారు. మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందన్నారు. బాలల హక్కులపై ఉత్తమ అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన మూడు పాఠశాలలకు వచ్చే జనవరిలో ప్రత్యేక అవార్డులు అందజేస్తామని ప్రకటించారు.జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, బాలల హక్కులు, పోక్సో చట్టం, సైబర్ భద్రత, మంచి-చెడు స్పర్శ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై ఏడాది పొడవునా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు. ప్రతి నెల ఒక అంశాన్ని ఎంపిక చేసి అవగాహన కార్యక్రమాలు, చర్చలు, పోటీలు నిర్వహించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేయాలని, తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని ఆదేశించారు.అదనపు ఎస్పీ మౌనిక మాట్లాడుతూ, "పోలీస్ అక్క" కార్యక్రమం ద్వారా గత జూన్ నుంచి ఇప్పటివరకు 43 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 100కుపైగా ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు 23 బాల్య వివాహాలను అడ్డుకున్నామని తెలిపారు.డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ బాలల రక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్ భద్రత, బాలల హక్కులపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, బాలల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, బాలల రక్షణ అధికారులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 నాటికి రోళ్లవాగు షట్టర్ల బిగింపు

**నక్కలపేట వద్ద కొత్త ఎత్తిపోతల పథకం**

**సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులు ఉత్తమ్, అడ్లూరి సమీక్ష**



**ధర్మపురి జూలై 25, వుదయం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టుకు ఆగస్టు 15వ తేదీలోపు షట్టర్లు బిగించి, 0.25 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై శనివారం హైదరాబాద్‌లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమా ర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రోళ్లవాగు ప్రాజెక్టు కాలువల పూడికతీత పనులకు వెంటనే అంచనాలు తయారు చేయాలని స్పష్టం చేశారు. ధర్మపురి మండ లంలోని అక్కపల్లి లిఫ్ట్ పనులను ఆరు నెలల్లోగా పూర్తి చేసి, 2027 జనవరి చివరి నాటికి రైతులకు సాగునీరు అందించేలా వేగవంతం చేయాలన్నారు. వెల్గటూరు మండ లంలోని జంగల్ నాల ప్రాజెక్టు అభివృద్ధి, గొల్లపల్లి మండలంలో యశ్వంతరావుపేట, రంగధాముని పల్లి చెరువుల పూడికతీత పనుల అంచనాల నివేదికను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.నక్కలపేట వద్ద నూతన ఎత్తిపోతల పథకంధర్మపురి మం డ లంలోని నక్కలపేట గ్రామం వద్ద కొత్తగా లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ సమావేశంలో ప్రతిపాదించారు. దీనికి స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. నూతన లిఫ్ట్‌కు సంబంధించిన పూర్తి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నక్కలపేట వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రతిపాదించడం పట్ల ధర్మపురి మండల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగునీ టి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం: మంత్రి అడ్లూరి ప్రజా ప్రభుత్వంలో ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కమిషన్ల కోసమే ప్రాజెక్టుల పనులు చేపట్టారని విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం రైతుల సంక్షేమమే ధ్యేయంగా సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు.

## కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 'మొబైల్ రికవరీ మేళా': 117 ఫోన్లను బాధితులకు అందజేసిన ఎస్పీ నితికా పంత్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మొబైల్ రికవరీ మేళాలో రూ. 23,40,000 విలువైన 117ఫోన్లను ఎస్పీ నితికా పంత్ చేతుల మీదుగా బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రస్తుత రోజుల్లో మొబైల్ లేనిదే ఏ చిన్న లావాదేవీ కూడా చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. బ్యాంక్ అకౌంట్లు, పాస్‌వర్డ్‌లతో పాటు విలువైన సమాచారాన్ని ఫోన్లలో భద్రపరుచుకుంటున్నారని గ్రహించే నేరగాళ్లు దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీక్ పాస్‌వర్డ్‌లను హ్యాక్ చేసి ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా డబ్బులు కాజేస్తున్నారని వివరించారు. దీనివల్ల బాధితులు వ్యక్తిగత సమాచారంతో పాటు ఆర్థికంగానూ నష్టపోతున్నారన్నారు. మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తులు వెంటనే https://www.ceir.gov.in 'సీఈఐఆర్' (CEIR) పోర్టల్‌లో బ్లాక్ చేసి, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సెకండ్ హ్యాండ్ మొబైళ్లు కొనుగోలు చేసేవారు తప్పనిసరిగా షాపు యజమాని నుంచి రసీదు తీసుకోవాలని స్పష్టం చేశారు. దొంగిలించిన ఫోన్లని తెలిసి కూడా కొనుగోలు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐటీకోర్ ఇన్స్పెక్టర్ రవీందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తులకు ఘన స్వాగతం



**నిజామాబాద్, వుదయం , జూలై 25 :**

నిజామాబాద్ జిల్లా పర్యటనకు హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తంగిరాల మాధవీదేవి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ గడి ప్రవీణ్ కుమార్ లకు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. హైకోర్టు న్యాయమూర్తులు ముందుగా స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్దకు చేరుకుని, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జి జీవీఎన్.భరత లక్ష్మి , పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయ శాఖ అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ల ప్రతినిధులు హైకోర్టు జడ్జీలను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి, సీ.పీ., అదనపు కలెక్టర్ తదితరులతో హైకోర్టు న్యాయమూర్తులు అతిథి గృహంలో భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు.

## ఫారెస్ట్ క్వార్టర్స్ లో బైక్ లను దొంగలించిన ఐదుగురు తాసిల్దార్ వద్ద బైండోవర్




**జన్నారం, జూలై 25 (వుదయం విలేఖరి)**

జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలోని ఫారెస్ట్ క్వార్టర్స్ లోకి అక్రమంగా ప్రవేశించి సీజ్ చేసి ఉంచిన బైకులను తీసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. అడ్డుకున్న వాచర్లపై దాడి చేసినట్లు ఫారెస్ట్ అధికారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జూలై 21న రాత్రి 9.30 గంటలకు ఫారెస్ట్ వారు సీజ్ చేసి ఉంచిన రెండు మోటార్ సైకిళ్లను వాటి యజమానులు ఇతరులతో కలిసి అక్రమంగా తీసుకెళ్లారు. ఈ ఘటనలో దేవునిగూడ గ్రామానికి చెందిన లాకవత్ ఉపేందర్, గవ్వల మురళీకృష్ణ అదే గ్రామానికి చెందిన భూక్యా సాయి, లాకవత్ విక్రమ్, లాకవత్ రాహుల్ నాయక్ సీజ్ చేసిన వాహనాలను తీసుకెళ్తుండగా అడ్డుకున్న బేస్ క్యాంప్ వాచర్లపై దాడి చేసినట్లు ఫారెస్ట్ అధికారులు జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఐదుగురు వ్యక్తులను జన్నారం తహసీల్దార్ బక్కయ్య ముందు బైండ్ ఓవర్ నిమిత్తం హాజరు పరిచారు.

## సీసీ కెమెరాలతోనే గ్రామానికి రక్షణ

**సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి**

**పూర్తి సహకారం అందిస్తాం: సర్పంచ్ బాలగౌడ్**



**ధర్మపురి, జూలై 25:(వుదయం ప్రతినిధి)**

గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సులువవుతుందని, ప్రజల భద్రత మరింత బలోపేతమవుతుందని ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ.రాం నర్సింహారెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో శనివారం ఎస్ఐ జి. మహేష్ తో కలసి పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవ గాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల తీవ్ర అప్రమత్తత అవసరమన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫేక్ కాల్స్, ఆన్‌లైన్ మోస పూరిత మెసేజ్‌లు, అనుమానాస్పద లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమె రాల ప్రాముఖ్యతను ఉదాహరణ లతో వివరి స్తూ, వీటి ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.గ్రామ సర్పంచ్ కాసారపు బాలగౌడ్ మాట్లాడుతూ.. పోలీసు ల సూచనల మేర కు గ్రామస్తుల సహకారంతో త్వరలో నే నేరెళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పోలీసు శాఖ చేపడుతు న్న భద్రతా చర్యలకు గ్రామ పంచాయ తీ పూర్తి సహకా రం అందిస్తుం దని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాసారపు కొమురయ్య వార్డు సభ్యులు, పొలాస మల్లేశం బోన కంటి రాకేష్ బైరి నగేష్ గ్రామ పెద్దలు, కుల సంఘాల నాయకులు, స్థానిక ప్రముఖులు సీసీ కెమెరాల ఏర్పా టుకు ఏకగ్రీవ మద్దతు తెలి పారు. సుమారు 200మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆగస్టు 6న జరిగే బీసీ సాధికారత సదస్సును విజయవంతం చేయండి

- తెలంగాణ రక్షణ సేన నాయకుల పిలుపు

నారాయణపేట జూలై 25 (వుదయం ప్రతినిధి)



ఆగస్టు 6న జరిగే బీసీ సాధికారత సదస్సును విజయవంతం చేయాలని నారాయణపేట జిల్లా తెలంగాణ రక్షణ సేన నాయకులు పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని టి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగష్టు 6న ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న బీసీ సాధికారత సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జి గవినోళ్ల శ్రీనివాస్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అదే విధంగా మక్తల్ నియోజకవర్గ టి ఆర్ ఎస్ ఇంచార్జి డి.కె.సి.హెచ్. వెంకటన్న మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ సోదర సోదరీమణులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టి ఆర్ ఎస్ ప్రకటించిన పంచ జన్యంలో భాగంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతే రాజు, ఉద్యోగాల కల్పన, ఉపాధి అవకాశాల విస్తరణ, మహిళా సాధికారతతో పాటు సామాజిక న్యాయం అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని సామాజిక న్యాయ సాధన దినోత్సవంగా నిర్వహించాలని టి ఆర్ ఎస్ అధినేత్రి కవిత అక్క నిర్ణయించిన నేపథ్యంలో నారాయణపేట జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా మహిళా నాయకురాలు సంధ్యారాణి మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం సాధించాలంటే కవిత అక్క నాయకత్వమే సరైన దిశ అని అన్నారు.

ఈ కార్యక్రమంలో దామర్‌గిద్ద మండల పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, నాయకులు డాక్టర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## నెట్‌వర్క్ 'లాక్'... ఉపాధ్యాయులకు 'షాక్'!

- తాండూరు మండలంలో స్కూల్ అటెండెన్స్ తిప్పలు
- సమయానికి వచ్చినా వేయలేకపోతున్నాం: ఉపాధ్యాయుల తీవ్ర ఆవేదన

తాండూరు జులై 25 వుదయం ప్రతినిధి



ప్రభుత్వ పాఠశాలలను డిజిటలైజేషన్ వైపు నడిపించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ అటెండెన్స్, ఇతర యాప్‌లు గ్రామీణ ప్రాంతాల ఉపాధ్యాయులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఫోన్ నెట్‌వర్క్ సరిగా లేకపోవడంతో నిత్యం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు నమోదు చేయడం కత్తిమీద సాములా మారింది.

సమయానికి వచ్చినా ఫలితం శూన్యం!

ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం వేళకు బడికి చేరుకుంటున్నా... ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేసేసరికి ఆ పాఠశాలలో నెట్‌వర్క్ సిగ్నల్స్ లభించడం లేదు. సిగ్నల్ కోసం చెట్లు, బడి పైకప్పులు (స్లాబ్‌లు), ఎత్తైన గుట్టలు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.టైం దాటిపోతే యాప్‌లో "లేట్ అటెండెన్స్" అని రావడం ఉపాధ్యాయులకు మింగుడుపడటం లేదు.సకాలంలో బడికి వచ్చినా, యాప్ పని చేయకపోవడంతో లీవ్ పెట్టాల్సిన పరిస్థితి లేదా అధికారుల వివరణలకు గురికావాల్సి వస్తోందని టీచర్లు వాపోతున్నారు.

ఆన్‌లైన్ సేవలకు తీవ్ర విఘాతం

కేవలం హాజరు మాత్రమే కాకుండా...

మధ్యాహ్న భోజన పథకం (ఎండిఎం) వివరాలు

**విద్యార్థుల లర్నింగ్ అసిస్‌మెంట్ వివరాలు**

పాఠశాల నివేదికలు, ఆన్‌లైన్ ఎంట్రీలు ఇలా ఏ చిన్న పని చేయాలన్నా నెట్‌వర్క్ లేక గంటల తరబడి సమయం వృథా అవుతోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బోధనపై శ్రద్ధ పెట్టాల్సిన సమయంలో, నెట్‌వర్క్ వెతుక్కునేందుకు సమయం వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఇబ్బందులు ఎప్పుడు పోతాయి?

డిజిటల్ ఇండియా, డిజిటల్ విద్యా విధానం అంటున్న ప్రభుత్వం... ముందుగా గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో కనీస సౌకర్యాలైన ఫోన్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ వైఫై సదుపాయాలు కల్పించాలని ఉపాధ్యాయులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఉపాధ్యాయుల విజ్ఞప్తి:**

"యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ విధానం తేవడం మంచిదే అయినా, నెట్‌వర్క్ లేని గ్రామాల్లో ఆఫ్‌లైన్ అటెండెన్స్ సదుపాయం ఇవ్వాలి. లేదా ప్రతి స్కూల్‌కి బ్రాడ్‌బాండ్/వైఫై కనెక్షన్లు కల్పించాలి. సాంకేతిక లోపాల వల్ల సమయానికి వచ్చినా 'లేట్' అని పడకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలి."తాండూరు మండలంలోని ఆయా గ్రామాల చెంగోల్, చంద్రవంచ, ఉదండాపూర్, సంకిరెడ్డిపల్లి, తదితర పాఠశాలల సమస్యపై విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే పరిష్కారం చూపాలని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి.

## 'జలసిరి' & ఉపాధి హామీ పనులపై ప్రత్యేక సమీక్ష

వనపర్తి జులై 25 (వుదయం ప్రతినిధి)




జిల్లాలో జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి భూగర్భ జలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి : అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్జిల్లాలో జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి భూగర్భ జలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ, పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో కలిసి అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జలసిరి కార్యక్రమం, వి బి జి రామ్ జి పథకం పనులు, గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, భవిష్యత్తులో నీటి కొరతను నివారించేందుకు జలసిరి కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. "ప్రతి ఇంటికి ఇంకుడు గుంత – ప్రతి పంటకు పంటకుంట – ప్రతి ఊరికి ఊటకుంట" అనే నినాదంతో భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి రైతు తన పొలంలో ఫామ్‌పాండ్ నిర్మించుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలని, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేయించాలని సూచించారు. రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాలను సమర్థవంతంగా సంరక్షించవచ్చని పేర్కొన్నారు. వి బి జి రామ్ జి (ఉపాధి హామీ) కింద చేపడుతున్న పనుల్లో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉందని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి పేద కూలీకి ఉపాధి దినాలు కల్పించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా కొంత స్థలాన్ని వదిలి నాటేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు మొక్కల నాటే కార్యక్రమాన్ని సాధించాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో జలసిరి కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, ప్రతి గ్రామపంచాయతీలో నీటి సంరక్షణకు అవసరమైన పనులను గుర్తించి గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు, ఫామ్‌పాండ్లు, ఊటకుంటలు, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు ఏర్పాటు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వి బి జి రామ్ జి ద్వారా చేపట్టే నీటి సంరక్షణ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి కూలీకి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పి సీఈవో యాదయ్య, డి ఆర్ డి ఓ ఉమాదేవి, డిపిఓ రఘునాథ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రాంగణ నియామకాల్లో సత్తా చాటిన విద్యార్థులు

- 102 మందికి ఉద్యోగాలు: ఎమ్మెల్సీ సురభి వాణీదేవి
- అభినందించిన కళాశాల యాజమాన్యం

గజ్వేల్ జులై 25 (వుదయం ప్రతినిధి)



సురభి దయాకర్ రావు ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రాంగణ నియామకాల (ప్లేస్‌మెంట్ డ్రైవ్)లో సత్తా చాటారని కళాశాల సెక్రటరీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తెలిపారు. కళాశాల ప్రాంగణంలో 'మాజిక్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో అరబిందో ఫార్మా, క్వేస్ కార్ప్, మెడ్ ప్లస్, వి.ఎల్.ఆర్. ఫెలిసిటేటర్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ప్రతిభ కనబరిచిన 102 మంది విద్యార్థులకు ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ మాచర్ల వెంకటరమణ, కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, కళాశాల అధ్యాపకుల బోధన, అధునాతన ల్యాబ్ సౌకర్యాల వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఉన్నత ప్రతిభ దాగి ఉందని, సమయాన్ని వృథా చేయకుండా ఇష్టపడి చదివి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు శివారెడ్డి, సాయి శైలేష్, సునీల్ రావు, ధర్మ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.గణేష్, అధ్యాపకులు డాక్టర్ స్వాతి, రోహిణి, శాంతిప్రియ, నరేష్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్-నినోపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

వుదయం, చిన్నకోడూరు:



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి తక్కువ నీటి అవసరమయ్యే పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ సూచించారు. శనివారం మండలంలోని అనంతసాగర్ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి మొక్కజొన్న, కంది, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్, సర్పంచ్ పర్శరాములు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల విఠలాపూర్ సర్పంచ్ దాసరి ఎల్లయ్య తండ్రి మృతి పట్ల మహేందర్ యాదవ్ సంతాపం తెలుపుతూ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## వికారాబాద్‌లోనే వైద్యం.. హైదరాబాద్‌కు పరుగెందుకు?

- GGHను అన్ని రకాల వైద్య సేవలకు కేంద్రంగా తీర్చిదిద్దాలి: స్పీకర్ ప్రసాద్ కుమార్
- 330 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి..
- త్వరలో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ | డాక్టర్లు, సిబ్బంది సేవాభావంతో పనిచేయాలి
- అంబులెన్స్‌లు నిమిషాల్లో బయలుదేరేలా చర్యలు

వికారాబాద్ ,జులై 25 (వుదయం బ్యూరో):




వికారాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (GGH)ను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డ ప్రసాద్ కుమార్ తెలిపారు. వికారాబాద్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన GGH అభివృద్ధి సొసైటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ఒక్కో మెడికల్ విద్యార్థి విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.70 లక్షలు ఖర్చు చేస్తోందని, రిక్రూట్‌మెంట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలను కూడా కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం ఇంత చేస్తున్న నేపథ్యంలో వైద్యులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.హెచ్ఓడీలు హైదరాబాద్ నుంచి ప్రతిరోజూ వచ్చి వెళ్లకుండా స్థానికంగా ఉంటే మరింత సమయం వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వికారాబాద్‌లోనే మెడికల్ కాలేజీ అందుబాటులో ఉన్నందున కాలేజీ అధ్యాపకులతో పాటు ఆసుపత్రి హెచ్ఓడీలు కూడా తమ అనుభవాలను వైద్య విద్యార్థులకు బోధించాలని సూచించారు.

గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం కారణంగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయలేకపోతున్నామని, అయినప్పటికీ అందుబాటులో ఉన్న నిధుల మేరకు వికారాబాద్ ఆసుపత్రికి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

అందుకే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల పరీక్షలు, చికిత్సలు, ఆపరేషన్లు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు, మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వం వందల, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి భవనాలు, పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు, ఇతర సౌకర్యాలు కల్పించినప్పటికీ.. వైద్యులు, సిబ్బంది నాణ్యమైన వైద్యం అందించి రోగులను ఆరోగ్యంగా ఇంటికి పంపించినప్పుడే ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు.

"మౌలిక వసతులు కల్పించడం మా బాధ్యత.. మంచి చికిత్స అందించడం మీ బాధ్యత" అని వైద్యులు, సిబ్బందికి స్పీకర్ సూచించారు.వికారాబాద్ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న 100 పడకల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌ను రూ.30 కోట్లతో 330 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. త్వరలో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ కూడా అందుబాటులోకి రానుందని చెప్పారు. వైద్య విద్యార్థులు కూడా అందుబాటులో ఉండటంతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు.

మెరుగైన వైద్యం కోసం ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే అన్ని రకాల వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా ఆసుపత్రి అంబులెన్స్‌లు ఎల్లప్పుడూ పని చేసే స్థితిలో ఉండాలని, అత్యవసర సమాచారం అందిన వెంటనే నిమిషాల్లో బయలుదేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

"మన ఆసుపత్రికి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తాను. నేను కోరేది ఒక్కటే.. రోగులు హాస్పిటల్‌కు బాధతో రావాలి.. తిరిగి వెళ్లేటప్పుడు నవ్వుతూ వెళ్లాలి. ఆ విధంగా ప్రతి ఒక్కరూ సేవలు అందించాలి" అని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు.

ఈ సమావేశంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, DMHO సుధాకర్ లాల్, GGH సూపరింటెండెంట్ సుభోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డితో పాటు GGH అభివృద్ధి సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో జాప్యానికి తావివ్వొద్దు

- ఆగస్టు 3లోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలి
- ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించండి.. అధికారులకు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశం

గద్వాల, జూలై 25 (వుదయం బ్యూరో):



కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఇంటింటికి పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఇంకా సమర్పించని ఓటర్ల నుంచి వెంటనే సేకరించి, నిర్దేశించిన గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం 84 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను ఆగస్టు 3లోగా వంద శాతం పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. గతంలో పూర్తయిన మ్యాపింగ్ వివరాలను సంబంధిత సూపర్వైజర్లు, బీఎల్వోలు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే వారం ప్రతి అధికారి పూర్తి బాధ్యతతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూభారతి, సాదాబైనామా దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే పనులను వేగవంతం చేయడంతో పాటు, లైసెన్స్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు దరఖాస్తు చేసుకున్న కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువపత్రాలను ఆలస్యం లేకుండా జారీ చేసి, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓ అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ



మెదక్ జిల్లా, వుదయం:

నిజాంపేట మండలం నగరం గ్రామంలో విబిజిరామ్ జి పథకంలో భాగంగా జల సిరి కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఓ రాజిరెడ్డి గారి అధ్యక్షతన మరియు సర్పంచ్ అంతంపల్లి సుశీల గారి సమక్షంలో గ్రామ సభ నిర్వహించి గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, పంట పొలాల్లో పంట కుంట, ఊరికి ఊట కుంట,కమ్యూనిటీ సోక్ పిట్, బోర్ వెల్ రీచార్జ్ తదితర పనులపై అవగాహన కల్పించి ఇట్టి పనులు చేపట్టడం వలన భూగర్భ జలాలు పెరుగుతాయని అలాగే కూలీలకు ఉపాధి లభిస్తుందని తద్వారా ఎల్ నినో వాతావరణ మార్పులను కూడా తట్టు కోవచ్చని తెలియజేయడం జరిగింది.అలాగే గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమం లో భాగంగా చెట్లను నాటడం జరిగింది మరియు హోమ్ స్టెడ్ ప్లాంటేషన్ లో భాగంగా ప్రతి ఇంటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల, గ్రామ పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, గ్రామ ఉప సర్పంచ్ నాజం, వార్డు మెంబెర్స్ సుభాష్, లక్ష్మణ్, గ్రామ స్థాయి అధికారులు మరియు సీనియర్ మెట్ గోపి , గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



- వట్టెంలో మహిళా సంఘం భవనం, ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం
- ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

బిజినపల్లి, జులై 25 (వుదయం ప్రతినిధి) :

మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు.శనివారం బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ మహిళల అభ్యున్నతి, స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని, మహిళా సంఘాల బలోపేతం ద్వారా గ్రామీణాభివృద్ధికి మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు.అనంతరం మహిళలతో ఆత్మీయంగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## విధుల పట్ల అంకితభావం చూపిన ఏడు మంది పోలీసు సిబ్బందికి సీపీ అభినందనలు

- సీపీ కనెక్ట్' ద్వారా ప్రశంసా పత్రాలు, కిట్లు అందించిన పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్

సిద్దిపేట, జూలై 25 (వుదయం బ్యూరో):



శాంతిభద్రతల పరిరక్షణలో,నేరాల నియంత్రణలో అద్భుత ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని ప్రోత్సహించడంలో భాగంగా ప్రవేశపెట్టిన సీపీ కనెక్ట్' కార్యక్రమంలో 07 మంది పోలీసు సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ప్రత్యేకంగా అభినందించారు. కమిషనరేట్ కార్యాలయంలో వారికి ప్రశంసా పత్రాలతో పాటు ప్రత్యేక కిట్లను అందజేసి, వారి సేవలను కొనియాడారు. ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద రాత్రి గస్తీలో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని గమనించిన కానిస్టేబుళ్లు ఎస్. కృష్ణ, వి. రమేష్‌లు స్టేషన్‌కు తరలించారు. క్రైమ్ పార్టీ కానిస్టేబుల్ ఎమ్. నరేందర్ సాంకేతిక పరికరం (ఫింగర్‌ప్రింట్ డివైజ్) ద్వారా వేలిముద్రలు తనిఖీ చేయగా అతడు పాత నేరస్థుడిగా తేలింది. విచారణలో తిరుమలగిరి బస్టాండ్ వద్ద దొంగిలించిన స్కూటీని రికవరీ చేశారు. మార్కూక్ ఎస్సై యోనస్ అహ్మద్ అలీ, కానిస్టేబుళ్లు కిషోర్ కుమార్, ఉపేందర్ రెడ్డి, హోంగార్డ్ వేణులతో కలసి కరకపట్ల వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న 5 దొంగిలించిన సబ్‌మెర్సిబుల్ పంప్ మోటార్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉంటూ సాంకేతికతను ఉపయోగిస్తూ నేరస్తులను పట్టుకోవడం అభినందనీయం. సిబ్బంది అందరూ ఇదే నిబద్ధతతో పనిచేసి కమిషనరేట్ పరిధిలో నేర రహిత వాతావరణానికి కృషి చేయాలి. 'సీపీ కనెక్ట్' ద్వారా మరింత సమర్థవంతమైన, స్పందించే పోలీస్ వ్యవస్థను నిర్మిస్తాం అన్నారు.

## క్షయవ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి చేయాలి

- ఆశా, ఏఎన్ఎంల ద్వారా ఇంటింటా అవగాహన కల్పించాలి
- ప్రత్యేక క్యాంపులతో టీబీ గ్రస్తులను గుర్తించి చికిత్స అందించాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్, జులై 25 (వుదయం బ్యూరో) :



క్షయవ్యాధి (టీబీ) నిర్మూలనను అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకొని జిల్లాలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాను క్షయవ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి వైద్య సేవలను చేరవేసి వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించాలని సూచించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన వైద్యశాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణ, వివిధ మండలాల వైద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.క్షయవ్యాధి నివారణకు ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. క్షయవ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, చికిత్స విధానం గురించి అవగాహన కల్పించడంతో పాటు అవసరమైతే అక్కడికక్కడే శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించాలని ఆదేశించారు. ఈ విధానం ద్వారా వ్యాధిని తొలిదశలోనే గుర్తించి బాధితులకు వెంటనే చికిత్స ప్రారంభించే అవకాశం ఉంటుందన్నారు.

క్షయవ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సహాయం, ఉచిత మందులు, వైద్య పరీక్షలు, ఇతర సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి సమాచారం అందించాలని మండల వైద్యాధికారులను ఆదేశించారు. చికిత్స మధ్యలో ఎవరూ విరమించకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, రోగులు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

ప్రతి మండలంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, గ్రామ స్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే జిల్లాను క్షయవ్యాధి రహిత జిల్లాగా మార్చే లక్ష్యాన్ని సాధించవచ్చని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇందుకోసం గ్రామస్థాయిలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో అపోహలను తొలగించాలని సూచించారు.మరో పది రోజుల్లో జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై కూడా ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. హెచ్ఐవీ, టీబీ వంటి అంటువ్యాధుల నియంత్రణలో వైద్యశాఖ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ ఆర్‌బీఎస్‌కే ద్వారా నిర్వహించే ఆరోగ్య పరీక్షల సమయంలో కూడా టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే అవకాశముందన్నారు. పిల్లలు, యువతపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా మరిన్ని కేసులను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని తెలిపారు.

## సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రిమాండ్ ఖైదీ పరార్

వుదయం, సిద్దిపేట ప్రతినిధి




సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శనివారం వైద్య పరీక్షల కోసం జైలు నుంచి తీసుకొచ్చిన రిమాండ్ ఖైదీలలో ఓ ఖైదీ పరారయ్యాడు. బైక్ దొంగతనం కేసుల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సాయి కుమార్ పోలీసుల కళ్లుగప్పి పోలీసు వాహనం ఎమర్జెన్సీ డోర్ ద్వారా తప్పించుకున్నట్లు సమాచారం. పరారైన ఖైదీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తొలి ఏకాదశి – విశిష్టత

- వివరించిన శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్.....

**వుదయం న్యూస్, శివ్వంపేట జూలై 25:**





మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామ వాస్తవ్యులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ పెద్దగోని జిన్నారం శివకుమార్ గౌడ్. నేడు తొలి ఏకాదశి పురస్కరించుకొని ఆయన తొలి ఏకాదశి గురించి ఇలా వివరించారు.ఆషాఢ మాస ఏకాదశి తొలి ఏకాదశిగా (ఆషాఢ శుద్ధ ఏకాదశిగా) జరుపుకుంటారు. దీనినే "శయన ఏకాదశి, ప్రథమ ఏకాదశి", "హరివాసరం" అని కూడా అంటారు. ఈ రోజు నుంచీ శ్రీ మహావిష్ణువు క్షీరాబ్ధి యందు శేషపాన్పు పైన శయనిస్తాడు. కనుక దీన్ని "శయన ఏకాదశి" అంటారు. నిజానికి ఒకరకంగా పరిశీలిస్తే ఇది ప్రకృతిలో జరిగే , మార్పులకు (పంచ భూతాలు, సూర్య చంద్రులు, గ్రహాలు పరస్పర సంబంధాన్నీ వాటి గమనాన్ని, బట్టి) సంకేతంగా చెప్పుకోవచ్చు. ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు ఈరోజు నుండి దక్షిణ దిశకు వాలుతున్నట్టు కనిపిస్తాడు (సూర్యుడు దక్షిణం వైపుకు మరలినట్లు, ఈ రోజు నుంచి దక్షిణాయన ప్రారంభాన్ని సూచిస్తుంది). అంతేగాక చాతుర్మాస్య వ్రతం కూడా ప్రారంభమౌతుంది. ఇదే రోజున గోపద్మ వ్రతమును ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఈ రోజు మొదలుకొని, కార్తీక మాస శుక్ల పక్ష ద్వాదశి వరకు అంటే క్షీరాబ్ధి ద్వాదశి ఆచరించవలెనని వారు వివరించారు. శ్రీ గురు పీఠం విచ్చేసిన భక్తులు విని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రైతంటే అంత నిర్లక్ష్యమా?

- రెవెన్యూ అధికారుల దగా... మండుటెండలో రైతు కుటుంబం అల్లాటప్పా నిరీక్షణ!
- అధికార పక్ష నేతల ముసుగులో సర్వేకు బ్రేకులు!
- '341'కి లేని కేసును అంటగట్టి కలెక్టర్ పేరుతో నాటకాలు!

**గద్వాల జూలై 25 (వుదయం బ్యూరో)**

అధికారుల బాధ్యతారాహిత్యం, స్థానిక నేతల వెన్నుపోటు రాజకీయాలకు ఒక సామాన్య రైతు బలిపశువయ్యాడు. సర్వే చేస్తామని తేదీ ఖరారు చేసి, నోటీసు పంపిన రెవెన్యూ యంత్రాంగం... చివరి నిమిషంలో బోర్డు తిప్పేసింది. జెమ్మిచేడుకు చెందిన రైతు శ్రీనివాస్‌గౌడ్ తన భూమి సర్వే కోసం నెలల తరబడి కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడంతో కోర్టుకెళ్లి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. జులై 25న సర్వే చేస్తామని అధికారులే నోటీసివ్వడంతో కుటుంబ సమేతంగా పొలానికి వెళ్లిన రైతుకు ఉదయం నుంచి ఎదురు చూపే మిగిలింది. గంటల తరబడి నిరీక్షించాక ఏడీ నూకరాజును ఫోన్లో నిలదీస్తే... కలెక్టర్ ఆదేశాలంటూ సర్వేను రద్దు చేసినట్లు చెప్పారు. కోర్టు కేసులున్నాయని అధికారులు చెబుతున్న మాటలు పచ్చి అబద్ధమని, ఆ కేసులు 342, 344 నంబర్లవని, తమ 341 నంబరుకు ఎలాంటి వివాదాలు లేవని రైతు స్పష్టం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకే అధికారులు తలొగ్గారని, తమకు న్యాయం జరిగే వరకు హైకోర్టు దాకా పోరాడతామని రైతు కుటుంబం తెగేసి చెప్పింది.

**(హైదరాబాద్, వుదయం):**

ఈరోజు తొలి ఏకాదశి పండగ పురస్కరించుకొని నగరంలో ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠాగోపాల్ , రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర ముదిరాజ్, కార్యదర్శి దామోదర్ రెడ్డి, మీడియా ఇన్చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్ పద్మ పోస్టర్ శీను, జి శ్రీనివాస్, గండు వెంకటేష్, సిలివేరు వెంకటేష్, వెంకటేష్ రావు తదితరులు పాల్గొన్నారు





# ఎల్‌నినోపై అవగాహన చాట్లపల్లిలో ఫార్మ్ పాండ్

- పంటల పరిశీలన

**సిద్దిపేట(జగదేవ్‌పూర్), జులై 25 (వుదయం ప్రతినిధి)**

జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లిలో ఎల్‌నినో ప్రత్యేక గ్రామసభ అనంతరం మండల వ్యవసాయ అధికారి రైతు బాలకృష్ణ రెడ్డి పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పొలంలో నిర్మించిన ఫార్మ్ పాండ్ (నీటి కుంట)ను పరిశీలించి, వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడానికి వర్షపు నీటిని నిల్వ చేసుకుని సూక్ష్మ సేద్యం ద్వారా పంటలకు ఉపయోగించాలని రైతులకు సూచించారు. అనంతరం రైతు సాగు చేస్తున్న స్వీట్ కార్న్, కంది పంటలను పరిశీలించి, నీటి యాజమాన్యం, ఎరువులు, చీడపీడల నివారణపై సాంకేతిక సలహాలు అందించారు. ప్రతి ఒక్కరూ వర్షపు నీటిని సంరక్షిస్తూ వాతావరణ మార్పులను తట్టుకునేలా శాస్త్రీయ పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ కోరింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి కృష్ణమూర్తి, రైతులు బాలకృష్ణ రెడ్డి, బీరయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక యువకుడికి జాతీయ అవార్డు

**వుదయం, దుబ్బాక**

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గంభీర్పూర్ గ్రామానికి చెందిన డా. అరిగె లోకేష్‌కు కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా "వీర్ జవాన్ దేశ్ సేవా రత్న అవార్డు-2026" జాతీయ అవార్డు లభించింది. గత ఎనిమిదేళ్లుగా సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ ద్వారా పేద, గ్రామీణ యువతకు ఉచితంగా ఆర్మీ, పోలీస్ ఉద్యోగాల కోసం శిక్షణ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా మదర్ తెరెసా ఫౌండేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఇప్పటివరకు 9 వేల మందికి పైగా శిక్షణ అందించగా, వారిలో 175 మంది వివిధ రక్షణ దళాలు, పోలీస్ శాఖల్లో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా డా. అరిగె లోకేష్‌కు పలువురు అభినందనలు తెలిపారు.




# అడవిలో వద్దు...అందుబాటులో ముద్దు

- ఆర్టీఓ కార్యాలయ నిర్మాణం పై ప్రజల ఆందోళన
- కార్యాలయ నిర్మాణానికి రూ. 5 కోట్ల అంచనా కార్యాలయానికి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో స్థల పరిశీలన

**నారాయణపేట, జూలై 25 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలో ప్రతిపాదిత ఆర్టీఓ కార్యాలయ నిర్మాణానికి సంబంధించి పట్టణానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో, ఎక్లాస్‌పూర్ లక్ష్మమ్మ గుడి సమీపంలో స్థలాన్ని పరిశీలించినట్లు సమాచారం వెలువడుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు పలు సందేహాలు, అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించే ప్రభుత్వ కార్యాలయం కేవలం నేటి అవసరాలను కాకుండా రానున్న 30-40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మించాలని కోరుతున్నారు.ప్రతిరోజూ డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, ఇతర సేవల కోసం వందలాది మంది ఆర్టీఓ కార్యాలయాన్ని ఆశ్రయిస్తారు. అలాంటి కార్యాలయం పట్టణానికి దూరంగా ఉంటే ప్రజలు అదనపు ఖర్చు, సమయం, రవాణా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులు, వృద్ధులు, దివ్యాంగులు కార్యాలయానికి చేరుకోవడం ఇబ్బందిగా మారుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజా రవాణా సౌకర్యాలు పరిమితంగా ఉన్న ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేయడం సరైన నిర్ణయం కాదని వారు చెబుతున్నారు. అంతేకాక, పరిశీలనలో ఉన్న ప్రాంతం నల్ల రేగడి నేలగా ఉండటంతో భారీ నిర్మాణాలకు ఎంతవరకు అనుకూలమనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ఆధునిక ఆర్టీఓ కార్యాలయాల్లో ఆటోమేటిక్ వెహికల్ టెస్టింగ్ పరికరాలు, భారీ యంత్రాలు, ట్రాక్‌లు, అలాగే రోజూ హెవీ వెహికల్స్, టిప్పర్లు, లారీలు, బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి భారాన్ని దీర్ఘకాలం తట్టుకునేలా భూమి ఉందా లేదా అనే అంశంపై నిపుణుల సాంకేతిక నివేదిక ఆధారంగా మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.ప్రస్తుతం ఖాళీ స్థలం ఉందనే కారణంతో నిర్ణయం తీసుకోవడం కంటే, భవిష్యత్‌లో పట్టణ విస్తరణ, ట్రాఫిక్, ప్రజల రాకపోకలు, రవాణా సౌకర్యాలు, భద్రత, పార్కింగ్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలతో అనుసంధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.




**ప్రభుత్వ కార్యాలయాలు ప్రజల వద్దకు రావాలి...**

ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల కోసం అడవుల్లో తిరగాల్సిన పరిస్థితి రావద్దు అని స్థానికులు పేర్కొంటున్నారు. అడవిలో వద్దు... అందుబాటులో ముద్దు అనే నినాదంతో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, ఆర్టీఓ కార్యాలయాన్ని అందరికీ సులభంగా చేరుకునే, భవిష్యత్ అవసరాలకు అనువైన ప్రాంతంలో నిర్మించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# SIR ప్రక్రియను పరిశీలించిన ఆవుల రాజిరెడ్డి

- కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు

**నర్సాపూర్, జూలై 25 (వుదయం):**

మాసాయిపేట మండల కేంద్రంలో కొనసాగుతున్న SIR ప్రక్రియను శనివారం కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి SIR కోఆర్డినేటర్ అన్వేష్ రెడ్డి కలిసి ప్రక్రియ పురోగతి గురించి అడిగి తెలుసుకుని, పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారుఅనంతరం నర్సాపూర్‌లో శ్రీ సాయి కృష్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కౌడిపల్లి మండలం ధర్మసాగర్ మాజీ సర్పంచ్ పుండరీకం గౌడ్, వార్డు సభ్యులు జీవన్ గౌడ్, హేమ్లా, స్వామితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు ప్రజల విశ్వాసమే పార్టీలోకి చేరికలకు కారణమని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీలో సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని అన్నారుఈ కార్యక్రమంలో నర్సాపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేశం కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



# దస్తగిరిపేట్ (అంతారం పంచాయతీ)లో భక్తిపారవశ్యం

- శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ కుచ్చ వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో భక్తుల కోలాహలం!

**తాండూరు, జులై 25 వుదయం ప్రదినిధి :**

తొలి ఏకాదశి పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని తాండూరు మండలం అంతారం గ్రామపంచాయతీ పరిధిలోని దస్తగిరిపేట్ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం మరియు ఖాంజాపూర్ గేట్ సమీపంలోని శ్రీ కుచ్చ వెంకటేశ్వర స్వామి దేవాలయం భక్తుల గోవింద నామస్మరణతో మారుమోగాయి. రెండు ఆధ్యాత్మిక క్షేత్రాలలోనూ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో నిర్వహించబడ్డాయి. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని రెండు ఆలయాల్లోనూ శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో కూడిన శ్రీ వేంకటేశ్వర స్వామివారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు మరియు మహామంగళహారతులు సమర్పించారు. ఉదయం నుంచే పరిసర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.

"శ్రద్ధ ఉంటే శ్రీవారి దర్శనం... నమ్మకం ఉంటే ఆయన అనుగ్రహం ఖాయం!" అనే సత్యం ఈ క్షేత్రాలలో నిరూపితమవుతోందని భక్తులు భక్తిపారవశ్యంతో కొనియాడారు. "శ్రీ వేంకటేశాయ నమః" అనే స్మరణలతో రెండు ఆలయాల ప్రాంగణాలు మారుమోగాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్థానిక నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు మరియు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.రెండు పుణ్యక్షేత్రాల దర్శనంతో దస్తగిరిపేట్, అంతారం పరిసర ప్రాంతాలలో పండుగ వాతావరణం, ఆధ్యాత్మిక సందడి నెలకొంది.



# పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి అకాల మరణం

- శోకసంద్రంలో కుటుంబం
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఘన నివాళి

**తాండూరు జులై 25: వుదయం ప్రదినిధి :-**

మాజీ మంత్రి, సీనియర్ నాయకులు పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి స్వర్గీయ విమలమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, తాండూరు నియోజకవర్గ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి హైదరాబాద్ వారి నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి భావోద్వేగంతో ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... "అమ్మ ప్రేమకు మించినది ఈ లోకంలో ఏదీ లేదు. ప్రతి ఒక్కరి జీవితంలోనూ అమ్మ స్థానం అమూల్యం, భర్తీ చేయలేనిది. కుటుంబ ఎదుగుదలలో, పట్నం సోదరులను సమాజానికి ఉపయోగపడే ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో విమలమ్మ చూపిన మార్గం, పడ్డ కష్టం వర్ణనాతీతం. ఈ రోజు వారు మన మధ్య లేకపోవడం పట్నం కుటుంబానికే కాకుండా, వారిని అభిమానించే ప్రతి ఒక్కరికీ తీరని లోటు," అని తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. అనంతరం పట్నం మహేందర్ రెడ్డి , కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ కష్టకాలంలో భగవంతుడు ఆ కుటుంబానికి గుండె నిబ్బరాన్ని ప్రసాదించాలని, విమలమ్మ గారి ఆత్మకు సద్గతులు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారాసింగ్, తాండూరు మున్సిపల్ చైర్మన్ నీరజ బాల్ రెడ్డి, రవి గౌడ్, వడ్డే శ్రీనివాస్,పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని, మాతృమూర్తి విమలమ్మ గారికి నివాళులర్పించారు.



# జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలి

- గర్భిణుల రక్తహీనత, HPV టీకా, NCD స్క్రీనింగ్ పై ప్రత్యేక దృష్టి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ

**నాగర్‌కర్నూల్, జులై 25 (వుదయం ప్రతినిధి) :**

ప్రతి జాతీయ ఆరోగ్య కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ తెలిపారు. శనివారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ కె. కృష్ణ మాట్లాడుతూ ప్రతి గర్భవతిని 12 వారాలలోపు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా వారి రక్తహీనతపై ప్రత్యేక దృష్టిసారించి, ప్రతి గర్భవతి కాన్పు అయ్యేలోపు కనీసం 11 గ్రాముల హిమోగ్లోబిన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాధికారులకు ఆదేశించారు.14 సంవత్సరాల బాలికలందరికీ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు HPV టీకాకరణపై అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 100 శాతం 14 సంవత్సరాల పిల్లలందరికీ HPV టీకాకరణ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

30 సంవత్సరాల వయసు పైబడిన ప్రతి ఒక్కరికీ అసాంక్రమిక వ్యాధులైన అధిక రక్తపోటు, మధుమేహం కొరకు స్క్రీనింగ్ పరీక్షలు ఆగస్టు నెలలోపు పూర్తి చేయాలని తెలిపారు. ఇందులో క్షేత్ర స్థాయి సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

వర్షాకాలంలో అంటు వ్యాధుల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా రెసిడెన్షియల్ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ సురేష్ బాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ భీమానాయక్, డాక్టర్ తారా సింగ్, డీపీవో రేనయ్య, ఎపిడిమియాలజిస్ట్ ప్రవల్లిక, ఏపీవోలు బాలస్వామి, విజయ్ కుమార్, కోట్ర నిరంజన్, శివకుమార్, డీడీఎంలు సందీప్ కుమార్, నవీన, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



# నిట్ పరీక్షల రద్దు

- మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి
- మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి

ఆందోల్ జోగిపేట్ వుదయం శనివారం మున్సిపల్ పట్టణ ప్రధాన రహదారిపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నెట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పోలీసుల లాఠీచార్జ్ లో గాయపడ్డ విద్యార్థులకు ఆర్థిక నష్టపరిహాన్ని కేంద్ర ప్రభుత్వం చెల్లించాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో నరేంద్ర మోడీ తన మొండి వైఖరిని వీడకుంటే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి అన్నారు ఢిల్లీలో పోలీసుల జరిపిన లాఠీచార్జికు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడానికి నిరసిస్తూ జోగిపేట పట్టణ రహదారిపై బయట నుంచి కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై కేంద్ర ప్రభుత్వానికి ఈ విధంగా నినాదాలు చేశారు రహదారిపై కాసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు కౌన్సిలర్ నాని ఠాకూర్ శ్రీనివాస్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివరాజ్ మాజీ ఎంపీటీసీ మిద్దెల రాజిరెడ్డి ఆయా గ్రామ సర్పంచులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు



# నేడు శివ్వంపేట లో విద్యుత్ సరఫరా లో అంతరాయం

**వుదయం న్యూస్, శివ్వంపేట జూలై 25 :**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చెంది సబ్ స్టేషన్ పరిధిలో మరమత్తుల కారణంగా శివ్వంపేట మండల కేంద్రంతో పాటు. వ్యవసాయ బోర్లకు కూడా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని శివ్వంపేట మండల విద్యుత్ శాఖ సురేందర్, ఒక ప్రకటనలు తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ వినియోగదారులు. ప్రజలు రైతులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ సురేందర్, విజ్ఞప్తి చేశారు. విద్యుత్ మరమ్మత్తుల కారణంగా ఈ సమస్య ఏర్పడుతుందని ఆయన వివరించారు.



# నిర్ణీత గడువు లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలి



**నారాయణపేట, జూలై 25 (వుదయం ప్రతినిధి):**

నారాయణపేట మండలంలోని లింగంపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన దారిలో రూ.200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను శనివారం జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. అగ్రిమెంట్ ప్రకారం 2027 జూన్ నాటికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మింప చేయిస్తోందని, అందులో భాగంగానే నారాయణపేట నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను ఇక్కడి లింగంపల్లి గ్రామ సమీపములో నిర్మించడం జరుగుతోందని తెలిపారు. స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆమె అధికారులను ఆదేశించారు. స్కూల్ నిర్మాణంలో 4 అకాడమిక్ బ్లాక్‌లు, ఒక సీనియర్ డార్మిటరీ ,ఒక జూనియర్ డార్మిట్ ,ఒక వంటగది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, రెండు సింగిల్ క్వార్టర్లు, 6 డబుల్, సంప్ లు, తల్లిదండ్రుల లాంచ్ ఉంటాయని టీజీ ఈ డబ్ల్యూ ఐ డీ సీ డీ.ఈ.ఈ వెంకట్ రెడ్డి మ్యాప్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఓటర్లకు కీలక సూచన

- ఎన్యుమరేషన్ పత్రాలు పూరించి బీఎల్ఓలకు అప్పగించాలి
- 43 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక దృష్టి.. 100 శాతం డిజిటలైజేషన్‌కు చర్యలు

**గద్వాల, జూలై 25 (వుదయం బ్యూరో):**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ పత్రాలను ఓటర్లు పూర్తిగా పూరించి సంబంధిత బీఎల్ఓలకు తప్పనిసరిగా అందజేయాలని గద్వాల తహసిల్దార్ హరికృష్ణ కోరారు. గద్వాల మండల పరిధిలో 75 శాతం కంటే తక్కువ డిజిటలైజేషన్ నమోదైన 43 పోలింగ్ కేంద్రాలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో వంద శాతం డిజిటలైజేషన్ లక్ష్యంగా బీఎల్ఓల ద్వారా ఇంటింటి సర్వేను ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. రాధాకృష్ణ కాలనీ, వీవర్స్ కాలనీ, భీమ్‌నగర్, రెవెన్యూ కాలనీ, సుంకులమ్మ మెట్టు, నల్లకుంట, రాజీవ్ మార్గ్, గంజిపేట, కుంటవీధి, వేణు కాలనీ, రెండో రైల్వే గేట్, బురదపేట, షేరెల్లి వీధి, అశోక్‌నగర్, రాతిబురుజు, సోమనాద్రి నగర్, శ్రీనివాస కాలనీ, చింతలపేట, భవానీనగర్, తూర్పు దౌదర్‌పల్లి, తెలుగు పేట, బీసీ కాలనీ, లింగంబావి కాలనీ, చిన్న అగ్రహారం, మద్రాస్‌పేట, పూడూరు ఎస్సీ కాలనీ, అంబేద్కర్‌నగర్, ఎర్రమట్టి వీధి తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో డిజిటలైజేషన్ పురోగతి ఆశించిన స్థాయిలో లేదన్నారు. లక్ష్యానికి వెనుకబడిన పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి గణనీయమైన పురోగతి సాధించే దిశగా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలు తమకు అందిన ఎన్యుమరేషన్ పత్రాలను ఆలస్యం చేయకుండా పూరించి సంబంధిత బీఎల్ఓలకు అందజేసి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని తహసిల్దార్ హరికృష్ణ విజ్ఞప్తి చేశారు.

# ఈనెల 27న ప్రజావాణి రద్దు

**సిద్దిపేట, జూలై 25 (వుదయం బ్యూరో)**

ఈనెల 27వ తేదీ సోమవారం నాడు ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించాల్సిన 'ప్రజావాణి' కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రోజున జనాభా లెక్కలు, భూముల రీసర్వేకు సంబంధించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కావున ఈ విషయాన్ని జిల్లా ప్రజలంతా గమనించి, సోమవారం (27వ తేదీన) ప్రజావాణి అర్జీల కోసం ఐడీఓసీ కార్యాలయానికి ఎవరూ రాకూడదని సూచించారు. తిరిగి తదుపరి సోమవారం నుండి యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.



# ఈ నెల 27 నుండి విత్తన మేళా

- జిల్లా వ్యవసాయ అధికారి బీ. కవిత

**వికారాబాద్, జూలై 25; (వుదయం జిల్లా ప్రతినిధి):**

జిల్లాలోని అన్ని మండల కేంద్రాల రైతు వేదికలలో జూలై 27 నుండి 29 వరకు 'విత్తన మేళా' నిర్వహించబడుతోందని జిల్లా వ్యవసాయ అధికారి బి.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా విత్తన మేళా సందర్భంగా ప్రత్యామ్నాయ పంటల సాగు, అత్యవసర ప్రణాళిక పై రైతులకు అవగాహన కల్పించే సమావేశాలను ఏఈఓలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు.

అంతేకాకుండా మేళా సమయంలో విత్తన వ్యాపారులు రైతు వేదికలలో కౌంటర్లను ఏర్పాటు చేసి అత్యవసర ప్రణాళికలో భాగంగా ప్రోత్సహిస్తున్న పంటల విత్తనాలన్నింటిని అందుబాటులో ఉంచాలని ఆమె ఆదేశించారు.

రైతుల సౌలభ్యం కోసం అన్ని కంపెనీలకు చెందిన వివిధ రకాల విత్తనాలు ఒకే చోట లభించే అవకాశాన్ని రైతులు వినియోగించుకో కోవచ్చునని ఆమె సూచించారు.విత్తన మేళా గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని, గరిష్ట సంఖ్యలో రైతులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందేలా చూడాలని ఎంఏఓ, ఏఈఓ లను జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశించారు.



# హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ మశాల్ జులూస్ వేదిక మార్చబడింది

**(హైదరాబాద్, వుదయం):**


గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు కార్యక్రమానికి హాజరవుతున్న కొత్త వేదిక: ఇందిరా గాంధీ విగ్రహం, నెక్లెస్ రోడ్సమయం: సాయంత్రం 6:00 గంటలకు..ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు, గౌరవ మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు..కాబట్టి విద్యార్థులు, యువత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ సాయంత్రం 6:00 గంటలకు ఇందిరా గాంధీ విగ్రహం, నెక్లెస్ రోడ్ వద్దకు చేరుకుని ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మనవి..విద్యార్థుల భవిష్యత్తును కాపాడుదాం – పేపర్ లీక్ మాఫియాను అరికట్టుదాం!

ఇట్లు,
ఎమ్మెల్యే కార్యాలయం
జూబ్లీహిల్స్ నియోజకవర్గం



# చక్కని ఆరోగ్యం

## 'డబుల్ చిన్' సమస్య.. తగ్గాలంటే!



అందం విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. కొన్ని చిన్న చిన్న సమస్యలు ముఖాకృతిని దెబ్బతీస్తుంటాయి. డబుల్ చిన్ కూడా అలాంటిదే! గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం వల్ల అదనపు లేయర్‌లా కనిపిస్తుంటుంది. ఈ సమస్యతో నలుగురిలోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతుంటారు కొందరమ్మాయిలు. అయితే కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తూ డబుల్ చిన్‌ను తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. డబుల్ చిన్ రావడానికి ముఖ్యంగా 3 కారణాలున్నాయని చెబుతున్నారు నిపుణులు.

అధిక బరువు – అకస్మాత్తుగా బరువు పెరగడం లేదా తగ్గడం వల్ల ఈ సమస్య వస్తుంది. బరువు పెరిగినప్పుడు గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం, తగ్గినప్పుడు అక్కడి చర్మం వదులుగా మారడమే ఇందుకు కారణం.

వంశపారంపర్యంగా – డబుల్ చిన్ రావడానికి జన్యుపరమైన కారణాలూ ఉన్నాయంటున్నారు నిపుణులు. వయసు పైబడడం – వయసు పెరుగుతున్న కొద్దీ ముఖ కండరాలు దృఢత్వాన్ని కోల్పోవడం.. గడ్డం కింద కొవ్వు పేరుకుపోవడం, అక్కడి చర్మం వదులవడం వల్ల కూడా డబుల్ చిన్ వస్తుందట.

డబుల్ చిన్ సమస్యతో బాధపడే వారు ఆహారాన్ని బాగా నమిలి మింగాలట. ఇలా చేయడం వల్ల ముఖ కండరాలకు వ్యాయామం అంది దృఢంగా మారే అవకాశం ఉంటుందట. దీనివల్ల అదనపు కొవ్వులు పేరుకుపోకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. అలాగే మార్కెట్లో లభించే షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్స్ నమలడం కూడా మంచిదేనని చెబుతున్నారు. రెండు గుడ్లలోని తెల్లసొన, ఒక టేబుల్‌స్పూన్ పాలు, కొద్దిగా తేనె–నిమ్మరసం.. ఇవన్నీ బాగా కలిపి.. ఈ మిశ్రమాన్ని డబుల్ చిన్ ఉన్న చోట ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. అలా 30 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. తెల్లసొన చర్మాన్ని బిగుతుగా మారుస్తుందట. ఇలా తరచూ చేయడం వల్ల డబుల్ చిన్ క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. గుడ్డు వాసన నచ్చని వారు ఈ మిశ్రమంలో కొన్ని చుక్కల ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్ కూడా కలుపుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. గ్రీన్ టీ శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేస్తుంది. చెడు కొవ్వును కరిగిస్తుందట. కాబట్టి కాఫీ, టీలకు బదులుగా గ్రీన్ టీని డైట్‌లో చేర్చుకుంటే డబుల్ చిన్‌నూ క్రమంగా తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు.

మెడ గుండ్రంగా, నెమ్మదిగా కొద్ది సమయం పాటు తిప్పడం, పైకి–కిందకు కదిలించడం.. వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేసినా ఫలితం ఉంటుందట.

అలాగే కొవ్వులు అధికంగా ఉండే ఆహార పదార్థాలకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలంటున్నారు నిపుణులు.

## ఆరోగ్యానికి... అర్ధ హలాసనం

ఎక్కువగా నిల్చొని పనిచేసేవారిలో, ఊబకాయుల్లో వేరికోజ్ వీన్స్– అంటే ఉబ్బిన సిరల సమస్య కనిపిస్తుంటుంది. ఇది వంశపారంపర్యంగానూ రావొచ్చు. అర్ధ హలాసనం ఈ సమస్య తీవ్రతను తగ్గిస్తుంది. సిరలను ఆరోగ్యంగా ఉంచి రక్తప్రసరణకు సాయపడుతుంది.

చేసే విధానం: ముందుగా నేలపైన వెల్లకిలా పడుకోవాలి. కాళ్లూ, మడమల్ని దగ్గరగా చేర్చాలి. కాలి వేళ్లను కలిపి ఉంచండి. చేతుల్ని శరీరానికి ఇరువైపులా పెట్టి... అరచేతులు నేలకు తాకేలా చూడండి. నెమ్మదిగా కాళ్లను పైకి లేపుతూ నిటారుగా వచ్చేలా చూడండి. ఊపిరి బిగించకుండా సాధారణ స్థాయిలో శ్వాస తీసుకుంటూ ఉండండి. తర్వాత నెమ్మదిగా యథాస్థితికి అంటే, శవాసనానికి వచ్చి విశ్రాంతి పొందండి. ఎంత సమయం చేయాలి? ఆసన స్థితిలో ఎంతసేపు ఉండగలిగితే అంతసేపు ఉండండి. 20 సెకన్లతో మొదలుపెట్టి నిమిషానికి పెంచేందుకు ప్రయత్నించండి.

జాగ్రత్తలు: ఉదర సంబంధిత సర్జరీలైన వాళ్లు, వెన్ను సమస్యలు, హెర్నియా ఉన్నవారు నిపుణుల సమక్షంలో చేయాలి.

ఆహారం: ఆహారంలో ఉప్పు ఎక్కువగా వాడొద్దు. బీట్‌రూట్, అల్లం, పసుపు, ద్రాక్ష, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి.



## సింగపూర్ భామల బ్యూటీ సీక్రెట్స్!

ప్రస్తుతం అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవడానికి ఎన్నెన్నో సౌందర్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. అయితే ఎన్నున్నా ప్రకృతిలో లభించే పదార్థాలనే తమ సౌందర్య పరిరక్షణ కోసం ఉపయోగిస్తారట కొంతమంది సింగపూర్ భామలు. వయసు పెరుగుతున్నా వన్నె తరగని తమ సౌందర్య రహస్యం కూడా ఇదేనంటున్నారు. మరి, ఇంతకీ వాళ్ల బ్యూటీ సీక్రెట్స్ ఏంటో మనమూ తెలుసుకుందాం రండి.. చర్మం తాజాగా కనిపించాలన్నా, వృద్ధాప్య ఛాయలు దరిచేరకుండా యవ్వనంగా మెరిసిపోవాలన్నా.. చర్మం తేమగా ఉన్నప్పుడే అది సాధ్యమవుతుంది. అందుకోసం నీళ్లు ఎక్కువగా తాగడం, చక్కటి పోషకాహారం తీసుకోవడం.. వంటివి కామనే. వీటితో పాటు కొంతమంది సింగపూర్ మగువలు తమ చర్మాన్ని తేమగా ఉంచుకోవడానికి ఒక సహజసిద్ధమైన ఫేస్‌ప్యాక్‌ను కూడా ఉపయోగిస్తారట. బాగా పండిన అవకాడో లేదా బొప్పాయి లేదా రెండూ కలిపి గుజ్జులా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి ఇరవై నిమిషాల పాటు ఉంచుకొని చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల చర్మం తేమను సంతరించుకుంటుందట. ముఖ్యంగా బొప్పాయిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్ చర్మం పొడిబారిపోయి పొలుసులుగా ఊడిపోయే సమస్యను తగ్గిస్తుందట. తద్వారా చర్మం తాజాగా, ప్రకాశవంతంగా, మృదువుగా మారుతుందట. సాధారణంగా ఫేషియల్ కాస్త సమయంతో కూడుకున్నది. అయితే ఈ సమయాన్నీ వృథా చేయడం ఇష్టం లేని వారి కోసమే ప్రస్తుతం ఫేషియల్ షీట్ మాస్కులు మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగించుకునే అమ్మాయిల సంఖ్య కూడా రోజురోజుకీ పెరుగుతోంది. ఈ క్రమంలోనే సింగపూర్ అతివలు సైతం తమ అందాన్ని సంరక్షించుకోవడానికి వివిధ రకాల ఫేషియల్ షీట్ మాస్కుల్ని ఉపయోగిస్తారట. జుట్టు, గోళ్లను సంరక్షించుకోవడానికి సింగపూర్ అతివలు ఆర్గన్ ఆయిల్ వాడుతుంటారు. ఈ నూనెలో విటమిన్ 'ఇ', ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి చర్మానికి లోలోపలి నుంచి తేమనందించి తాజాగా కనిపించేలా చేస్తాయట. ఇందుకోసం ఈ నూనెతో చర్మం, జుట్టు, గోళ్లను కాసేపు మర్దన చేసుకోవాల్సి ఉంటుంది అంటున్నారు నిపుణులు. కొంతమందికి చర్మం, జుట్టు కుదుళ్లు పదే పదే జిడ్డుగా మారతాయి. తద్వారా జుట్టు ఎక్కువగా రాలిపోవడం, గడ్డిలా మారడం, చుండ్రు.. వంటి సమస్యలొస్తాయి. వీటి పరిష్కారానికి కొబ్బరి నూనెను ఉపయోగిస్తారట కొంతమంది సింగపూర్ భామలు. ఈ క్రమంలో పడుకునే ముందు కుదుళ్లకు, జుట్టుకు కొబ్బరి నూనెను పట్టించి.. కాసేపు మర్దన చేయాలి. ఉదయాన్నే గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుందట.



## చుండ్రుకు చెక్ పెట్టాలంటే..!

వాతావరణంలో మార్పులు, హార్మోన్ల స్థాయుల్లో హెచ్చుతగ్గులు, జుట్టు–కుదుళ్లను సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడం.. ఇలాంటివన్నీ చుండ్రు సమస్యకు కారణమవుతుంటాయి. ఫలితంగా జుట్టు నిర్జీవంగా మారిపోయి రాలిపోతుంటుంది. అయితే ఈ సమస్యకు కొన్ని ఇంటి చిట్కాలూ పరిష్కారం చూపుతాయంటున్నారు నిపుణులు.

చుండ్రు సమస్యను తగ్గించడంలో పెరుగు, నిమ్మరసం కీలక పాత్ర పోషిస్తాయి. ఇందుకోసం నాలుగు టేబుల్‌స్పూన్ల హెన్నా పొడిలో రెండు టేబుల్‌స్పూన్ల నిమ్మరసం వేసి కలపాలి. ఆపై ఈ మిశ్రమంలో పెరుగు వేస్తూ పేస్ట్ అయ్యేంత వరకు కలుపుతుండాలి. దీన్ని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి అరగంట పాటు ఉంచుకోవాలి. ఆపై గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుందట. ఈ చిట్కాను రెండు వారాలకోసారి పాటించడం వల్ల క్రమంగా చుండ్రు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. మందార ఆకులు, పువ్వుల్లో ఉండే గుణాలు జుట్టు సమస్యల్ని తగ్గించడంలో సహకరిస్తాయట. ఇందుకోసం ముందుగా మందార ఆకులు, పువ్వుల్ని ఎండబెట్టి పొడి చేసుకోవాలి. ఈ పొడిని కొద్దిగా తీసుకుని నాలుగు టేబుల్ స్పూన్ల హెన్నా పొడితో పాటు ఉసిరి, మెంతుల పొడుల్నీ కొద్దిగా కలపాలి. ఇప్పుడు ఇందులో కొద్దికొద్దిగా పెరుగు వేసుకుంటూ మృదువైన పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి పూర్తిగా ఆరనివ్వాలి. ఆపై గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే చుండ్రు సమస్య తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు నిపుణులు. జుట్టు ఆరోగ్యానికి మెంతులు ఎంత మంచివో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందుకే కొన్ని హెయిర్ ప్యాక్‌లలో కూడా వీటిని ఉపయోగిస్తుంటారు. నాలుగు టేబుల్‌స్పూన్ల హెన్నా పొడి, రెండు టేబుల్‌స్పూన్ల నిమ్మరసం, రెండు టేబుల్‌స్పూన్ల పెరుగుతో పాటు ఒక్కో టేబుల్‌స్పూన్ చొప్పున ఆలివ్ నూనె, వినెగర్, మెంతిపొడి.. వీటన్నింటినీ బాగా కలుపుకొని రాత్రంతా నానబెట్టుకోవాలి. మరుసటి రోజు ఉదయం ఈ మిశ్రమాన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు అప్లై చేసుకొని రెండుమూడు గంటల పాటు ఆరనివ్వాలి. ఆపై గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుందట.

ఇలా తరచూ చేయడం వల్ల చుండ్రు సమస్యకు పరిష్కారం లభిస్తుందంటున్నారు నిపుణులు. అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవే అయినప్పటికీ.. వ్యక్తిగతంగా ఎవరికి వారు తమ జుట్టు తత్వానికి సరిపడతాయో లేదో పరిశీలించుకోవాలి. అవసరమైతే ఆయా పదార్థాలను వాడే ముందు సంబంధిత నిపుణులను సంప్రదించి, సందేహాలను నివృత్తి చేసుకోవడం మంచిది.

## ఈ కాలంలో ఆరోగ్యంగా..!

వాతావరణం మారినప్పుడు.. అందులోనూ వర్షాకాలంలో వివిధ వ్యాధుల బారిన పడడం మామూలే. అయితే– ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న వారిలో ఈ సమస్యలు మరింత అధికం. ఈ క్రమంలో– వానలు కురిసే వేళ దగ్గు, జలుబు, జ్వరాల వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి ఈ పానీయం ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు.



కావాల్సిన పదార్థాలు

గోరువెచ్చని నీరు –2 కప్పులు, నిమ్మకాయలు – ఒకటిన్నర, తాజా అల్లం రసం – ఒకటిన్నర టేబుల్ స్పూన్, మామిడి అల్లం – టేబుల్ స్పూన్

తేనె– 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు – చిటికెడు

దాల్చిన చెక్క– (రుచి కోసం)

తయారీ!

ముందుగా ఒక గిన్నె/టీపాట్ లోకి తేనె, నిమ్మరసం, అల్లం రసం, మామిడి అల్లం, దాల్చిన చెక్క, ఉప్పు తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమానికి గోరువెచ్చని నీటిని జత చేసి తేనెతో పాటు మిక్స్ చేసిన పదార్థాలన్నీ కరిగిపోయేవరకు బాగా కలపాలి. ఆ తర్వాత దీనిపై మూత పెట్టి 5–6 నిమిషాల పాటు పక్కన పెట్టాలి. ఆపై ఒక కప్పులోకి వడకట్టుకుని తాగితే ప్రయోజనం ఉంటుందంటున్నారు నిపుణులు. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థ పనితీరును క్రమంగా మెరుగుపరుస్తాయట. అల్లంలో పుష్కలంగా ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జీర్ణ సంబంధిత సమస్యల్ని తగ్గిస్తాయట. నిమ్మలో సహజంగా ఉండే సి–విటమిన్, పొటాషియం రోగ నిరోధక శక్తి పెరగడానికి సహకరిస్తాయట. ఇక మామిడి అల్లం పోషకాల సమూహం. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి దగ్గు, అజీర్తి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయని చెబుతున్నారు నిపుణులు.

## చినుకుల్లోనూ కళ్లు పొడిబారడం..!




ఎండాకాలమే అనుకుంటాం కానీ... చినుకులు పడుతున్నా కొందరిలో కళ్లు పొడిబారడం తగ్గదు. నిజానికి దీనికీ కాలానికీ పెద్దగా సంబంధమే ఉండదు అంటారు నిపుణులు. ఇందుకు కన్నీళ్లు పెద్దగా ఉత్పత్తి కాకపోవడం, అశ్రుపొరకి ఇబ్బంది కలగడం, తేమ త్వరగా ఆవిరవ్వడం... ఇలా కారణాలు చాలానే. దీనివల్ల దురద, మంట, కళ్లు ఎర్రబడటంతో పాటు మసకబారడం, అతిగా నీళ్లు కారడం వంటి ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ సమస్య మగవాళ్లతో పోలిస్తే ఆడవాళ్లలో ముఖ్యంగా వయసు పెరిగేకొద్దీ ఎక్కువగా ఉంటుందట. హార్మోన్ల అసమతుల్యత, గర్భధారణ, మెనోపాజ్, గర్భనిరోధక మాత్రలు అతిగా వాడటం, థైరాయిడ్ సమస్యలు... వంటివన్నీ ఈ ఇబ్బందిని పెంచేవే. ఇవి చాలవన్నట్లు స్క్రీన్‌ని అధికంగా చూడటం... ఈ క్రమంలో రెప్పలు కొట్టడం మర్చిపోవడం, ఏసీలో అతిగా గడపడం వంటివీ ప్రభావం చూపుతాయి.

అంతేకాదు, అందం కోసం కాంటాక్ట్ లెన్స్‌లను ఎక్కువసేపు వాడినా ఐమేకప్ త్వరగా తొలగించకపోయినా పొడిబారడం పెరుగుతుంది. కాబట్టి, కళ్ల ఆరోగ్యాన్నీ పట్టించుకోవాలి. ముఖ్యంగా కళ్ల వ్యాయామాలు చేయాలి. స్క్రీన్‌ని చూసేటప్పుడు కళ్లార్పుతున్నామా లేదా అనేది గమనించుకోవాలి. ఐమేకప్‌ని ఎక్కువసేపు ఉంచుకోకూడదు. అలాగే పూర్తిగా శుభ్రపరచుకోవాలి. ఇవన్నీ చేస్తున్నా సమస్య ఇబ్బందిపెడుతోంటే వైద్యుల సాయం తీసుకోవాలి.

## మళ్లీ.. చర్మానికి మెరుపు.. ఇలా!

ఎంత జాగ్రత్తగా ఉన్నా.. ఒక్కోసారి వాతావరణాన్ని బట్టి చర్మం పొడిబారడం, నిర్జీవంగా మారడం, పగుళ్లు రావడం.. వంటి సమస్యలు సహజం. అయితే ఇంట్లోనే లభించే కొన్ని పదార్థాలతో తయారు చేసుకునే ఫేస్ ప్యాక్స్ ద్వారా ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..

బాగా పండిన అరటిపండు తీసుకొని మెత్తని గుజ్జుగా చేసుకోవాలి. దానికి చెంచా చొప్పున తేనె, పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని చర్మంపై అప్లై చేసుకొని 20 నుంచి 30 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. తరచూ ఇలా చేస్తే ఫలితం ఉంటుంది. పెరుగు, తేనె చర్మానికి తేమనందిస్తే, అరటిపండు నిర్జీవంగా మారిన చర్మాన్ని పునరుత్తేజితం చేస్తుందని అంటున్నారు నిపుణులు. బాదంపై ఉండే పొట్టు తొలగించి కొద్దిగా పాలు జత చేస్తూ పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని రోజూ ముఖానికి, మెడకు ప్యాక్‌లా వేసుకొని పూర్తిగా ఆరనివ్వాలి. ఆపై చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే చక్కటి ఫలితం ఉంటుందట. కొద్దిగా శెనగపిండి తీసుకొని అందులో తగినంత టొమాటో రసం వేసి మెత్తని పేస్ట్‌లా కలుపుకోవాలి. కావాలనుకుంటే ఇందులో కాస్త రోజ్‌వాటర్ కూడా జత చేసుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని ప్యాక్‌లా అప్లై చేసుకొని.. 20 నిమిషాలు ఆరనిచ్చి చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇది చక్కని స్క్రబ్‌లా పని చేసి చర్మంపై ఉన్న మృతకణాల్ని తొలగిస్తుందట. అలాగే నిర్జీవమైన చర్మానికి తిరిగి జీవం పోసి తాజాగా కనిపించేలా చేస్తుంది.





## బ్యాంకులు, బీమా, ఫండ్‌లకూ ఒకే కస్టమర్ ఐడీ!

వినియోగదార్లకు సంబంధించి దేశీయ బ్యాంకులు, బీమా సంస్థలు, మ్యూచువల్‌ఫండ్ సంస్థలు ఒకే కస్టమర్ ఐడీని వినియోగించేందుకు సిద్ధమవుతున్నాయని సమాచారం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ), బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ సంయుక్తంగా చేపట్టిన 'మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి (కేవైసీ) 2.0 నిబంధనావళి అమల్లోకి వస్తే, ఇది సాకారం కానుంది. వినియోగదారులు అనుమతి ఇస్తే చాలు.. కేంద్రీయ రిజిస్ట్రీ నుంచి వారి వివరాలను ఈ సంస్థలు పొందగలవు. అన్నింటికీ ఒకటే ఐడీ సరిపోతుంది.




# 5 రోజుల్లో సెన్సెక్స్‌కు 2092 పాయింట్ల నష్టం



సూచీల నష్టాలు వరుసగా అయిదో రోజుకు చేరాయి. పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతలకు తోడు అమెరికా తాజా వాణిజ్య సుంకాలపై ఆందోళనలు మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. శుక్రవారం నాడు సెన్సెక్స్ 332 పాయింట్లు, నిఫ్టీ 102 పాయింట్లు నష్టపోయాయి. గత 5 ట్రేడింగ్ రోజుల్లో కలిపి సెన్సెక్స్ 2091.68 పాయింట్లు, నిఫ్టీ 566.85 పాయింట్ల చొప్పున కుదేలయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 20 పైసలు పెరిగి 96.53 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 4.32% నష్టంతో 96.30 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ శుక్రవారం రూ.1.04 లక్షల కోట్లు తగ్గి రూ.475.69 లక్షల కోట్ల (4.93 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సోమ, మంగళవారాల్లో సూచీలు తగ్గినా, కంపెనీల మార్కెట్ విలువ పెరిగింది. మిగతా 3 రోజుల్లో తగ్గింది. గత శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి కంపెనీల మార్కెట్ విలువ రూ.480.92 లక్షల కోట్లు కాగా.. ఈ 5 రోజుల్లో కలిపి రూ.5.23 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. సెన్సెక్స్ ఉదయం 683 పాయింట్ల నష్టంతో (క్రితం ముగింపు 76,391.39తో పోల్చితే) 75,708.19 వద్ద ప్రారంభమైంది. ప్రారంభ ట్రేడింగ్‌లో 75,474.43 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిన సూచీ, అనంతరం స్వల్పంగా కోలుకుంది. చివరకు 331.62 పాయింట్ల నష్టంతో 76,059.77 దగ్గర ముగిసింది. నిఫ్టీ 102.15 పాయింట్లు తగ్గి 23,767.45 దగ్గర స్థిరపడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టాలు నమోదుచేశాయి. బజాజ్ ఫైనాన్స్ 2.58%, ఎటర్నల్ 2.34%, ఎం అండ్ ఎం 2.10%, భారతీ ఎయిర్‌టెల్ 1.66%, ఏషియన్ పెయింట్స్ 1.15% డీలాపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్ 2.08%, ఐటీసీ 0.78%, ట్రెంట్ 0.60%, టీసీఎస్ 0.52% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. వాహన, టెలికాం, విద్యుత్, వినియోగ, చమురు–గ్యాస్, స్థిరాస్తి, లోహ 0.96% వరకు పడ్డాయి. ఫోకస్డ్ ఐటీ 1.30, ఐటీ 0.66%, పీఎస్‌యూ బ్యాంక్ 0.65% పెరిగాయి..

జూన్ త్రైమాసికంలో రూ.238 కోట్ల నష్టం నమోదు చేయడంతో ఇండిగో షేరు 0.78% తగ్గి రూ.4,984.95 వద్ద ముగిసింది. త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపరచడంతో ఇన్ఫోసిస్ షేరు 1.03% నష్టంతో రూ.1,040.95 దగ్గర స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,402.47 కోట్లు తగ్గి రూ.4.22 లక్షల కోట్లకు చేరింది. అమెరికా సంస్థ ఆర్గానన్‌ను 11.75 బి.డాలర్ల (రూ.11,000 కోట్లు)తో కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనకు, ఆ కంపెనీ వాటాదార్లు అనుమతి ఇచ్చినట్లు సన్‌ఫార్మా తెలిపింది. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించేందుకు నిత్యా జెమ్స్ అండ్ జువెలరీ, ఇంటెలియస్ రికోడ్‌లకు సెబీ అనుమతి ఇచ్చింది. జునిపెర్ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ జులై 30న ప్రారంభమై ఆగస్టు 3న ముగియనుంది. పూర్తి తాజా షేర్ల జారీ ద్వారా రానున్న ఈ ఐపీఓతో కంపెనీ రూ.1800 కోట్లు సమీకరించనుంది. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ గేమ్స్‌క్రాఫ్ట్‌కు సంబంధించి రూ.1906 కోట్ల విలువైన ఆస్తులను తాజాగా అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. క్యాలిబర్ మైనింగ్ షేర్ల శుభారంభం: క్యాలిబర్ మైనింగ్ అండ్ లాజిస్టిక్స్ షేరు ఇష్యూ ధర రూ.424తో పోలిస్తే బీఎస్‌ఈలో ట్రేడింగ్ 18.86% లాభంతో రూ.504 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.538.15 వద్ద గరిష్ఠాన్ని తాకినా, చివరకు 24.64% లాభంతో రూ.528.50 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,455.11 కోట్లుగా నమోదైంది. మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు జులై 17తో ముగిసిన వారానికి 1.08 బి.డాలర్లు (దాదాపు రూ.10,500 కోట్లు) పెరిగి 676.237 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.64.91 లక్షల కోట్ల)కు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 964 మి.డాలర్లు పెరిగి 675.157 బి.డాలర్లుగా నమోదయ్యాయి.

## స్మార్ట్‌ఫోన్ల ప్రాసెసర్ ధరలు పెంచనున్న క్వాల్‌కామ్!




ఉన్న శాన్‌డియోగో కంపెనీ క్వాల్‌కామ్ కూడా తన ప్రాసెసర్ ధరలను రెండంకెల శాతానికి పెంచుతుండటం గమనార్హం (Qualcomm chip price hike)! దీంతో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల ధరలు మరింత ప్రియమయ్యే అవకాశం ఉంది. వ్యయ ధరల పెరుగుదల కారణంగా క్వాల్‌కామ్ తన ప్రాసెసర్ ధరలను పెంచనున్నట్లు కొన్ని అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి. సెప్టెంబర్ 1 నుంచి ఈ

ప్రముఖ కంపెనీలు ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతుండటంతో సెమికండక్టర్ విభాగానికి డిమాండ్ పెరుగుతోంది. అదే స్థాయిలో మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో ప్రపంచ టెక్ కంపెనీలు తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. యాపిల్, శాంసంగ్ వంటి పలు కంపెనీలు ఇప్పటికే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలను పెంచేశాయి. ప్రపంచంలోనే నంబర్‌వన్ చిప్ తయారీ సంస్థ తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ (టీఎస్‌ఎంసీ) కూడా చిప్ ధరలను పెంచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కస్టమర్‌గా

పెంపు అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఖర్చుల భారాన్ని ఇకపై మోయలేమని కంపెనీ పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై క్వాల్‌కామ్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్ ధరలు మండిపోతున్నాయి. క్రమంగా టీఎస్‌ఎంసీ, క్వాల్‌కామ్ కూడా తమ ఉత్పత్తుల ధరలను పెంచితే ఫోన్లు, ల్యాప్‌టాప్ ధరలు మరింత భారంగా మారనున్నాయి. కాగా, శాంసంగ్, షావోమి, వన్‌ప్లస్, మోటోరోలా వంటి పలు కంపెనీలకు క్వాల్‌కామ్ తన ఉత్పత్తులను సరఫరా చేస్తోంది.

## ఏఐ రంగంపై ప్రజలకు నమ్మకం పోతోంది: సత్యనాదెళ్ల



ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల (Satya Nadella) కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగం (AI Industry)పై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు. ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధ (AI)ను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకతకు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

# మన ఉత్పత్తులపై అమెరికా టారిఫ్ 10%



మనదేశ ఉత్పత్తులపై అమెరికా 10% సుంకాన్ని విధించింది. కార్మికులతో వెట్టి చాకిరీ చేయించడం ద్వారా వస్తువులు ఉత్పత్తి చేస్తున్నా, నిరోధించేందుకు సరైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలపై మరో 16 దేశాలపైనా ఇంతే స్థాయి టారిఫ్‌ను అమెరికా విధించింది. చైనా వంటి 43 దేశాలపై 12.5% సుంకాన్ని వర్తింపజేసింది. మనకు కాస్త ఊరట: జూన్ 3న వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద అమెరికా ఈ టారిఫ్‌లను ప్రతిపాదించింది. వెట్టి చాకిరీ ద్వారా, తయారైన వస్తువులను తమ దేశానికి పంపుతున్న దేశాలపై 12.5% వరకు సుంకం విధిస్తామని అప్పుడు తెలిపింది. అయితే 'వెట్టి చాకిరీ వినియోగంతో తయారయ్యే వస్తువులపై నిషేధం విధిసూ'్త మనదేశం విదేశీ వాణిజ్య విధానంలో ఈనెల 14న చేసిన సవరణలను పరిగణనలోకి తీసుకుని.. మన ఉత్పత్తులపై టారిఫ్‌ను 10 శాతానికి పరిమితం చేస్తున్నట్లు అమెరికా తాజాగా ప్రకటించింఇ. 60 దేశాల్లో వెట్టిచాకిరీ ధోరణిపై అమెరికా దర్యాప్తు చేపట్టడం ఇందుకు నేపథ్యం.

ట్రంప్ ఏమన్నారంటే: 'వెట్టిచాకిరీ నిరోధానికి భారత్ తీసుకున్న చర్యల నేపథ్యంలో.. ఈ తరహా నిషేధాలను ప్రవేశపెట్టే దేశాలను ప్రోత్సహించేందుకు, భారత ఉత్పత్తులపై టారిఫ్‌ను 10 శాతానికి పరిమితం చేయాలని ట్రేడ్ రెప్రెజెంటేటివ్ నాకు సలహానిచ్చార'ని మెమొరాండంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు.

గడువు పూర్తవుతున్నందునే: ప్రపంచ దేశాల నుంచి అమెరికాలోకి వస్తున్న ఉత్పత్తులపై 2025 ఏప్రిల్ లో 'లిబరేషన్ డే' పేరిట అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలను తిరస్కరిస్తూ, ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. దీంతో అధ్యక్షుడిగా తనకున్న అధికారాల మేరకు అన్ని దేశాల ఉత్పత్తులపై 10% తాత్కాలిక సుంకాలను 150 రోజుల పాటు విధిస్తూ, ట్రంప్ అప్పట్లో ఆదేశాలు జారీ చేశారు. ఈ గడువు పూర్తి కావడంతో యూఎస్ ట్రేడ్ రెప్రెజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) జేమిసన్ గ్రీర్.. 60 దేశాలపై ఈ కొత్త సుంకాలను ప్రకటించారు. తాజా సుంకాలు శుక్రవారం నుంచే అమల్లోకి వస్తాయి.

భారత్, కెనడా, బ్రిటన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ వంటి 17 దేశాల ఉత్పత్తులపై 10% సుంకం వర్తిస్తుంది. కార్మికుల వెట్టి చాకిరీతో తయారయ్యే వస్తువులపై నిషేధం విధించడానికి చట్టాలు లేని చైనా, జపాన్ సహా 43 దేశాల ఉత్పత్తులపై 12.5% టారిఫ్‌ను ట్రంప్ విధించారు. యూఎస్‌టీఆర్ చేపట్టిన రెండు దర్యాప్తులను భారత వ్యతిరేకించింది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఈ అంశాలను చర్చించుకోవచ్చని స్పష్టం చేసింది.

ట్రంప్ ప్రభుత్వం రాబోయే కొద్ది వారాల్లోనే ఇంకో దశ టారిఫ్ విధించే అవకాశం కనిపిస్తోంది. అదనపు ఉత్పాదక సామర్థ్యానికి రాయి తీలిచ్చే (చైనా వంటి) దేశాల నుంచి అమెరికాలోకి వచ్చే వస్తువులపై మరిన్ని సుంకాలు వర్తింపజేయాలని అమెరికా యోచిస్తోంది. ఆయా దేశాల వల్ల తక్కువ ధరతో ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లోకి వచ్చిపడుతుంటే, అమెరికా కంపెనీలు పోటీపడలేకపోతున్నాయన్నది అధికార వర్గాల వాదన.

1: మన ఎగుమతులకు అతిపెద్ద గమ్యస్థానం అమెరికా

2: అమెరికా మనకు రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి.

141 బి. డాలర్లు: 2025లో ద్వైపాక్షిక వస్తువుల వాణిజ్య విలువ. ఇందులో భారత ఎగుమతులు 87.3 బి.డాలర్లుగా ఉన్నాయి.






## దేశం గర్వించేలా ఝుండూ కుమార్ విజయం: ప్రధాని మోదీ

కామన్వెల్త్ గేమ్స్–2026 లో భారత్‌కు తొలి పతకం అందించిన పారా అథ్లెట్ ఝుండూ కుమార్‌ను ప్రధాని మోదీ ప్రశంసించారు. హెవీవెయిట్ పారా పవర్‌లిఫ్టింగ్‌లో కాంస్య పతకం గెలిచి యావత్ దేశం గర్వించేలా నిలిచాడని కొనియాడారు. అతడి విజయం అపారమైన శక్తికి, సంకల్పానికి నిదర్శనమన్నారు. ఎన్నో ఏళ్ల కఠిన సాధనకు ఫలితమని.. ప్రతి సవాల్‌ను అధిగమించి అంతర్జాతీయ వేదికపై రాణించాడని అభినందించారు. ఝుండూ కుమార్ విజయం ఎంతోమంది భారతీయులకు స్ఫూర్తిగా నిలుస్తోందని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. గ్లాస్గోలో జరిగిన హెవీవెయిట్ పారా పవర్‌లిఫ్టింగ్ ఫైనల్లో భారత పారా అథ్లెట్ ఝుండూ కుమార్ 190 కిలోల బరువును ఎత్తి మూడో స్థానంలో నిలిచాడు. దీంతో కామన్వెల్త్ గేమ్స్ పతకాల పట్టికలో భారత్ బోణీ కొట్టింది.

## పోలియో కాటేసినా.. రిక్షా నడిపి..

ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ పతకాల ఖాతా తెరిచింది. గ్లాస్గోలో జరిగిన హెవీవెయిట్ పారా పవర్‌లిఫ్టింగ్ ఫైనల్లో భారత పారా అథ్లెట్ ఝుండూ కుమార్ కాంస్య పతకం సాధించి దేశానికి తొలి పతకాన్ని అందించాడు. 190 కిలోల బరువును ఎత్తిన ఝుండూ 130.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. దీంతో కామన్వెల్త్ గేమ్స్ పతకాల పట్టికలో భారత్ బోణీ కొట్టింది. ఫైనల్లో తొలి ప్రయత్నంలో 181 కిలోల బరువును సునాయాసంగా ఎత్తిన ఝుండూ కుమార్, రెండో ప్రయత్నంలో



190 కిలోలను లిఫ్ట్ చేశాడు. ఈ ప్రదర్శనతో కొంతసేపు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకంపై ఆశలు రేకెత్తించాడు. కానీ, చివరి ప్రయత్నంలో 196 కిలోల బరువును ఎత్తేందుకు ప్రయత్నించి విఫలమవడంతో కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే, అంతర్జాతీయ క్రీడోత్సవంలో పోడియంపైకి చేరి భారత జెండాను రెపరెపలాడించిన ఝుండూ ప్రయాణం.. నల్లేరుపై నడకేం కాదు. పుట్టుకతోనే వైకల్యం కాటేసినా.. దాన్ని ఎదిరించి ఇప్పుడు దేశానికి పతకం అందించాడు. 29 ఏళ్ల ఝుండూ.. బిహార్‌లోని నలంద జిల్లా హర్నౌత్ గ్రామంలో ఓ పేద కుటుంబంలో జన్మించాడు. తండ్రి కూరగాయలమ్ముతూ కుటుంబాన్ని పోషించేవారు. చిన్నతనంలోనే పోలియో బారిన పడిన ఝుండూ.. ఏనాడూ దాన్ని తన ఎదుగుదలకు అడ్డంకిగా చూడలేదు. క్రీడల మీద ఆసక్తితో షాట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి ఆటలపై దృష్టిపెట్టాడు. అందులో రాష్ట్ర స్థాయి పతకాలు సాధించాడు. ఈ క్రీడలకు సన్నద్ధమవడం కోసం జిమ్‌లో ట్రైనింగ్ తీసుకున్నాడు. ఆ సమయంలోనే పవర్‌లిఫ్టింగ్‌పై అతడికి ఆసక్తి పెరిగింది. దీంతో పారా పవర్‌లిఫ్టింగ్ కోసం శిక్షణ ప్రారంభించాడు.

రిక్షా తొక్కి..

ఆటల పోటీల్లో పాల్గొనడం అంటే చిన్న విషయం కాదు. శిక్షణ ఎంత అవసరమో పోషకాహారం కూడా అంతే ముఖ్యం. అయితే, ఝుండూ ఆర్థిక పరిస్థితి కారణంగా న్యూట్రిషన్ ఫుడ్ తీసుకోవడం సాధ్యపడేది కాదు. దీంతో స్థానిక మార్కెట్లలో కూరగాయాలు విక్రయించేవాడు. ఆ సమయంలో వీల్‌ఛెయిర్ లేకపోవడంతో 20 కిలోమీటర్లు కష్టంగా ప్రయాణించాల్సి వచ్చేది. కొంతకాలానికి ఆ పనిమానేసి తెలిసిన మిత్రుల వద్ద అప్పు చేసి ఈ–రిక్షా కొనుక్కున్నాడు. దాన్ని నడపగా వచ్చిన డబ్బును తన శిక్షణ కోసం వెచ్చించేవాడు.

205 కిలోలు ఎత్తి..

ఝుండూ పాల్గొన్న తొలి జాతీయ ఛాంపియన్‌షిప్‌లో విజయం సాధించలేకపోయాడు. అయితేనేం.. పారాలింపిక్ కాంస్య పతక విజేత రాజిందర్ సింగ్ దృష్టిలో పడ్డాడు. అతడి ప్రతిభను గుర్తించిన రాజిందర్.. ఝుండూను గాంధీనగర్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు తీసుకెళ్లాడు. దీంతో అతడి దశ మారింది. 2025లో జరిగిన జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏకంగా 205 కిలోల బరువులెత్తి.. ఝుండూ సరికొత్త జాతీయ రికార్డ్ సాధించాడు. ఆ తర్వాత కొద్ది నెలలకే ఖేలో ఇండియా పారాగేమ్స్‌లో 206 కిలోలు ఎత్తి మరో రికార్డు సృష్టించాడు.

## ఇక బౌలర్‌గా వైభవ్ సూర్యవంశీ..!



యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని భవిష్యత్తులో బౌలర్‌గా కూడా తీర్చిదిద్దే ఆలోచనలో టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో రెండో టీ20కి ముందు మీడియాతో మాట్లాడిన బౌలింగ్ కోచ్ సునీల్ జోషి ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం వైభవ్ బ్యాటింగ్‌పైనే పూర్తి దృష్టి పెట్టామని, అతడు అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నాడని కొనియాడారు. తొలి టీ20లో 18 బంతుల్లో 50 పరుగులు చేసి అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచాడని పేర్కొన్నారు. వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌తో పాటు అతని బౌలింగ్ నైపుణ్యాలపైనా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు జోషి వెల్లడించారు. బౌలింగ్‌కు అవకాశం దొరికినప్పుడల్లా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (CoE)లో అతనితో కలిసి పని చేస్తానన్నారు. బౌలింగ్‌లో మంచి పురోగతి కనిపిస్తే.. వెంటనే దానిపై దృష్టి పెడతామని తెలిపారు. మరోవైపు.. సూర్యాంశ్ షెడ్గేను హార్దిక్ పాండ్యా, శివమ్ దుబెతో పోల్చడం సరికాదన్నారు. హార్దిక్, శివమ్ ఇప్పటికే జట్టులో తమ స్థానాలను స్థిరపరుచుకున్నారని, సూర్యాంశ్ ఇప్పుడే ఎదుగుతున్న యువ ఆల్‌రౌండర్ అని పేర్కొన్నారు. టీ20 ఫార్మాట్‌కు అనుగుణంగా సూర్యాంశ్‌ను తీర్చిదిద్దేందుకు జట్టు పూర్తి మద్దతు ఇస్తుందని వెల్లడించారు. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హర్ష్ దుబె వంటి ఆటగాళ్లు కూడా బౌలింగ్ చేయగల సామర్థ్యం కలిగిన వారేనని, టీ20 క్రికెట్‌లో అదనపు బౌలింగ్ ఆప్షన్లు ఉండటం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని జోషి అభిప్రాయపడ్డారు.

## టీమ్ఇండియా వైఫల్యాలపై.. వచ్చే నెలలో సమీక్ష: బీసీసీఐ



ప్రస్తుతం జింబాబ్వేతో టీ20 సిరీస్ ఆడుతున్న టీమ్ఇండియా.. వచ్చే నెలలో శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఆగస్టు 15 నుంచి ఆతిథ్య జట్టుతో రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ కోసం జులై 28న భారత జట్టును ప్రకటిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా వెల్లడించారు. ఐర్లాండ్, ఇంగ్లాండ్, జింబాబ్వే పర్యటనల్లో భారత జట్టు ఆటతీరుపై ఆగస్టు ఆరంభంలో సమీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. టీమ్ఇండియా సహాయక సిబ్బందిలో కొంతమంది కాంట్రాక్టు ముగిసిందని, దానిపై కూడా సమీక్షా సమావేశంలో చర్చిస్తామని సైకియా పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రెండు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్‌కు ఐర్లాండ్ షాకిచ్చిన సంగతి తెలిసిందే. తర్వాత ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లోనూ భారత్ వైట్‌వాష్‌కు గురైన సంగతి తెలిసిందే. ఇంగ్లిష్ జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్.. తర్వాత రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై సిరీస్‌ను చేజార్చుకుంది. ఈ నేపథ్యంలో భారత జట్టు ప్రదర్శనపై బీసీసీఐ పెద్దలు సమీక్ష నిర్వహించనున్నారు.

## జింబాబ్వేతో రెండో టీ20..

జింబాబ్వేపై తొలి టీ20లో విజయంతో జోష్ మీదున్న టీమ్ఇండియా.. అదే జోరును కొనసాగించాలని చూస్తోంది. హరారె వేదికగా నేడు జరిగే రెండో టీ20లో గెలుపొంది.. సిరీస్‌ను కైవసం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. అయితే రెండో టీ20లో జట్టులో ఒక కీలక మార్పు జరిగే అవకాశం కనిపిస్తోంది. తొలి టీ20లో ఒక్క పరుగు మాత్రమే చేసి నిరాశ పరిచిన ఓపెనర్ అభిషేక్ శర్మపై వేటు పడొచ్చని సమాచారం. అతడి స్థానంలో ప్రభ్‌సిమ్రన్ సింగ్‌కు ఛాన్స్ దక్కే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ ఓపెనింగ్ జోడీగా బరిలోకి దిగే అవకాశం ఉంది. కుడి–ఎడమ కాంబినేషన్ కూడా టీమ్‌కు లభించనుంది. తొలి టీ20లో జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడ్డ వైభవ్.. అంతర్జాతీయ క్రికెట్లో అత్యంత పిన్నవయసులో అర్ధశతకం (18 బంతుల్లో) సాధించిన బ్యాటర్‌గా ఘనత సాధించాడు. తొలి మ్యాచ్ ఫామ్‌నే కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. మూడో స్థానంలో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు వస్తారు. మిడిల్ ఆర్డర్‌లో తిలక్ వర్మ, రింకూ సింగ్, శివమ్ దూబే కొనసాగనున్నారు. తొలి మ్యాచ్‌లో ఐదుగురు బౌలర్లతో విజయం సాధించిన భారత్.. అదే కాంబినేషన్‌ను రెండో టీ20లోనూ కొనసాగించనుంది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే.. సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో టీమ్ఇండియా బరిలోకి దిగుతోంది.






## "అమ్మా నాకు ఆ అబ్బాయి కావాలి" ఆగస్టు 7 విడుదలకు

**వుదయం సినిమా :** డాక్టర్ టర్నెడ్ హీరోపవన్ మహావీరజిఎస్ఆర్ మూవీ మేకర్స్ పతాకంపై పవన్ మహావీర్ ను హీరోగా పరిచయం చేస్తూ... ప్రముఖ మహిళా వ్యాపారవేత్త శైలజ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విభిన్న ప్రేమకథా చిత్రం "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి". శివాల ప్రభాకర్ దర్శకత్వం వహిస్తున్న వర్షిక, సుహానా హీరోయిన్లు. సుమన్, రావు రమేష్, రాజీవ్ కనకాల, సత్యకృష్ణ, తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదల చేశారు!!



## మహేశ్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. 'దూకుడు' రీరిలీజ్ డేట్ ఫిక్స్..



**వుదయం సినిమా:** మహేశ్ బాబు హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో 2011లో విడుదలైన చిత్రం 'దూకుడు'. ఈ బ్లాక్ బస్టర్ చిత్రం ఇప్పుడు మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న రీరిలీజ్ కానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ టీమ్ రీరిలీజ్ టీజర్‌ను విడుదల చేసింది. ఇక ఈ సినిమాలో సమంత, ప్రకాశ్ రాజ్, సోనూసూద్‌ల నటనతో పాటు ఎం.ఎస్. నారాయణ కామెడీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## 'విశ్వనాథ్ & సన్స్' నుంచి రెండవ సాంగ్

**వుదయం సినిమా:** తమిళ అగ్ర కథానాయుడు సూర్య ప్రధాన పాత్రలో ప్రతిభగల దర్శకుడు వెంకీ అట్లూరి రూపొందిస్తోన్న చిత్రం 'విశ్వ నాథ్ & సన్స్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుం చి ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'నేనో బటర్‌ఫ్లై' విశేషంగా ఆకట్టుకుంది. ఆ ఉత్సాహంతో 'విశ్వనాథ్ & సన్స్' చిత్ర బృందం, 'ది వెడ్డింగ్ సాంగ్' రూపంలో అభిమానులకు మరో కానుకను తీసుకొచ్చింది. ఈ రెండవ గీతం విడుదలైన తక్షణమే అందరినీ అలరిస్తూ, అసలుసిసలైన వేడుకల గీతంగా ప్రశంసలు అందు కుంటోంది.ఉత్సాహ భరితమైన, పండుగ వాతావరణాన్ని తలపించే ఈ పాటలో.. సూర్య, మమితా బైజు తమ అద్భుతమైన నృత్యంతో తెరపై వెలుగులు నింపుతూ, ఒక ఘనమైన కుటుంబ వివాహంలోని ఆనందాన్ని, ఆత్మీయతను కళ్ళకు కట్టినట్లు చూపించారు.



## 'శ్రీనివాస మంగాపురం' మహేష్ బాబాయ్‌కి చాలా నచ్చింది


హీరో జై కృష్ణ ఘట్టమనేని

**వుదయం సినిమా:** సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు.

**మీకు యాక్టర్ కావాలనే ఆలోచన ఎప్పుడు మొదలైంది?**

–నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. నా 16వ ఏటా యాక్టర్ కావాలని నిర్ణయించుకున్నాను. డిసైడ్ అయిన తర్వాత ప్రాపర్‌గా ట్రైనింగ్ స్టార్ట్ చేశాను. రెండేళ్లు ముంబై వెళ్లాను. తర్వాత పాండిచ్చేరి వెళ్లాను.

**'శ్రీనివాస మంగాపురం' జర్నీ ఎలా స్టార్ట్ అయింది?**

–జెమినీ కిరణ్ గారి ద్వారా ఈ జర్నీ స్టార్ట్ అయింది. ఆయనే అజయ్ గారిని పరిచయం చేశారు. అలా ఈ సినిమా మొదలైంది. ఇంతకుముందు కూడా నేను కొన్ని కథలు విన్నాను.


**మీ ఫ్యామిలీ సపోర్ట్ ఎలా ఉంది? మహేష్ ఈ సినిమా చూశారా ?**

–నాకు ఫ్యామిలీ సపోర్ట్ ఉంది. ప్రతి అడుగులో బంగారు తాతయ్య ప్రోత్సాహం ఉంది.

**వైజయంతి మూవీస్‌లో మీ తొలి సినిమా చేయడం ఎలా అనిపిస్తోంది?**

–అశ్వినీ దత్ తో నాకు మంచి అనుబంధం ఉంది. వైజయంతి మూవీస్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలో లాంచ్ కావడం చాలా ఆనందంగా ఉంది.

## 'సౌండ్ ఇంజనీర్' – ఫస్ట్ లుక్



**వుదయం సినిమా**

రోహిత్ నారా, చినిమిల్లి మణికుమార్, భరత్ చౌదరి, కరణ్ సి ప్రొడక్షన్స్ LLP #RN23 టైటిల్ 'సౌండ్ ఇంజనీర్' ఆకట్టుకునే ఫస్ట్ లుక్ రిలీజ్ హీరో రోహిత్ నారా 23వ చిత్రం కంప్లీట్ ఎంటర్టైనర్ గా రూపుదిద్దుకుంటుంది. ఈ చిత్రాన్ని కరణ్ సి ప్రొడక్షన్స్ LLP నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్ట్ తో చినిమిల్లి మణికుమార్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. భరత్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా రూపొందిస్తున్నారు.రోహిత్ నారాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, చిత్ర నిర్మాతలు టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'సౌండ్ ఇంజనీర్' అనే ఇంట్రస్టింగ్ టైటిల్ పెట్టారు. స్పీకర్‌లా కనిపించే హార్ట్ సింబల్ 'O' అక్షరంతో కూడిన క్రియేటివ్ డిజైన్ టైటిల్ లోగో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. చేతితో రాసిన నోట్స్, ధ్వని తరంగాలు, విచిత్రమైన డూడుల్స్‌తో కూడిన ఈ డిజైన్, హీరో ఇంట్రస్టింగ్ వరల్డ్ ని పరిచయం చేస్తుంది.ఫస్ట్‌లుక్ పోస్టర్ రోహిత్ నారాను సరికొత్త అవతారంలో పరిచయం చేస్తుంది. తెల్లటి కుర్తా, పైజామా ధరించి, అతను ఒక టెర్రస్ అంచున కళ్ళు మూసుకుని ప్రశాంతంగా ధ్యానం చేస్తూ కనిపించారు. కూల్ పాస్టెల్ రంగులతో కలిసి, పోస్టర్‌కు ఆహ్లాదకరమైన ఫీలింగ్ ని అందిస్తోంది.

రోహిత్ నారా సరసన నయన్ సరిక కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రంలో నరేష్ వికె, రోహిణి, సంపత్, అజయ్‌లతో సహా పలువురు ప్రముఖ సహాయ నటీనటులు కీలక పాత్రలలో నటించారు. వినోదాన్ని మరింత పెంచుతూ, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ, రఘు కారుమంచి తమ అద్భుతమైన కామెడీ టైమింగ్ తో నవ్వులు పంచనున్నారు.

## 'వంద దేవుళ్ళు'ని స్ట్రీమింగ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించిన ZEE5 తెలుగు

**వుదయం సినిమా:** విజయ్ ఆంటోనీ పుట్టినరోజు సందర్భంగా ఆయన రీసెంట్‌గా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'వంద దేవుళ్ళు' ఆగస్టులో తమ ప్లాట్‌ఫామ్‌లో ఓటీటీ ప్రీమియర్ కానుందని ZEE5 తెలుగు ప్రకటించింది. అధికారిక స్ట్రీమింగ్ తేదీని త్వరలో ప్రకటించనున్నారు.ఇటీవల విడుదలైన 'పరిమళ & కో' ఫ్యామిలీ ఆడియెన్స్‌ని ఆకట్టుకుంది. జయరామ్, ఊర్వశి నటించిన ఈ చిత్రంలో కామెడీ, ఫ్యామిలీ



ఎమోషన్స్ అన్ని రకాల అంశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ విజయం ప్రేక్షకులకు వాస్తవికమైన, సులభంగా అర్థమయ్యే, ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లను అందించాలనే ZEE5 తెలుగు నిబద్ధతను మరింత చాటింది.ఇప్పుడు ZEE5 తెలుగు ఈవిజయ పరంపరను కొనసాగించేందుకు 'వంద దేవుళ్ళు'తో ముందుకువస్తోంది. ఇది ఫ్యామిలీ అంతటినీ ఒకచోట చేర్చే సామర్థ్యం ఉన్న చిత్రం. ఈ మూవీలోని భావోద్వేగాలు పూర్తిగా భిన్నమైనవి.నిజ సంఘటనల ఆధారంగా రూపొందిన 'వంద దేవుళ్ళు' చిత్రం వింతతువు, ఆమె ఇద్దరి కొడుకుల చుట్టూ తిరుగుతుంది. నలభై దాటడం, మధ్య వయస్సుకి వచ్చిన అమ్మని మళ్లీ పెళ్లి చేయాలని కొడుకు అనుకోవడం, ఆ తల్లి సైతం తోడును వెతుక్కోవాలని ఆలోచించినప్పుడు, ఆమె నిర్ణయం బంధువులు, గ్రామస్తులు, మొత్తం సమాజం నుండి ప్రతిఘటనను ఎదుర్కొంటుంది. తల్లి, కొడుకుల మధ్య ఉండే అందమైన బంధమే ఈ కథకు ప్రధాన ఆకర్షణ. ఒక తల్లి తన జీవితాంతం చేసే లెక్కలేనన్ని త్యాగాలను హైలైట్ చేస్తుంది.



గబ్బర్ సింగ్ ఫేమ్" రమేష్" కు బ్రెయిన్ స్ట్రోక్.అపోలో ఆసుపత్రిలో కొనసాగుతున్న చికిత్స. పరిస్థితి విషమమే నంటున్న అపోలో వైద్య బృందం.

## "చెన్నై లవ్ స్టోరీ" మూవీ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్

**వుదయం సినిమా:** హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన "చెన్నై లవ్ స్టోరీ" సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో ఆకట్టుకున్నారంటూ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారు. ప్రశంసలతో పాటు మంచి వసూళ్లు దక్కించుకుంటోంది "చెన్నై లవ్ స్టోరీ" సినిమా. ప్రీమియర్స్, వరల్డ్ వైడ్ గా డే 1 వసూళ్లు కలిపి ఈ సినిమా 12.3 కోట్ల రూపాయలు ఆర్జించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోడీవోపీ విశ్వాస్ డేనియల్ మాట్లాడుతూ – మా "చెన్నై లవ్ స్టోరీ" సినిమాను ఇంత పెద్ద సక్సెస్ చేసినందుకు థ్యాంక్స్. బ్యూటిఫుల్ లవ్ స్టోరీ అంటూ ప్రశంసలు వస్తున్నాయి. విజువల్స్ కు మంచి గుర్తింపు దక్కడం సంతోషంగా ఉంది అన్నారు. లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ మాట్లాడుతూ – ప్రేమ సారాన్ని చెప్పిన సినిమా ఇది. మిలియన్స్ వ్యూస్ కోసం, అవార్డ్స్ కోసం పాట రాస్తుంటాం. కానీ ఈ సినిమా కోసమే పాటలు రాశాను. వాళ్లను చూసి మా టీమ్ కూడా అదే భావోద్వేగానికి లోనవుతున్నాం. అన్నారు.నటుడు మహేందర్ మాట్లాడుతూ – మా సినిమాలో కిరణ్ గారు, గౌరి గారి పర్ ఫార్మెన్స్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఈ సినిమాకు మేము 50 రోజులు పనిచేస్తే, వాళ్లు రెట్టింపు టైమ్ వర్క్ చేశారు. మా సినిమా బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించడం సంతోషంగా ఉంది. అన్నారు.నటి ప్రమోదిని మాట్లాడుతూ – ఒక సినిమా హిట్ అయ్యింది అనే మాట వినడం ఎంతో సంతోషాన్నిస్తుంది. ఆ టీమ్ పడిన శ్రమకు ప్రతిఫలం దక్కింది కదా అనిపిస్తుంది.



## బొమ్మ బొమ్మ జూలై 27న రిలీజ్

**వుదయం సినిమా**

వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం నూతన దర్శకుడు రవి నెలకుదిటి దర్శకత్వంలో రూపొందుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ శ్రీ శ్రీ బిజీగా ఉన్నారు. ప్రతిష్టాత్మక ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, నిర్మాణ సంస్థకు 10వ (#SLV10) మైల్ స్టోన్ చిత్రంగా నిలుస్తోంది. ఇషాన్ సక్సేనా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ప్రేమ, వినోదం, మనసుని తాకే భావోద్వేగాలను అందంగా మేళవించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో దుల్కర్ సల్మాన్ సరసన పూజా హెగ్డే తొలిసారిగా నటిస్తున్నారు. ఇటీవల రిలీజ్ చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

మేకర్స్ ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేస్తున్నారు. జూలై 27న ఫస్ట్ సింగిల్ బొమ్మ బొమ్మ జూలై 27న రిలీజ్ కానుంది.

సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్ లో దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే ట్రెక్కింగ్ కాస్ట్యూమ్స్‌లో కొండ ప్రాంతంలోని సస్పెన్షన్ బ్రిడ్జిపై నడుస్తూ కనిపిస్తున్నారు. ఇద్దరి మధ్య కనిపిస్తున్న సహజమైన కెమిస్ట్రీ, చిరునవ్వులు పోస్టర్‌కు ఫ్రెష్ ఫీల్‌ను తీసుకొచ్చాయి. బ్యాక్‌డ్రాప్‌లో కనిపిస్తున్న రంగురంగుల జెండాలు, ప్రకృతి అందాలు సాంగ్ విజువల్ టోన్‌ను చూపిస్తున్నాయి.

ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. అనయ్ ఓం గోస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఈ ముగ్గురి ప్రతిభతో చిత్రం విజువల్‌గా ఎమోషనల్ గా అద్భుతంగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది."శ్రీ శ్రీ" చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో భారీగా విడుదల చేయనున్నారు.

తారాగణం: దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే

సాంకేతిక బృందం:
రచన, దర్శకత్వం: రవి నెలకుదిటి
నిర్మాత: సుధాకర్ చెరుకూరి
బ్యానర్: ఎస్.ఎల్.వి. సినిమాస్
సహ నిర్మాత: ఇషాన్ సక్సేనా
సీఈఓ: విజయ్ కుమార్ చాగంటి
సంగీతం: జి.వి. ప్రకాష్ కుమార్
డీఓపీ: అనయ్ ఓం గోస్వామి
ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా
పీఆర్ఓ: వంశీశేఖర్



## "ది మేజ్" ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

**వుదయం సినిమా**

తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా "ది మేజ్". ఈ మూవీలో ప్రియాంక, హ్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్ పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. "ది మేజ్" చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.